ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఖమ్మం
fb.com/vaartha Digital
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
25-7-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 174 పేజీలు: 8+16 వెల: 6.50

ఉపరాష్ట్రపతి ఎన్నికలో ఇండియా కూటమి పోటీ
బండి సంజయ్, ఉత్తమ్‌కు నాన్‌బెయిలబుల్ వారంట్లు
7

ఉభయ దేశాల మధ్య ఐదేళ్లలో 120 బిలియన్ డాలర్ల వాణిజ్యం
సుంకాల తగ్గింపుతో చౌకగా వివిధ వస్తువులు
వస్త్రాలు, తోలు, రత్నాలు, ఆభరణాలు, ఇంజినీరింగ్ వస్తువుల ధరలు బాగా తగ్గే అవకాశం

# భారత్, బ్రిటన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం


గురువారం లండన్‌లో బ్రిటన్ ప్రధాని కీర్‌స్టార్మర్‌తో భేటీ అయిన ప్రధాని మోడీ

## బ్రిటన్ ప్రధాని కీర్‌స్టార్మర్‌తో ప్రధాని మోడీ చర్చలు

**లండన్, జూలై 24:** భారత్, బ్రిటన్‌ల మధ్య జరిగిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వల్ల ఇరు దేశాలకు పరస్పరం ప్రయోజనం చేకూరనుంది. ముఖ్యంగా ఇరుదేశాల ఎగుమతులు, దిగుమతులపై భారీగా విధిస్తున్న సుంకాలను తొలగించడం లేదా తగ్గించడమే లక్ష్యంగా ఈ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం >>2

## ఎఫ్‌టిఎపై సంతకాలు చేసిన బ్రిటన్, భారత్ వాణిజ్య మంత్రులు

**లండన్,జూలై 24:** భారత్ బ్రిటన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. భారత ప్రధాని నరేంద్ర మోదీ, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ సమక్షంలో రెండు దేశాల వాణిజ్య మంత్రులు >>2


ఎఫ్‌టిఎపై సంతకాలు చేస్తున్న ఇరు దేశాల మంత్రులు పీయూష్, జోనాథన్


# 50% రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం



కులగణనను చట్టబద్ధం చేయాలి
న్యాయ విచారణలో అంతిమ విజయం తథ్యం
-మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్,జూలై 24,ప్రభాతవార్త:** తెలంగాణా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేబట్టిన కులగణనకు చట్టపరంగా ఎటువంటి చిక్కులు ఏర్పడ్డా తట్టుకుని అంతిమంగా విజయం సాధిస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.50 శాతం రిజర్వేషన్ల పరిమితి దాటిన చట్టపరంగా రాష్ట్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మార్గదర్శనం అవుతుందని ఆయన వ్యాఖ్యానించారు.గురువారం దేశరాజధాని కొత్తఢిల్లీలో "తెలంగాణా రాష్ట్రంలో జరిగిన కులగణన, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బి.సిల రిజర్వేషన్లు అన్న అంశంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రసంగించారు.ఏ.ఐ.సి.సి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే,లోకసభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ,ఏ.ఐ. సి.సి ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,పిసిసి అధినేత మహేష్ కుమార్ గౌడ్ తదితర సీనియర్ కాంగ్రెస్ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల వ్యవధిలోనే బి.సిల సామాజిక,ఆర్థిక,ఉపాధి ,రాజకీయ అంశాలపై కులగణన >>2

# మోడీ పుట్టు ఒబిసి కాదు


ఢిల్లీలో గురువారం పిపిపిలో ప్రసంగిస్తున్న సిఎం రేవంత్

ఆయన 'లీగల్లీ కన్వర్టెడ్' బిసి
కులగణనపై 88 కోట్ల పేజీల డేటా ఉంది
ఆ సర్వే నాకు ఆస్కార్ లాంటిది
రాష్ట్రంలో 56.36 శాతం ఒబిసిలే
42% కోటా కోసం పార్లమెంటులో పోరాడండి
సర్వే పిపిపిలో ముఖ్యమంత్రి రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై24:** తెలంగాణలో తమ ప్రభుత్వం ఇంటింటికి తిరిగి ప్రజల స్వీయ ధ్రువీకరణ పత్రంతో సేకరించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ కుల సర్వే దేశానికి రోల్‌మోడల్ అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు.సమగ్ర వివరాలతో.. క్షుణ్ణంగా చేపట్టిన సర్వేకు సంబంధించి 88 కోట్లపేజీల డాటా తమ వద్ద ఉందని సీఎం తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (ఎస్ఈఈఈపిసి) చేపట్టిన తీరు.. ఆ సర్వే ఆధారంగా తెలంగాణ ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు, విద్యా, ఉపాధి రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ శాసనసభలో ఆమోదించిన బిల్లులను >>2

## తెలంగాణ కులగణన దేశానికి మైలురాయి



నా అంచనాలు మించి రేవంత్ పనితీరు
దేశాభివృద్ధికి ఇంగ్లీష్ విద్యేమార్గం
కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై24:** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సర్వే దేశానికి ఒక మైలురాయి వంటిదని లోక్ సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ అభివర్ణించారు. కులగణన విషయంలో రేవంత్ రెడ్డి,ఆయన బృందంతన అంచనాలకు మించి పని చేసిందనిరాహుల్ గాంధీ ప్రశంసించారు. >>2

# 'కార్డు'లు ప్రజల చేతుల్లోకి



నేటి నుంచి ఆగస్టు 10 దాకా పంపిణి
5.61లక్షల రేషన్‌కార్డులు సిద్ధం

**హైదరాబాద్,జూలై 24, ప్రభాత వార్త:** తెలంగాణ వ్యాప్తంగా శుక్రవారం నుంచి కొత్త రేషన్ కార్డుల పంపిణి చేయడం ప్రారంభించనున్నారు. ఈ మేరకు మంజూరైన లబ్ధిదారుల కార్డులు 33 జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయానికి చేరుకున్నాయి. వాటిని అధికారులు మండలాల వారీగా వేరు చేస్తున్నారు. ఏకకాలంలోనే 5.61లక్షల తెల్లరేషన్‌కార్డులు పంపిణీప చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో 3.09 కోట్ల మంది లబ్ధిదారులకు ఇక నుంచి సన్నబియ్యం అందే అవకాశం ఉంది.జూలై 14న సూర్యపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం పరిధిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో లాంఛనంగా ప్రారంభించారు. శుక్రవారం నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో పంపిణీ చేయాలని సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు.అన్ని మండలాలలో ప్రజాప్రతినిధుల సమక్షంలో రాష్ట్రవ్యాప్తంగా కార్డుల పంపిణీ చేసేందుకు వీలుగా ఎమ్మెల్యేలకు అనుకూలంగా ఉండే తేదిలను మండల అధికారులు తీసుకొని షెడ్యూల్ నిర్ధారణ చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2019, 2021లలో కొత్తగా ఆహార భద్రత కార్డులు జారీ చేశారు. ఆ తరువాత కొత్త కార్డుల జాడలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజాపాలన, మీసేవా కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. రెవెన్యూ అధికా రులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను గుర్తించారు. పౌరసరఫరాల కార్పొరేషన్ రూ.59వేల కోట్లు అప్పులతో ఉంది. అంతే కాదు రూ.11వేల కోట్ల నష్టాలతో ఉంది. ఐనప్పటికి కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు పట్టెడన్నం పెట్టడానికి తగ్గడంలేదు. ఏటా రూ.13వేల కోట్లు ఖర్చుపెట్టి సన్నబియ్యం పంపిణీకి సిద్ధమైంది. రేషన్ షాపులకు కావాల్సిన సన్నబియ్యం రైతులను పండించేందుకు క్వింటాల్‌కు ఐదువందల బోనస్ కూడా ప్రకటించడంతో దాని భారం కూడా పెరిగింది.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా పంపిణీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆసిఫాబాద్ జిల్లాలో రేషన్ కార్డుల కోసం మీసేవా కేంద్రాల ద్వారా 10,410 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీటిలో 7,443 మంది అర్హులుగా గుర్తించింది. 134 దరఖాస్తులను తిరస్కరించింది. మిగతావి డీఎస్‌వో, తహసీల్దార్, ఆర్ఐల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే వివాహమై పిల్లలు కలిగిన వారు >>2



## ఎపికి అక్రమంగా సాగర్ నీటి విడుదల!

కెఆర్ఎంబికి ఫిర్యాదు చేసిన తెలంగాణ
బోర్డు ఆదేశాలతోనే చేశామంటున్న ఎపి అధికారులు

**హైదరాబాద్, జూలై 24,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ అధికారులు నాగార్జున సాగర్ కుడికాల్వకు నీటిని విడుదల చేసిన అంశంపై తెలంగాణ అధికారులు కృష్ణానది యాజమాన్య బోర్డుకు ఫిర్యాదు గురువారం ఫిర్యాదు చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఉండటంతో సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ఆడిందేఆట పాడిందే పాట అన్నట్లుగా వ్యవహరిస్తున్నది. నాగార్జునసాగర్ కుడి కాలువకు ఆంధ్రప్రదేశ్ ఎన్ఎస్‌పి >>2

# 18 నెలల్లో రూ.3.2 లక్షల కోట్ల పెట్టుబడులు

3 ట్రిలియన్ డాలర్ల లక్ష్య సాధనలో పాలు పంచుకోండి
యుఎఇ పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్ బాబు పిలుపు



**హైదరాబాద్, జూలై 24 ప్రభాతవార్త:** తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చి దిద్దాలనేదే మా ప్రభుత్వ సంకల్పమని, ఈ లక్ష్య సాధనలో పాలు పంచుకోవాలని యూఏఈ పారిశ్రామికవేత్తలను రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. గురువారం హెచ్ఐసిసిలో యూఏఈ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా ఇన్వెస్టోపియా గ్లోబల్ పేరిట నిర్వహించిన అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సును ఆయన లాంఛనంగా ప్రారంభించారు. భౌగోళికంగా చిన్నదైనా, ఆశయాలు, ఆచరణలో మాత్రం తెలంగాణ చాలా పెద్దది. స్వల్ప కాలంలోనే ఫీనిక్స్ పక్షిలా ఎదిగి ఇతర రాష్ట్రాలకు అభివృద్ధి, సంక్షేమంలో ఆదర్శంగా నిలిచింది. 2024-25లో జిఎస్‌డిపిలో 8.2 శాతం వృద్ధి నమోదైందని అన్నారు. ఇది జాతీయ సగటు(7.6శాతం) కంటే ఎక్కువ. దేశ జిడిపిలో తెలంగాణ వాటా 5 శాతానికి పైగా ఉందని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. రాష్ట్రంలో డ్రై పోర్టులు, మల్టీమోడల్ లాజిస్టిక్స్ పార్కులు, పారిశ్రామిక కారిడార్ల విస్తరణకు ప్రణాళికలు రూపొందించాం. నెట్‌జీరో పారిశ్రామిక పార్కులు, ఈవీ జోన్లు, గ్రీన్ లాజిస్టిక్స్ హబ్‌లు, రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్), మెట్రో ఫేజ్ - 2 తదితరాలు పారిశ్రామికాభివృద్ధికి మరింత ప్రోత్సాహం ఇవ్వనున్నాయని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయబోతున్న ఫ్యూచర్ సిటీ ఫిన్‌టెక్, క్లైమేట్‌టెక్, స్మార్ట్ మొబిలిటీ ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా మారబోతుందని, డేటా సెంటర్లు, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు(జిసిసి), ఏఐ ల్యాబ్‌లు, ఏరోస్పేస్ క్లస్టర్లలో వేగవంతమైన వృద్ధి నమోదవుతోందని పేర్కొన్నారు. ఈ 18 నెలల్లో తెలంగాణ కొత్తగా రూ.3.2 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించిందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో యూఏఈకి తెలంగాణ ఎగుమతులు 2.5 రెట్లు పెరిగాయి. ఫార్మా, ఏరోస్పేస్, డిజిటల్ సేవలు, ఫుడ్ ప్రాసెసింగ్ కీలక పాత్ర పోషించాయి. ఇప్పటికే యూఏఈకి చెందిన లులు గ్రూప్, డిపి వరల్డ్, నాఫ్కో వంటి యూఏఇ కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూఏఈ మినిస్టర్ ఆఫ్ ఎకానమీ, టూరిజం అబ్దుల్లా బిన్ తాక్ అల్ మర్రి, రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ స్పెషల్ సిఎస్ సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వృత్తి విద్య కాలేజీలకు ఇక గ్రేడింగ్!

త్వరలో కమిటీ నియామకం
ట్యూషన్ ఫీజులు నిర్ణయించనున్న కమిటీ
రాష్ట్రంలో 850కి పైగా వృత్తి విద్యకళాశాలలు

**హైదరాబాద్, జులై 24, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న వృత్తి విద్య కాలేజీలకు ఇకపై గ్రేడింగ్‌ను ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించి త్వరలోనే రాష్ట్ర సర్కార్ కమిటీని ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్టు తెలిసింది. ప్రభుత్వం నియమించే కమిటీ చేసే ప్రతిపాదనల మేరకు రాష్ట్రంలోని ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబిఏ, ఎంసిఏ, బిఈడి, ఎంఈడి, ఎంటెక్,ఎం ఫార్మసీ, బి ఆర్క్, ఎం ఆర్క్ కోర్సులను అందించే కాలేజీలకు గ్రేడింగ్‌ను ఇవ్వనున్నారు. కమిటీ ఇచ్చిన గ్రేడింగ్ మేరకు ఆయా కాలేజీలకు ట్యూషన్ ఫీజును నిర్ణయించాలనే యోచనలోనూ ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలోని వృత్తి విద్య కాలేజీలకు 5 గ్రేడ్‌లను ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. ఏప్లస్, ఏ, బి, సి, డి గ్రేడ్‌లను ఇవ్వనున్నారు. కాలేజీలు పొందిన గ్రేడ్‌లకు అనుగుణంగా ట్యూషన్ ఫీజులను నిర్ణయించే అవకాశం ఉంది.ఇందుకు సంబంధించి ఇతర రాష్ట్రాల్లో ట్యూషన్ ఫీజు చెల్లింపులకు సంబంధించి ఆయా రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాన్ని అధ్యయనం చేసి.. రాష్ట్రంలో వాటిని ఎలాఅమలు చేయాలో చూసి తద్వారా ట్యూషన్ ఫీజును నిర్ణయించాలనే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. కాలేజీలకుగ్రేడింగ్‌ను ఇవ్వడానికి నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(న్యాక్) గ్రేడ్, నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ ర్యాంకింగ్(ఎన్ఐఆర్ఎఫ్), కాలేజీలో ఉన్న మౌలిక సదుపాయాలు, విద్యార్థులు సాధిస్తున్న ప్లేస్‌మెంట్‌తోపాటు కాలేజీలోని బోధన సిబ్బంది వారికిస్తున్న వేతనాలు సహా అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుని కాలేజీలకు గ్రేడింగ్‌ను ఇవ్వనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో 10 మంది సభ్యుల కమిటీని ఏర్పాటు చేయనున్నట్టు తెలిసింది. కమిటీకి తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ నాయకత్వం వహించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. కమిటీలో సాంకేతిక విద్యా శాఖ కమిషనర్, జేఎన్‌టియు, ఓయూ నుంచి ఇద్దరు అధికారులు ఉండే అవకావం ఉంది.



## చైనా సరిహద్దుల్లో కూలిన రష్యా విమానం

49 మంది మృత్యువాత

**మాస్కో, జూలై 24:** రష్యాకు చెందిన ఎఎన్-24 విమానం రాడార్ నుంచి సంబంధాలు తెగిపోయి చైనా సరిహద్దుల్లోని తూర్పు ప్రాంతంలో కుప్పకూలింది. ప్రమాద సమయంలో విమానంలో దాదాపు 49 మంది వరకు ప్రయాణికులు ఉన్నారని తెలుస్తోంది. తొలుత విమానం అదృశ్యమైనట్లు వార్తలు రాగా, కాసేపటి క్రితమే కూలిపోయిందని అధికారులు నిర్ధరించారు. రష్యన్ వార్తా కథనాల ప్రకారం.. గురువారం తెల్లవారుజామున 49 మంది ప్రయాణికులతో వెళ్తున్న రష్యా విమానం తొలుత అదృశ్యమైంది. సైబీరియాకు చెందిన అంగారా ఎయిర్‌లైన్స్ ఎఎన్-24 విమానం బ్లాగోవెష్‌చెన్స్క్ నుంచి చైనా సరిహద్దుల్లో ఉన్న టిండా ప్రాంతానికి బయల్దేరింది. మరికొద్ది సేపటికి ల్యాండింగ్ అయ్యే సమయానికి >>2


ములుగు జిల్లా తాడ్వాయి మండలానికి చెందిన గర్భిణిని కిన్నెరసాని వాగులో మోసుకెళ్తున్న గ్రామస్తులు

## గర్భిణిని పురిటినొప్పులతో కిన్నెరసాని దాటించిన గ్రామస్తులు

# తడిసి ముద్దయిన తెలంగాణ

బెజ్జూరులో 23.6 సెం. మీ వర్షపాతం
30 చోట్ల 7 సెం. మీ మించి కురిసిన వర్షం
భద్రాచలంలో గోదావరి పరవళ్లు
ఖమ్మంలో వరదలో చిక్కుకుపోయిన పశువుల కాపరులు

**హైదరాబాద్, జూలై24,ప్రభాతవార్త:** ఉత్తర బంగాళాఖాతం మధ్య ప్రాంతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా తెలంగాణ వ్యాప్తంగా జోరుగా గురువారం కూడా కురిసింది. బెజ్జూరులో గురువారం ఉదయం వరకు 23.6సెం.మి వర్షాపాతం నమోదైంది. ములుగులో 21.8 కరీంనగర్ జిల్లా పోచంపల్లిలో 14.4సెం.మి, కరీంనగర్ కలెక్టరేట్.ములుగు జిల్లా మంగపేటలో 12సెం.మి, మల్లంపలిలో 11.8సెం.మి, మానకొండూర్ మండలం గంగిపల్లిలో 11.6సెం.మి వర్షం కురిసింది. రాష్ట్రంలో 30 కేంద్రాలలో 7సెం.మి కంటే అత్యధిక వర్షాపాతం నమోదైంది. >>2



గురువారం తల్లిదండ్రులకు పాదాభివందనం చేస్తున్న కెటిఆర్

# కెటిఆర్‌కు సిఎం రేవంత్ జన్మదిన శుభాకాంక్షలు

## తనయుని ఆశీర్వదించిన కెసిఆర్ దంపతులు

### సోదరునికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై24:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా గురువారం ఆయనకు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, పార్టీ కార్యకర్తలు, సన్నిహితుల నుంచి సోషల్ మీడియా వేదికగా జన్మదిన శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. కల్వకుంట్ల తారక రామారావు జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడటంలో భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. కేటీఆర్ సోదరి, ఎమ్మెల్సీ కవిత కూడా ఆయనకు ఎక్స్ (ట్విట్టర్) ద్వారా బర్త్‌డే విషెస్ తెలియజేశారు. "అన్నయ్య.. మెనీ హ్యాపీ రిటర్న్స్ ఆఫ్ ది డే!" అని ట్వీట్ చేస్తూ కేటీఆర్‌ను ట్యాగ్ చేశారు. కాగా, ఇటీవల బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు లేఖ నేపథ్యంలో కేటీఆర్, కవిత మధ్య కాస్త గ్యాప్ వచ్చిందని రాజకీయ వర్గాల్లో చర్చ జరిగిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా, తన పుట్టిన రోజు సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. తన తండ్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆశీర్వాదం తీసుకున్నారు. భార్య శైలిమ, కుమారుడు హిమాన్షుతో ఎర్రవెల్లి నివాసానికి చేరుకున్న కేటీఆర్, తన తల్లిదండ్రులను కలిసి వారికి పాదాభివందనం చేశారు. ఈ సందర్భంగా వారు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కేసీఆర్ – శోభమ్మ దంపతులు కేటీఆర్‌ను ఆశీర్వదించారు.

**తెలంగాణ భవన్‌లో ఘనంగా కెటిఆర్ జన్మదిన వేడుకలు**

అంతకు ముందు తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. తన పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అభిమానులకు కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపేందుకు తెలంగాణ భవన్‌కు వచ్చిన అభిమానులు, కార్యకర్తలు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ క్రమంలో ఒక మహిళా అభిమాని ఆయనతో ముచ్చటించి, సెల్ఫీ దిగింది. అనంతరం ముద్దు పెట్టడానికి ప్రయత్నించగా, కేటీఆర్ సున్నితంగా వెనక్కి తగ్గి ఆమెను వారించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాలలో వైరల్ అయింది.

# కూలిన రష్యా విమానం

>> ఎయిర్ ట్రాఫిక్ కంట్రో లర్లతో విమానానికి సంబంధాలు తెగిపోయా యి.దీంతో అప్రమత్తమైన యంత్రాంగం వెం టనే ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టిం ది.అదృశ్యమైన కొద్దిసేపలికే రష్యా అత్య వసర పరిస్థితుల మంత్రిత్వ శాఖ విమానం 'కూలిపోతున్న ఫ్యూజ్‌లేజ్' కనుగొన్నట్లు తెలి పింది.అయితే ఆ విమానం ల్యాండ్ అయ్యేం దుకు 15 కిలోమీటర్ల దూరంలో ఉండగా కూలిపోయినట్లు అధికార వర్గాలు తెలిపాయి. చైనా సరిహద్దుల్లోని టిండా విమానాశ్రా యానికి చేరువలోనే విమానప్రమాదం జరిగింది. ప్రమాద సమయం లో విమానంలో ఐదుగురు పిల్లలు, ఆరుగురు సిబ్బందితోపాటు 34 మంది ప్రయాణికులు ఉన్నారని రష్యన్ మీడియా కథనాలు తెలిపాయి. సహాయ చర్యల కోసం ప్రత్యేక దళాలను ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. కాగా, ఘటనా స్థలంలో భారీగా మంటలు చెలరేగాయి. రెస్క్యూ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యల్లో పాల్గొన్నారు. విమానం తొలుత ల్యాండింగ్‌కు ప్రయత్నించగా అది విఫలం కాగా, మరోసారి ల్యాండింగ్ చేసేటపుడు ప్రమాదానికి గురైనట్లు తెలుస్తోంది.కాగా, ఈ ప్రమాదంలో ఎవరూ బతికే అవకాశం లేదని రష్యా వార్త కథనంఒకటి ప్రకటించింది. ఘటనాస్థలిలో విమాన శకలాలకు సంబం ధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. పైలట్ తప్పిదం, ల్యాండింగ్ సమయంలో వాతావరణం అనుకూ లించకపోవ డమే ప్రమాదానికి కారణం కావచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నా యి. గతసెప్టెంబరులో, ముగ్గురు వ్యక్తులతో వెళ్తున్నరాబిన్సన్ ఆర్66 హెలికాప్టర్ ఇదే అమూర్ ప్రాంతంలో అదృశ్యమైంది. ఈ ప్రాంతంలో మాస్కోకు తూర్పున దాదాపు 6,600 కి.మీ దూరంలో ఉంది.

# 'కార్డు'లుప్రజలచేతుల్లోకి

>> కొత్తగా వారి పేర్లను చేర్చడం కోసం దరఖాస్తులు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 1,41,904 కార్డులు ఉండగా ఇందులో 4.48 లక్షల మంది సభ్యులున్నారు. వివాహమై పిల్లలు కలిగిన వారు కొత్తగా వారి పేర్లను చేర్పించడం కోసం దరఖాస్తులు చేస్తున్నారు. మీసేవా కేంద్రాల ఏప్రిల్ నుంచి జూలై 15 వరకు 24,637 కార్డుదారులు కొత్త సభ్యుల చేర్పుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. వీటిలో 21,613 మంది కార్డులో సభ్యులను జోడించి మంజూరు చేశారు. మిగతా కార్డులకు సంబంధించి అధికారుల పరిశీలన కొనసాగుతోంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో 8248రేషన్‌కార్డులు పంపిణీ చేయబోతున్నారు.
35వేల మందిని కొత్తగా పాతకార్డులలో చేర్చబోతున్నారు.హైదరాబాద్‌లో రేషన్‌కార్డుల కోసం 2,19,717 దరఖాస్తులు వచ్చాయి 43115 రేషన్‌కార్డులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి 1,26,875 దరఖాస్తులు పరిశీలన దశలో ఉన్నాయి .ఖమ్మం జిల్లా మధిరలో ఒకేరోజు 13767 రేషన్‌కార్డులు మంజూరు చేస్తున్నందుకు డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క సంతోషం వ్యక్తంచేశారు.

# అక్రమంగా సాగర్ నీటి విడుదల!

>> అధికారులు ఎటువంటి అనుమతులు లేకుండా నీటిని బుధవారం విడుదల చేశారు. శ్రీశైలం పూర్తిస్థాయిలో నిండకముందే పోతిరెడ్డిపాడు నుంచి నీటి తరలించారు. నాగార్జున సాగర్ కుడి కాలువ నుంచి నీటిని అక్రమంగా విడుదల చేసుకున్నది. కుడి కాలువకు నీటి విడుదల విషయంలో ఏపీ అధికారులు కేఆర్ఎంబీ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా బుధవారం సాయంత్రం నీటిని విడుదల చేశారని ఎన్ఎస్‌పి ఎస్ఇ మల్లికార్జునరావు ఫిర్యాదులో పేర్కొన్నారు.కృష్ణా నది యాజమాన్య బోర్డు ఆదేశాలతోనే కుడి కాలువ మూడో గేటు ద్వారా 500 క్యూసెక్కులు నీటిని విడుదల చేశామని ఏపీ అధికారులు చెబుతున్నారు. శ్రీశైలం జలాశయం నుంచి భారీగా వరద వస్తోందని, ప్రాజెక్టులో నీటిమట్టం క్రమంగా పెరుగుతున్నట్లు తెలిపారు.

# పంచాయతీరాజ్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసు పొడిగింపు

**హైదరాబాద్,జులై 24,ప్రభాతవార్త:** ప్రభుత్వంలో పనిచేసున్న ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం భారీ గుడ్ న్యూస్ తెలిపింది. పంచాయితీ రాజ్, గ్రామీణాభివృది శాఖలో పని చేసున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కు శుభ వార్తను అందించింది. పంచాయితీరాజ్, గ్రామీ ణాభివృది శాఖలో ఫిక్స్,టెన్యూర్, కాంట్రాక్, ఔట్ సోర్స్ విధానంలో పనిచేసున్న దాదాపు 12,055 మంది.ఉద్యోగుల సేవలను పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.
వీరందరినీ మార్చ్ 31, 2026 వరకు పొడిగిస్తూ జీవో జారీ చేసింది.దీంతో ఈ ఉద్యోగుల 3 నెలల పెండింగ్ జీతాలు ప్రాసెస్ పూర్తయి మరో రెండు రోజుల్లోనే వారందరికీ జీతాలు అందనున్నాయి. కాగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వాన్ని ఒప్పించినందుకు పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కకు ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు.

# బిసి రిజర్వేషన్ల ఆర్డినెన్స్.. కేంద్ర హోం శాఖకు పంపిన గవర్నర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై24:** బీసీ రిజర్వేషన్ల వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్‌ను పంపగా.. ఆయన న్యాయ సలహా కోసం దానిని కేంద్ర హోంశాఖకు గురువారం పంపించారు. అయితే రెండు,మూడు రోజులుగా అడ్వొకేట్ జనరల్, న్యాయనిపుణులతో చర్చించిన అనంతరం గవర్నర్ ఈ ఆర్డినెన్స్‌ను హోంశాఖకు పంపాలనే నిర్ణయం తీసుకున్నారు.దీంతో బీసీ రిజర్వేషన్స్ ఆర్డినెన్స్ మరింత ఆలస్యం కానున్నట్లు తెలుస్తోంది. మరోవైపు హైకోర్టు ఆదేశాల మేరకు తెలంగాణలో స్థానిక ఎన్నికలు సెప్టెంబర్ 30 లోగా పూర్తి చేయాల్సి ఉంది. కాగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం ఓ కొలిక్కి వచ్చాకే స్థానిక ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం యోచిస్తోంది. అయితే, బీసీ రిజర్వేషన్ల బిల్లుపై గవర్నర్ పలు సందేహాలు వ్యక్తం చేశారు. వాటిని అడ్వకేట్ జనరల్‌తోపాటు సీనియర్ న్యాయవాదులు నివృత్తి చేశారు. అనంతరం కేంద్రానికి పంపారు. అయితే గతంలో సుప్రీం కోర్టు సైతం 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఉండకూడదంటూ ఇచ్చిన తీర్పును ఈ ఆర్డినెన్స్ ఉల్లంఘించినట్లు అవుతుందా? లేదా? అంటూ గవర్నర్ అనుమానం వ్యక్తం చేశారు. అందులోభాగంగా న్యాయసలహా కోసం కేంద్ర హోమ్‌మంత్రిత్వశాఖకు ఈఆర్డినెన్స్ పంపారు.

## వారం - వర్జ్యం

25-07-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
పాడ్యమి రా.11.27
పుష్యమి సా.4.05
వర్జ్యం : తె.4.48-6.24
దు.ఉ.8.22-9.14, 2) మ.12.41-1.33
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** చర్చలు మందకొడిగా సాగుతాయి. బంధువుల నుండి కీలక సమాచారం అందుతుంది. అందరిలోనూ గుర్తింపు పొందుతారు.

**వృషభం:** ఉద్యోగులలో బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. మీ ప్రయత్నాలు అనుకూలిస్తాయి.

**మిథునం:** కాంట్రాక్టులు దక్కించు కొంటారు. సేవాకార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. ఇంటాబయటా అనుకూలం.

**కర్కాటకం :** జీవిత భాగస్వామ్య సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**సింహం:** సన్నిహితుల నుండి కీలక సమాచారం అందుకొంటారు. కుటుంబ సభ్యుల నుండి సాయం అందుతుంది.

**కన్య :** ఆర్థిక లావాదేవీలు కొంత నిరాశ పరుస్తాయి. ముఖ్యమైన పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి.

**తుల :** సోదరులను కలిసి ఆనందంగా గడుపుతారు. ఆదాయమార్గాలు మెరుగు పడును. ఇంటా బయటా ప్రోత్సాహం.

**వృశ్చికం:** కళాకారులు, రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి ప్రభుత్వ రంగాల నుండి ఆహ్వానాలు అందుతాయి.

**ధనుస్సు:** ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. గృహ నిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి.

**మకరం:** ఎంతో కాలంగా వేధిస్తున్న సమస్యలు కొంతవరకు తీరుతాయి. వృత్తి, వ్యాపారాలు లాభిస్తాయి.

**కుంభం:** కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. విలువైన వస్తు వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు.

**మీనం :** దూరప్రాంతాల నుండి శుభ వార్తలు అందుకొంటారు. ప్రముఖులతో ఉత్తర ప్రత్యుత్తరాలు సాగిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మోడీ పుట్టు ఒబిసి కాదు

>> పార్లమెంట్‌లో ఆమోదానికి ఒత్తిడి తెచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ ఎంపీలకు ఢిల్లీ ఏఐసీసీ కార్యాయలంలో గురువారం సాయంత్రం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ కుల గణనకు హామీ ఇచ్చారన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 2024, ఫిబ్రవరి 4వ తేదీతో సర్వేను ప్రారంభించి 2025, ఫిబ్రవరి 5వ తేదీనాటికి ఏడాది కాలంలో ఆ మొత్తాన్ని పూర్తి చేశామని సీఎం తెలిపారు. అందుకే ఫిబ్రవరి 4ను తెలంగాణలో సామాజిక న్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామని సీఎం వెల్లడించారు. కులగణన చేపట్టే సమయంలో అనేక మంది అగ్ర కులాల నాయకులు తన వద్దకు వచ్చి అభ్యంతరాలు, సందేహాలు వ్యక్తం చేశారని... కాలనుగుణంగా మార్పులకు అవకాశం ఇవ్వాలని వారికి సూచించినట్లు సీఎం తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం కోసం 60 ఏళ్ల పాటు పోరాటాలు జరిగాయని, అనేక మంది అమరుల య్యా రని.. కానీ 2009, డిసెంబరు 9న ప్రకటన చేయడంతో పాటు తెలంగాణ ఇచ్చి తెలంగాణ ప్రజల కలను సోనియా గాంధీ నెరవేర్చారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అదే తెలంగాణలో కుల గణనపై రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని తమ ప్రభుత్వం నెరవేర్చిందని సీఎం పేర్కొన్నారు. బీజేపీ నాయకులు చెప్పినవి ఏవీ చేయరని... అందుకు విరుద్ధంగా గాంధీ కుటుంబం చెప్పిన ప్రతి మాటను నిలుపుకుంటుందని చెప్పారు... కుల గణనకు సంబంధించి తమ ప్రభుత్వం 56 ప్రశ్నలతో ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తి వద్దకు వెళ్లి సమాచారం సేకరించిందని, సర్వే సమయంలో అందుబాటులో లేనివారికి ఆన్‌లైన్ ద్వారా, టోల్ ఫ్రీ ద్వారా నమోదు చేసుకునే అవకాశం కల్పించామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. సర్వే ప్రకారం తెలంగాణలో బీసీలు 56.36 శాతం ఉన్నారని సీఎం తెలిపారు. సర్వేలో 3.9 శాతం మంది తమది ఏ కులం కాదని ప్రకటించుకున్నారని, ఇది తెలంగాణలో సరికొత్త పరిణామమని సీఎం చెప్పారు. అదే సమయంలో వీరంతా ఎవరని సర్వే చేసిన వారు,స్వతంత్ర నిపుణుల బృందం పరిశీలించగా వాళ్లంతా ఇంగ్లీష్ విద్యను అభ్యసించిన ఉన్నత విద్యావంతులన్నారు. సర్వే ప్రకారం తాము స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఒక బిల్లు, విద్యా, ఉపాధి అవకాశాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మరో బిల్లు ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపించామని తెలిపారు. బీజేపీ తొలి నుంచి బీసీలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని సీఎం విమర్శించా రు. తాను బీసీ నేతను అని ప్రధాని మోదీ పదేపదే చెప్పుకుంటున్నారని, నరేంద్ర మోదీ పుట్టుకతో బీసీ కాదని, లీగల్లీ కన్వర్టెడ్ బీసీ అన్నారు. ఓబీసీల కోసం ప్రధాని మోదీ మనస్ఫూర్తిగా చేసిందేమీ లేదని, ఆయనకు బీసీలపై నిజమైన ప్రేమ లేదని కుండబద్దలు కొట్టారు. తాము కుల గణన చేపట్టమని రాజ్‌నాథ్ సింగ్ పార్లమెంట్‌లో చెప్పారని సీఎం గుర్తు చేశారు. రైతుల నల్ల చట్టాల విషయంలో రాహుల్ గాంధీ గళం విప్పిన తర్వాత మోదీ వాటిని రద్దు చేసి క్షమాపణ చెప్పారని... ఇప్పుడు రాహుల్ గాంధీ మాట మేరకు తెలంగాణ ప్రభుత్వం కులగణన చేపట్టిన తర్వాత కేంద్రం కుల గణనకు అంగీకరించిందని... ఇదంతా రాహుల్ గాంధీ ఘనతేనని సీఎం అన్నారు. తాము చేపట్టిన సర్వే దేశానికి రోల్ మోడల్ అని... ఇది తెలంగాణ మోడల్ అని, నేను దీనిని రేర్ మోడల్ అంటున్నానని,రేర్ అంటే ఏమిటో నేను త్వరలో వివరిస్తానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రాహుల్ గాంధీ హామీ మేరకు తమ ప్రభుత్వం కుల గణన చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను శాసనసభలో ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపించామని, ఇక వాటిని లోక్‌సభ, రాజ్యసభల్లో ఆమోదింపజేసేందుకు రాహుల్ గాంధీ, ఖర్గే నాయకత్వంలో పోరాడాలని ఎంపీలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తాను, తన మంత్రులు, శాసనసభ్యులతో జంతర్‌మంతర్లో పోరాడతానని.. మీరు పార్లమెంట్‌లో పోరాడాలని సీఎం కోరారు. కుల సర్వే, బీసీ బిల్లుల ఆమోదంపై హర్షం వ్యక్తం చేస్తూ సోనియా గాంధీ స్వహస్తాలతో లేఖ రాశారని.. ఆ లేఖ తనకు నోబెల్, ఆస్కార్, జీవితకాల సాఫల్య పురస్కారం (లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్) అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి భావోద్వేగానికి గురయ్యారు.

**తెలంగాణలో కుల గణన ఓ చరిత్ర: డిప్యూటీ సీఎం మల్లు**

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కుల గణన చేస్తామని పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాహుల్ హామీ మేరకు రాష్ట్రంలో కుల గణన చేపట్టామని వివరించారు. అందుకు తగ్గట్లుగా ఎవరి జనాభా ఎంత అనేది తేల్చామన్నారు. తెలంగాణలో కుల గణన ఓ చరిత్ర అని ఆయన అభివర్ణించారు. కుల గణనతో దేశంలోనే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. దాదాపు 2 లక్షల మంది సిబ్బందితో 50 రోజుల్లో ఈ సర్వే నిర్వహించామని వివరించారు. తెలంగాణ మొత్తాన్ని బ్లాక్‌లుగా విభజించి సర్వే నిర్వహించామని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడమే ఎజెండాగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన కొనసాగింది. అందులోభాగంగా బీసీ కులగణన, బీసీ రిజర్వేషన్ బిల్లు అంశాలపై కాంగ్రెస్ ఎంపీలకు సీఎం రేవంత్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఉభయ సభల సభ్యులు హాజరయ్యారు. అలాగే ఈ పార్లమెంట్ సమావేశాలలో 42%రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలిపేలా ఉభయ సభల్లో ఎంపీలు ఒత్తిడి చేయనున్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ అగ్రనేతలతోపాటు కాంగ్రెస్ ఎంపీలంతా దాదాపుగా హాజరయ్యారు.

# తడిసి ముద్దయిన తెలంగాణ

>> ములుగు జిల్లా తాడ్వాయి మండలం బంధాల గ్రామపంచాయతీ పరిధి అల్లిగూడెం గ్రామానికి చెందిన గుమ్మడి కృష్ణవేణి అనే మహిళ నిండు గర్భిణికి గురువారం తెల్లవారుజామున పురిటి నొప్పులు మొదలయ్యాయి. కుటుంబసభ్యులు, గ్రామస్థులు ఉదృతంగా ప్రవహిస్తున్న కిన్నెరసాని వాగులో ఆ మహిళను భుజాలపై మోసుకుంటూ వెళ్లి వాగు దాటించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో పాటు ఎగువ నుంచి వస్తున్న ప్రవాహంతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతోంది.ఖమ్మం జిల్లాలోని మున్నేరులో ఐదుగురు పశువుల కాపరులు చిక్కుకున్నారు. పశువులను మేపడానికి ఉదయం మున్నేరు లంకలోకి కాపరులు వెళ్లారు. చింతకాని మండలం చిన్నమండవ వద్ద మున్నేరు వాగు ఉధృతిగా ప్రవహిస్తోండటంతో పశువుల కాపరులు చిక్కుకుపోయారు. మున్నేరులో చిక్కుకున్న పశువుల కాపరుల అంశంపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందించారు. పశువుల కాపరులను కాపాడేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఖమ్మంతోపాటు మున్నేటికీ ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తోండటంతో మున్నేరుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. నగరంలో మున్నేటి వరద ప్రవాహాన్ని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపరిశీలించారు. మున్నేటి వరద పరిస్థితిని పరిశీలించి అక్కడి నుంచే అధికారులతో మాట్లాడారు మంత్రి తుమ్మల నాగేశ్వరావు. జిల్లా కలెక్టర్ అనుదీప్, ఉన్నతాధికారులతో మాట్లాడి యంత్రాంగమంతా అప్రమత్తం కావాలని ఆదేశించారు. కరీంనగర్ లో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. సైదాపూర్ మండలంలోని రాయికల్ జలపాతానికి వరద ప్రవాహం పెరిగింది. కొండల పైనుంచి వాన నీరు జాలువారుతూ చూపరులను కనువిందు చేస్తోంది. జలపాతం అందాలు చూసేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు.ములుగు జిల్లా వాజేడులోని బొగత జలపాతం ఉదృతంగా ప్రవహిస్తోంది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పెనుగోలు అటవీ ప్రాంతంలో కొండాకోనల నుంచి భారీగా వరదనీరు బొగత జలపాతానికి చేరుకుంటోంది. ఈ వరద నీటితో జలపాతం ఉప్పొంగి ప్రవహిస్తోంది. అప్రమత్తమైన అధికారులు సందర్శకులను అనుమతించడంలేదు. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలు వర్షంతో తడిశాయి. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 25 అడుగుల వద్ద ప్రవహిస్తోంది. నీటిమట్టం పెరగడంతో దుమ్ముగూడెం మండలం పర్ణశాల వద్ద వార చీరల ప్రాంతం వరద నీటిలో మునిగింది. సీత వాగులోకి నీరు చేరడంతో వార చీరల ప్రాంతానికి పర్యాటకులను ఆపివేశారు. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువ నుంచి వస్తున్న వరదతో నీటిమట్టం పెరిగేఅవకాశం ఉంది.తెలంగాణలో శుక్రవారం కూడా భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది.అన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని, అక్కడక్కడ ఉరుములు మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వాన పడుతుందని పేర్కొంది. .శుక్రవారం ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హనుమకొండ జిల్లాలకు భారీ వర్ష సూచన ఉందని, గంటకు 30 నుంచి 40కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంటూ హెచ్చరికలు వాతావర్ణశాఖ విడుదలచేసింది.




బీహార్‌లో ప్రత్యేక ఇంటెన్సివ్ ఓటర్ల జాబితా సవణకు నిరసనగా పార్లమెంటు ఆవరణలో గురువారం జరిపిన నిరసన ప్రదర్శనలో పాల్గొన్న కాంగ్రెస్ ఎంపీలు సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ ఇతర ప్రతిపక్ష ఎంపీలు

# భారత్, బ్రిటన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

>> వల్ల యూకేలో భారతీయ ఉత్పత్తులు, భారత్‌లో యూకే ఉత్పత్తులు చౌక ధరకు లభించే అవకాశం ఏర్పడుతుంది. అందుకే 2030 నాటికి ఇరుదేశాలు తమ వాణిజ్యాన్ని 120 బిలియన్ యూఎస్ డాలర్ల మేర పెంచుకోవాలని కోరుకుంటున్నాయి. ఈ డీల్ వల్ల భారత్ నుంచి యూకేకు జరిగే దాదాపు 99 శాతం ఎగుమతులపై సుంకాలను తొలగించడం లేదా తగ్గించడం జరుగుతుంది. దీని వల్ల భారత్‌కు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. ముఖ్యగా వస్త్రాలు, తోలు, పాదరక్షలు, క్రీడా వస్తువులు, బొమ్మలు, సముద్ర ఉత్పత్తులు, రత్నాలు, ఆభరణాలు, ఇంజినీరింగ్ వస్తువులు, ఆటో విడిభాగాలు, ఇంజిన్లు, సేంద్రీయ రసాయనాలు వంటి రంగాలకు ప్రయోజనం చేకూరనుంది. మరోవైపు యూకేకు కూడా ఈ ఎఫ్‌టీఏ వల్ల ప్రయోజనం చేకూరుతుంది. ఎలా అంటే, యూకే నుంచి భారత్‌కు దిగుమతి అయ్యే దాదాపు 90 శాతం ఉత్పత్తులపై దశల వారీగా సుంకాలను తగ్గిస్తారు. అయితే తక్షణమే 64 శాతం సుంకాల కోత ఉంటుంది. ఈ డీల్ వల్ల బ్రిటీష్ వారికి చెందిన ఆహార, పానీయాల రంగం తక్షణమే లబ్ధి పొందనుంది. ముఖ్యంగా యూకే నుంచి భారత్‌కు వచ్చే స్కాచ్, విస్కీలపై సుంకాలు తగ్గనున్నాయి. ప్రస్తుతం యూకే స్కాచ్, విస్కీలపై భారత్ 150 శాతం మేర టారిఫ్‌లు వసూలు చేస్తోంది. కానీ కొత్త ఒప్పందం ప్రకారం, విస్కీ, జిన్‌పై సుంకాలు 75 శాతం మేర తగ్గుతాయి. రానున్న పదేళ్ల కాలంలో ఈ సుంకాలు 40 శాతానికి తగ్గుతాయి. అంతేకాదు ఈ ఒప్పందంలో ఐటి, ఆర్థిక, వృత్తిపరమైన సేవలు (ఆర్కిటెక్చర్, ఇంజినీరింగ్‌తో సహా), విద్యా సేవలపై కూడా సుంకాలు తగ్గనున్నాయి. ఈ డీల్ వల్ల భారతీయ నిపుణులు యూకేకు వెళ్లే అవకాశం సులభతరం అవుతుంది. తాత్కాలిక ప్రాతిపదిన యూకేకు వెళ్లే భారతీయ కార్మికులకు, వారి యజమానులకు సామాజిక భద్రతా సహకారాల నుంచి 3 సంవత్సరాల మినహాయింపును ఇస్తుంది. మరీ ముఖ్యంగా ఎఫ్‌టీఏ తర్వాత సోషల్ సెక్యూరిటీ కంట్రిబ్యూషన్స్ చెల్లింపు రెండు చోట్ల కాకుండా కేవలం భారతదేశంలో మాత్రమే జరుగుతుంది. టారిఫ్ రేటు కోటా వ్యవస్థ కింద ఆటోమోటివ్ సుంకాలను కూడా 100 శాతం నుంచి 10 శాతానికి తగ్గించనున్నారు. దీని వల్ల భారత ఆటోమొబైల్ రంగానికి పెద్ద సవాల్ ఏర్పడుతుంది. కచ్చితంగా చెప్పాలంటే ఇది మేక్ ఇన్ ఇండియాకు విరుద్ధంగా ఉండనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. భారత్ 2028 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందులో భాగంగా యూకేతో ఇప్పుడు ఎఫ్‌టీఏ చేసుకుంది. అయితే ఆటో కోటా వివరాలు, కార్బన్ సరిహద్దు పన్నుల లాంటి సమస్యలు ఇంకా వెల్లడి కావాల్సి ఉంది. భారత్, యూకే మధ్య ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందం (బీఐటీ)పై కూడా చర్చలు జరుగుతున్నాయి. ఇరుదేశాలు సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నాయని ప్రధాని మోదీ యూకేకు వెళ్లే ముందే చెప్పారు. "మా సహకారం వాణిజ్యం, పెట్టుబడి, సాంకేతికత, ఆవిష్కరణ, రక్షణ, విద్య, పరిశోధన, స్థిరత్వం, ఆరోగ్యం, ఇరుదేశాల ప్రజల మధ్య సంబంధాలతో సహా విస్తృత శ్రేణి రంగాలకు విస్తరించిందని అన్నారు. ఇరుదేశాల శ్రేయస్సు, వృద్ధి, ఉద్యోగాల సృష్టిని పెంపొందించే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. యూకే పర్యటన తరువాత మోదీ మాల్దీవులను సందర్శించనున్నారు.

# దేశానికి మైలురాయి

>> కుల గణన అంతతేలికైన అంశం కాదని, తెలంగాణలో కుల గణనకు ప్రోత్సహించినప్పుడు... సీఎం రేవంత్ రెడ్డికి ఈ అంశం కష్టమని భావించానన్నారు. ముఖ్యమంత్రి సామాజిక వర్గం కూడా సర్వేకు అంగీకరించకపోయి ఉండవచ్చుననుకున్నానని, కానీ రేవంత్ రెడ్డి మనస్ఫూర్తిగా, సమర్థంగా సర్వే చేశారని తెలిపారు. తెలంగాణలో తలుపులు మూసిన పరిపాలన గదుల నుంచి కుల గణన చేయలేదని,అన్ని సామాజికి వర్గాలకు చెందిన లక్షలాది మంది తెలంగాణ ప్రజలు ఈ సర్వేలో పాల్గొనేందుకు తలుపులు తెరిచార న్నారు.1950, 60, 70 దశకాల్లో అధికారం, శక్తి ఎక్కడి నుంచి వస్తుందని ప్రపంచ దేశాలను ప్రశ్నిస్తే... ఆయిల్ అనే సమాధానం వచ్చేదని రాహుల్ గాంధీ అన్నారు. ఈ కాలం ఆధిపత్యం, అధికారం, శక్తి డాటా (సమాచారం) అని చెబుతారని, అలాంటి 21 వ శతాబ్దానికి కావాల్సిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వే తెలంగాణ ప్రభుత్వం దగ్గర ఉందని రాహుల్ గాంధీ తెలిపారు. తెలంగాణ కుల గణనలో ఈ విషయం స్పష్టంగా వెల్లడైంద న్నారు.ఈ సర్వేకు ముందు భూములే విలువైనవని తాను అనుకునేవాడినని,కానీ ఇంగ్లీష్ ప్రాధాన్యమైన అంశంపై కుల గణన నిపుణుల కమిటీ చెప్పినప్పుడు ఆశ్చర్యం కలిగించిందన్నారు. ఇంగ్లీష్ అవసరం ఉన్నా హిందీ, ఇతర ప్రాంతీయ భాషలు అక్కర్లేదని తాను చెప్పడం లేదని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.ఏ బీజేపీ నేతను ప్రశ్నించినా ఇంగ్లీష్ వద్దంటారని, వారి పిల్లలు ఏ స్కూల్, కాలేజీలో చదువుతు న్నారని ప్రశ్నిస్తే మాత్రం ఇంగ్లీష్ మీడియం అనే సమాధానమే వస్తుందన్నారు. మరి ఆ అవకాశాన్ని దేశంలోని వెనకబడినవర్గాలైన ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ లకు ఎందుకు ఇవ్వరని బీజేపీ నేతలను రాహుల్ గాంధీ ప్రశ్నించారు. కుల గణన, ఓబీసీలకు రిజర్వేషన్లు తనకు, సీఎం రేవంత్ రెడ్డికి జాబ్ అని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఆ డేటాతో తెలంగాణ ప్రజల జీవితాల్లో మార్పులు తేవాలనుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

**దేశానికి తెలంగాణ సర్వే దిశానిర్దేశం... మల్లికార్జున ఖర్గే**

తెలంగాణ ప్రభుత్వం చేసిన కుల గణన దేశానికి దిశానిర్దేశం చేసిందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రశంసించారు. కుల గణన చేపట్టడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న సాహసోపేతమైన చర్యగా ఆయన అభివర్ణించారు. భారత్ జోడో యాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి తెలంగాణలో కుల గణనను ప్రోత్సహించిన లోక్ సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఏఐసీసీ కార్యాలయంలో సర్వేపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చి ప్రసంగించారు. పీసీసీ అధ్యక్షుడు కార్యక్రమ సంధానకర్తగా వ్యవహరించారు. సమావేశంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ, ఏఐసీసీ అగ్ర నేతలు దిగ్విజయ్ సింగ్, జైరాం రమేశ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు, స్వతంత్ర నిపుణుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అమలుకు మార్గం సుగమం

>> నిర్వహించి ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు పరచడం తమకంతో గర్వకారణంగా ఉందన్నారుఎన్నికల మ్యానిఫెస్టోలో ఏ.ఐ.సి.సి అగ్రనేత రాహుల్ ఇచ్చిన హామీ అమలుకు గాను ఈ సర్వే నిర్వహించామన్నారుకుల గణనను కేవలం ఓ.బి.సి లకే పరిమితము చేయకుండా సమాజంలోని అన్ని కులాలు,ఉప కులాలు వారి వారి ఆర్థిక,విద్యలతో పాటు రాజకీయంగా వారు లబ్ది పొందిన అంశాలపై సమగ్రమైన సర్వే నిర్వహించామన్నారు.ఏ.ఐ.సి.సి అగ్రనేత లోకసభలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ అభీష్టానికి అనుగుణంగా సామాజిక న్యాయంసమగ్ర అభివృద్ధిని నెరవేర్చే విదంగా నిర్వహించిన కులగణన ఇది అని ఆయన పేర్కొన్నారు.

# బ్రిటన్, భారత్ వాణిజ్య మంత్రులు

>>పీయూష్ గోయల్,జోనాథన్ రేనాల్డ్స్ ఎఫ్‌టిఎపై సంత కాలు చేశారు. ఒప్పందంతో రెండు దేశాల మధ్య వాణిజ్యం 34బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా వేస్తున్నారు. ఒప్పందంపై సంతకాలు చేసిన అనంతరం మాట్లాడిన ప్రధాని మోదీ, భారత్‌బ్రిటన్ భాగస్వామ్యంలో విజన్2035 లక్ష్యంగా సాగుతున్నామని అన్నారు. బ్రిటన్, భారత్ భాగస్వామ్యంతో కొత్త అధ్యాయం ప్రారంభమవుతోం దని తెలిపారు. రక్షణ, భద్రత, ఏఐ, విద్య తదితర రంగాల్లో బ్రిటన్, భారత్ కొత్తపుంతలు తొక్కనుందని అభిప్రాయపడ్డారు. ఆరు బ్రిటన్ వర్సిటీలు భారత్‌లో క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తున్నాయని వెల్లడించారు. పహల్గాం ఘటనను ఖండించిన బ్రిటన్ ప్రధానికి ధన్యవాదాలు. క్రికెట్ అనేది కేవలం ఆట కాదు. క్రికెట్ అంటే ఓ పాషన్. క్రికెట్ తరహాలో భారత్‌బ్రిటన్ దీర్ఘకాల భాగస్వామ్యం మేం కోరుతున్నాం. బ్రిటన్ ప్రధాని ఆతిథ్యానికి ధన్యవాదాలు. భారత్‌కు రావాలని ఆహ్వానిస్తున్నానని నరేంద్ర మోదీ అన్నారు. ఈ ఒప్పందం కేవలం ఆర్థికపరమైనదే కాదు. సహజ సమృద్ధి పథకం కూడా అని నరేంద్రమోడీ అన్నారు.

# నేటి నుంచి దోస్త్ స్పెషల్ ఫేజ్ కౌన్సెలింగ్

## 31 వరకు దరఖాస్తులకు, వెబ్ఆప్షన్లకు అవకాశం

## ఆగస్టు 3న సీట్ల కేటాయింపు.. 6 వరకు కాలేజీల్లో చేరాలి

## ఆగస్టు 11, 12 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు

### ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్, జూలై 24, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్)-2025 అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా నేటి(శుక్రవారం) నుంచి స్పెషల్ ఫేజ్‌ను నిర్వహించనున్నారు. 25 నుంచి 31 వరకు స్పెషల్ ఫేజ్‌లో కొత్తగా రూ. 400 రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అవకాశం కల్పించినట్టు ఉన్నత విద్యా మండలి ఛైర్మన్, దోస్త్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, కళాశాల విద్య కమిషనర్ శ్రీదేవసేన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకొని సీటు రాని వారు.. కొత్తవారితోపాటు ఈ నెల 31 వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశం కల్పించారు. ఇప్పటికే కాలేజీల్లో చేరిన వారు వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి అనుమతించ లేదు. స్పెషల్ ఫేజ్‌లో భాగంగా 25 నుంచి 31 వరకు రిజిస్ట్రేషన్‌కి, వెబ్ ఆప్షన్లకి అవకాశమిచ్చారు. ఈ నెల 31న స్పెషల్ కేటగిరీ వారి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహిస్తారు. ఆగస్టు 3న స్పెషల్ ఫేజ్ వారికి సీట్ల కేటాయింపు చేస్తారు. సీటు పొందిన విద్యార్థులు ఆగస్టు 3 నుంచి 6 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయడానికి అవకాశం కల్పించగా.. ఆగస్టు 4 నుంచి 6 వరకు కాలేజీల్లో చేరాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రైవేటు కాలేజీలతోపాటు ఎయిడెడ్ కాలేజీల్లో ఉన్న సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల్లో చేరడానికి ఆగస్టు 11, 12 తేదిల్లో స్పాట్ అడ్మిషన్లకి అవకాశం కల్పించారు. స్పాట్ అడ్మిషన్లు పొందడానికి నోకల్, నాన్ లోకల్ విద్యార్థులు అర్హులని.. అయితే స్పాట్ అడ్మిషన్లలో సీటు పొందిన వారు స్కాలర్‌షిప్ పొందడానికి అర్హులు కాదని వెల్లడించారు. 2025-26 సంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల ప్రక్రియను మూడు విడతల్లో సీట్ల కేటాయింపుతో ముగించినప్పటికీ.. విద్యార్థులు కోరిన నేపథ్యంలో స్పెషల్ ఫేజ్‌కి అవకాశం కల్పించారు. మొదటి విడతలో 65వేల మందికి సీట్ల కేటాయింపు చేపట్టగా వారిలో సుమారు 43 వేల మంది కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ ఇచ్చారు.

ఇక రెండో విడతలో 43వేల సీట్ల కేటాయింపు చేయగా.. మూడో విడతలో 85,680 మంది విద్యార్థులకు సీట్ల కేటాయింపు చేశారు. సీట్లు పొందిన విద్యార్థులు కాలేజీల్లో చేరడానికి జులై 5 వరకు అవకాశం కల్పించారు. రాష్ట్రంలో మొత్తం 957 ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో 4,36,947 సీట్లు అందుబాటులో ఉండగా.. వాటిలో 1,43,037 మంది చేరారు. 63 ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో ఒక్క అడ్మిషన్ కూడా కాలేదు. ఉస్మానియా యూనివర్సిటీలో 1,95,397 సీట్లు ఉండగా.. 67,157 మంది చేరారు. కాకతీయ యూనివర్సిటీలో 1,07,080 సీట్లు ఉండగా 33,289 మంది చేరారు. శాతవాహన యూనివర్సిటీలో 38,220 సీట్లు ఉండగా.. 14,022 మంది చేరారు. పాలమూరు యూనివర్సిటీలో 34,220 సీట్లు ఉంటే వాటిలో 10,638 మంది చేరారు. తెలంగాణ యూనివర్సిటీ 33,110 సీట్లు అందుబాటులో ఉంటే 9959 మంది చేరారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీలో 26,660 సీట్లు ఉండగా వాటిలో 6589 మంది చేరారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలో 1850 సీట్లు ఉండగా అందులో 1255 మంది చేరారు.



## ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరైన మంత్రి సీతక్క

**హైదరాబాద్, జూలై 24, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేత, మంత్రి సీతక్క గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. అయితే 2021, ఆగస్టు 26న కరోనా వైద్యాన్ని ఆరోగ్యశ్రీలో చేర్చాలని డిమాండ్ చేస్తూ ఇందిరా పార్క్ వద్ద ఎన్ఎస్ఈయూఐ నాయకులతో కలిసి ఆమె ప్రజారోగ్య ఆమరణ నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఆరోగ్యశ్రీ కింద కోవిడ్‌కు చికిత్స అందజేయాలని, ఉచిత అంబులెన్స్ సర్వీసులు ఏర్పాటు చేయాలని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరోనాతో మరణించిన ప్రతి కుటుంబానికి వాళ్ల ఆసుపత్రిల్లో కట్టిన బిల్లులను సీఎంఆర్ఎఫ్ కింద చెల్లించాలని కోరారు. కానీ, కోవిడ్ సమయంలో గుంపు లుగా బయట తిరగొద్దని నిషేదాజ్ఞలు అమల్లో ఉన్నా ఆమరణదీక్షలో పాల్గొన్నందుకు సీతక్కపై నాడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలోనే ఆ కేసు విచారణలో భాగంగా మంత్రి సీతక్క నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు.

## బ్రిడ్జిలు, కల్వర్టుల వద్ద భద్రతాచర్యలు తీసుకోండి

### ఆర్అండ్‌బి అధికారులు స్థానికంగా ఉండాలి

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**హైదరాబాద్, జూలై 24, ప్రభాతవార్త:** గత రెండు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఆర్ అండ్ బి అధికారులు అప్రమత్తంగా ఉండాలని కల్వర్టులు, బ్రిడ్జిల వద్ద భద్రతా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశాలు జారీచేశారు. సూపరింటెండెంట్ ఇంజినీర్లు జిల్లా హెడ్‌క్వార్టర్‌లోనే అందుబాటులో ఉంటూ క్షేత్ర స్థాయిలో ఈ.ఈ,డి.ఈ,ఏ.ఈ లను ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూ ప్రతి నాలుగు,ఐదు గంటలకు ఒకసారి ఆయా ఏరియాల్లో పరిస్థితులపై సమీక్ష చేసుకోవాలనీ ఆదేశించారు. హైదరాబాద్ నుండి ఇఎన్సీ,సి.ఈ లు మానిటరింగ్ చేస్తూ తనకు అప్డేట్ ఇవ్వాలన్నారు.కల్వర్టులు,బ్రిడ్జ్ లు,నిర్మాణంలో ఉన్న రోడ్ల వద్ద రెగ్యులర్ చెకప్ చేయాలనీ,పొంగిపొర్లే వాగుల పై ఉన్న బ్రిడ్జిలను తరచూ పరిశీలించాలని సూచించారు.వరద వల్ల కోతకు గురైన రోడ్లను యుద్ధ ప్రాతిపదికన వెంటనే పునరుద్ధరించేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఎలక్ట్రిసిటీ, రెవెన్యూ, ఇరిగేషన్,పోలీస్,పంచాయతీ రాజ్ విభాగాలతో సమన్వయం చేసుకుంటూ ఫీల్డ్ లో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే పరిష్కరించుకోవాలని అన్నారు. బలమైన ఈదురు గాలితో వచ్చే వానల వల్ల రోడ్లను అనుకోని ఉన్న ఎలక్ట్రిక్ పోల్స్ రోడ్ల మీదుగా వెళ్లే హైటెన్షన్ వైర్లు వల్ల కూడా ప్రమాదం ఏర్పడే ఆస్కారం ఉన్నదని,ఎక్కడైనా అట్లాంటివి ఉంటే ముందుగానే గుర్తించి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. నదులు, వాగుల వెంట,చెరువు కట్ట ల కింద ఉన్న రోడ్లు ఊహించని భారీ వరద ప్రవాహానికి దెబ్బతినే అవకాశం ఉంటుందని ఇరిగేషన్ అధికారులతో టచ్ లో ఉంటూ వరద ప్రవాహాన్ని అంచనా వేస్తూ.. రోడ్ల పై రాకపోకలకు ఇబ్బంది లేకుండా అదేవిధంగా రోడ్లపై ప్రయాణించే వారిని అప్రమత్తం చేయాలన్నారు. పోలీస్ యంత్రాంగం సహకారంతో ప్రజలకు అవగాహన కల్పించే చర్యలు చేపట్టాలని,అత్యవసరం అయితేనే ప్రజలు రోడ్ల పైకి రావాలని కోరారు.వరదలకు రోడ్డు పాడైతే ప్రజా రవాణాకు ఇబ్బంది లేకుండా తిరిగి వెంటనే రీస్టోర్ చేస్తాం.. ప్రజలు కూడా ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## స్థానిక ఎన్నికలకు కోర్టు తీర్పు ఇచ్చి నేటితో నెల పూర్తి

### సందిగ్ధంలో పంచాయతీరాజ్ అధికారులు

**హైదరాబాద్, జూలై 24, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికలను సెప్టెంబర్ 30లోగా నిర్వహించాలని గత నెల 25న హైకోర్టు తీర్పు నిచ్చింది. మొదటి నెల రోజులో రిజర్వేషనను ఖరారు చేయాలని, ఆ తర్వాతి 2 నెలలో ఎన్నికలు నిర్వహించాలని స్పష్టం చేసింది. రిజర్వేషనపై ప్రభుత్వం విధించిన గడువు రేపటితో ముగియనున్నది. కానీ ఇప్పటి వరకు సానిక సంసల ఎన్నికల రిజర్వేషన్లపై స్పష్టత రాలేదు. బీసీలకు 42 శాతం రిజర్వేషన అమలు కోసం ఈ నెల 10న రాష కేబినెట్ ఆమోదం తెలిపింది. అనంతరం గవర్నర్‌కు పంపిన ఆర్డినెన్స్ రాజ్ భవన్ నుంచి స్పష్టత రాక పోగా కేంద్రం వద్దకు వెళ్లింది. బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్లో చేర్చే అంశంపై కేంద్రం సైతం ఇంత వరకు ఎలాంటి ముందడుగూ వేయలేదు. కేంద్ర మంత్రులు, బీజేపీ నాయకుల ప్రకటనలు పరిశీలిస్తే ఈ విషయం ఇప్పట్లో తేలదని స్పష్టమవుతున్నది. దీంతో రిజర్వేషన్లపై ఎప్పుడు స్పష్టత వస్తుందోననే ఉత్కంఠ నెలకొంది. రిజర్వేషను ఖరారు చేయాలని హైకోర్టు విధించిన నెల రోజుల గడువు దగరపడింది. వాటిని ఖరారు చేయలేదని ఎవరైనా కోర్టుకు వెళ్తే ఎలా అని పంచాయతీరాజ్ శాఖ అధికారులు సందిగ్దంలో పడ్డారు.. కోర్టు ధిక్కారం కింద పిటిషన్‌వేస్తే తాము ఇరకాటంలో పడాల్సి వస్తుందని తర్జనభర్జన పడుతున్నారు. మరోవైపు బీసీ రిజర్వేషన్ విషయంలో కేంద్రంపై ఒత్తిడి తేవడానికి సీఎం రేవంత్‌రెడ్డి,మంత్రివర్గ సహచరులు ఇప్పటికే ఢిల్లీ వెళారు.శుక్రవారం నాటి కేబినెట్ సమావేశంలో ప్రభుత్వ ఆలోచన, నిర్ణయాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందని చెబుతున్నాయి.

## ఎయిర్ ఇండియా ఫ్లైట్ దుర్ఘటనలు జరగకుండా

## సమగ్ర మార్గదర్శకాలు రూపొందిస్తున్నాం

### ఎంపి ఈటల ప్రశ్నకు కేంద్రమంత్రి మురళీధర్ మోహుల్ సమాధానం

**హైదరాబాద్, జూలై 24, ప్రభాతవార్త:** ఎయిర్ ఇండియా ఫ్లైట్ ఏఐ 171 సంఘటన తర్వాత భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలను ఎదుర్కోవడానికి సమగ్ర మార్గదర్శకాలను సూచించడానికి కేంద్ర హోం కార్యదర్శి అధ్యక్షతన జూన్ 13వ తేదీన ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహుల్ సమాధానం ఇచ్చారు. గురువారం పార్లమెంటులో ఎంపి ఈటల రాజేందర్ ఎయిర్ ఇండియా ఫ్లైట్ దుర్ఘటనపై ఎంపి ఈటల రాజేందర్ తదితరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. ఈ కమిటీ మూడు నెలల్లోపు తన నివేదికను సమర్పి స్తుందని, కమిటీ ముఖ్య లక్ష్యాలు నిర్దేశిం చినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలను నివారించడానికి అవసరమైన మెరుగుదలలను సిఫార్సు చేయడంతో పాటు, ఎస్ఓపిని రూపొందించడం, సంఘటనలను నివారించడానికి, ప్రమాదానంతర సంఘటన పరిస్థితిని నిర్వహించడానికి అవసరమైన విధాన మార్పులు, కార్యాచరణ మెరుగు దలలు, శిక్షణ మెరుగుదలలను సూచించడం, వివిధ వాటాదారుల (కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ) అత్యవసర ప్రతిస్పం దనను అంచనా వేయడం, రెస్క్యూ ఆపరే షన్లు, వాటి మధ్య సమన్వయం చేసుకోవడం, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలను ఎదుర్కోవడానికి సమగ్ర మార్గదర్శకాలను సూ చించడానికి ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీ సంబంధిత సంస్థలు నిర్వహించే ఇతర విచా రణలకు ప్రత్యామ్నా యంగా ఉండదు,కానీ భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలను నివారించడానికి, నిర్వహించడానికి ఎస్ఓపిలను రూపొందించడంపై దృష్టి పెడుతుందన్నారు.

## అమెరికాలో తగ్గిపోతున్న సంతానోత్పత్తి

### పిల్లల్ని కనేందుకు ప్రోత్సహిస్తున్న డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం

**వాషింగ్టన్, జూలై 24:** అమెరికాలో జననాల రేటు చరిత్రలోనే అత్యల్ప స్థాయికి చేరింది. గత ఏడాది అమెరికాలో సంతానోత్పత్తి భారీగా క్షీణించినట్లు తాజాగా విడుదలైన ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. అమెరికాలో ప్రతి మహిళకు 1.6 కంటే తక్కువ మంది పిల్లలు ఉన్నట్లు ప్రభుత్వ నివేదిక పేర్కొంది. పాత తరాన్ని కొత్తతరంతో భర్తీ చేయడానికి, జనాభా పునరుత్పత్తికి అవసరమైన 2.1 గరిష్ఠ స్థాయికంటే ఇది చాలా తక్కువ. 2 దశాబ్దాల కాలంగా ఎక్కువ మంది పిల్లలను కనేందుకు మహిళలు ఇష్టపడకపోవడంతో ఇది క్రమంగా తగ్గుతూ వచ్చింది. అయితే, ప్రపంచ బ్యాంకు డేటా ప్రకారం పశ్చిమ యూరోపియన్ దేశాలలో సంతానోత్పత్తి రేటుతో సమానంగా ఉన్నాయని తెలిపింది. 1960లో అమెరికాలో సంతానోత్పత్తి రేటు 3.5 ఉండగా 2024 నాటికి 1.6కి చేరినట్టు నేషనల్ సెంటర్ ఫర్ హెల్త్ స్టాటిస్టిక్స్ తెలిపింది. పడిపోతున్న సంతానోత్పత్తిపై ఇటీవల ఆందోళన వ్యక్తం చేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, జననాల రేటు పెంచడానికి చర్యలు తీసుకున్నారు. తల్లిదండ్రులు పిల్లలను కనేలా ప్రోత్సహించే బేబీ బోనస్ ఆలోచనకు మద్దతు ఇచ్చారు. ఐవిఎఫ్ చికిత్సను అందుబాటులోకి తెచ్చారు. పుట్టిన తర్వాత పిల్లల సంరక్షణ, చైల్డ్‌కేర్, మాతృత్వ సెలవులు వంటి అంశాలపై అమెరికా ప్రభుత్వం చర్చలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. సంతానోత్పత్తి శాతం తగ్గడంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సంతానోత్పత్తి, జనాభా విధానంపై అధ్యయనం చేసిన కొలరాడో బౌల్డర్ విశ్వవిద్యాలయ పరిశోధకురాలు లెస్లీ రూట్ అన్నారు. అమెరికా జనాభాలో ఇప్పటికీ సహజ పెరుగుదల ఉందని, మరణాల కంటే ఎక్కువ జననాలు ఉన్నాయని ఆమె వివరించారు. 1960లో అమెరికా సంతానోత్పత్తి రేటు సుమారు 3.5 శాతం ఉండగా 1976 నాటికి అది 1.7 శాతానికి పడిపోయింది. ఆ తర్వాత 2007 నాటికి కాస్త పెరిగి 2.1 శాతానికి చేరింది. అనంతరం 2023లో 1.62శాతం ఉండగా, 2024 నాటికి కాస్త తగ్గి 1.59కి చేరినట్లు నేషనల్ హెల్త్ స్టాటిస్టిక్స్ వివరించింది. చాలా మంది మహిళల్లో సాధారణంగానే సంతానోత్పత్తి తగ్గిపోతుంటుంది. భవిష్యత్తులో కూడా ఇది మారే అవకాశం లేదని అభిప్రాయపడింది. ఆలస్యంగా పెళ్లి చేసుకోవడం, పిల్లలను పెంచేందుకు అవసరమైన డబ్బు వంటి కారణాలు కూడా సంతానోత్పత్తి రేటు తగ్గడానికి సాయపడుతుందని తెలిపింది. గతేడాది సమయంలో జారీ చేసిన జనన ధ్రువీకరణ పత్రాలు, ఇతర డేటా ఆధారంగా సమగ్ర నివేదికను రూపొందించింది.



## మేడారం జాతరకు రైల్వేలైన్ వేయండి

### కేంద్రమంత్రి అశ్వినీవైష్ణవన్‌ను కోరిన ఎంపి ఈటల

**హైదరాబాద్, జూలై 24, ప్రభాతవార్త:** ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఆదివాసీల పండుగ మేడారం సమ్మక్కసారక్క జాతరకు సదుపాయాలు కల్పించే భాగంలో రైల్వే లైన్ నిర్మాణానికి సాధ్యా సాధ్యాలను పరి శీలించి, భక్తులకు రవాణా సౌకర్యాలు సులభతరం చేయాలని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్‌ను ఎంపి ఈటల కోరారు. గురువారం ఢిల్లీలో కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి పలు అంశాలపై వినతి పత్రం అందించారు. వైద్యపరంగా, ఇతర కారణాలతో మరణించిన కార్మికుల కుటుంబాలకు ఊరట కలిగించే విధంగా కారుణ్య నియామకాలు చేపట్టాల న్నారు. అయోధ్య క్రాస్ రోడ్డు వద్ద ఆర్ఓబి త్వరగా నిర్మాణం చేపట్టాలని కోరారు.





మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పి పరితోష్‌పంకజ్

## అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

### 1.52 కోట్ల 38 కిలోల పల్లాడియం కార్బన్ స్వాధీనం

### ముగ్గురు నిందితుల అరెస్టు.. కారు, 5 సెల్‌ఫోన్లు కూడా

**సంగారెడ్డిటౌన్, జూలై 24, ప్రభాతవార్త:** ఫార్మా కంపెనీల్లో పల్లాడియం కార్బన్‌ను దొంగతనం చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు వలపన్ని పట్టుకుని 1.52 కోట్ల విలువ గల 38 కిలోల పల్లాడియంను, హుందాయ్ క్రెటా కారును, 5 సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. గురువారం సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో జిల్లా ఎస్పి పరితోష్ పంకజ్ మాట్లాడుతూ సంగారెడ్డి సిసిఎస్, కైడిఏ బొల్లారం పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి 1.52 కోట్ల విలువ గల 38 కిలోల పల్లాడియం కార్బన్ స్వాధీనం చేసుకున్నామన్నారు. మహారాష్ట్రకు చెందిన అమోల్ బాపు జాగడే (29), రవీంద్ర భగవాన్ భడర్ (29), గణేష్ మహాదేవ్ రాథోడ్ (28)లను అరెస్టు చేశామని, మరో ముగ్గురు సాంబశివుడు, అక్షయ్‌చవాన్, లాలా పాటిల్‌కు పరారీలో ఉన్నట్లు, వారిని సైతం త్వరలోనే పట్టుకుంటామన్నారు. పట్టుబడిన, పరారీలో ఉన్న నిందితులపై ఈ పాటికే వివిధ కేసులు నమోదు అయి ఉన్నాయన్నారు. కేసును చేధించడంలో కీలకంగా వ్యవహరించిన సిసిఎస్ ఇన్స్‌పెక్టర్ వి శివకుమార్, పి రాము నాయుడు, రవందర్‌రెడ్డి, ఐడిఏ బొల్లారం పోలీసు ఠాణా ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బంది రేఖ్య అన్వర్, శశిధర్, ప్రశాంత్, ఉదయ్ కిరన్, సతీష్, వామ్‌దాస్, మోహన్‌లను జిల్లా ఎస్పి ప్రత్యేకంగా అభినందించి రివార్డులు ప్రకటించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు డిఎస్పి ప్రభాకర్, ఇన్స్‌పెక్టర్ వి శివకుమార్, రాము నాయుడు, రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కోలుకుంటున్న తమిళనాడు సిఎం స్టాలిన్



**చెన్నై, జూలై 24:** తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అస్వస్థతతో ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. సోమవారం ఉదయం మార్నింగ్ వాక్ సమయంలో సీఎంకు తలతిరగడంతో కుటుంబ సభ్యులు అన్నా సలైలోని గ్రీమ్స్ రోడ్డులోని అపోలో హాస్పిటల్ కు తరలించారు. మూడు రోజులుగా సీఎం అక్కడే చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో సీఎం ఆరోగ్యంపై అపోలో వైద్యులు బులెటిన్ విడుదల చేశారు. సీఎంకు నిర్వహించిన వైద్య పరీక్షల్లో హృదయ స్పందన రేటులో తేడాలు కనిపించాయని పేర్కొన్నారు. వాటిని సరిచేసేందుకు చికిత్స చేసినట్లు వెల్లడించారు. సీఎంకు గ్రీమ్స్ రోడ్డులోని అపోలో ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించాం. ఈ పరీక్షల్లో సీఎం తలతిరుగుడుకు హృదయ స్పందన రేటులో కొన్ని తేడాలే కారణంగా తేలింది. దీనిని సరిచేసేందుకు ఇవాళ ఉదయం కార్డియాలజిస్ట్ డాక్టర్ జి. సెంగుట్టువేలు నేతృత్వంలోని వైద్య నిపుణుల బృందం సలహా మేరకు చికిత్స జరిగింది. ఈరోజు నిర్వహించిన యాంజియోగ్రామ్ పరీక్ష కూడా సాధారణమే. ప్రస్తుతం సీఎం క్షేమంగా ఉన్నారు. రెండు రోజుల్లో ఆయన తన సాధారణ విధులను తిరిగి ప్రారంభిస్తారు' అని అపోలో వైద్యులు బులెటిన్‌లో తెలిపారు.

## ఇఎన్సీ మురళీధర్‌రావు కేసులో కీలకమైన రెండోరోజు విచారణ



**హైదరాబాద్, జూలై 24, ప్రభాతవార్త:** ఆదాయానికి మించిన ఆస్తుల్లో కేసులో నీటిపారుదల శాఖ మాజీ ఈఎన్సి మురళీధర్‌రావును గురువారం రెండోరోజు కీలక డాక్యుమెంట్లపై ఏసిబి విచారించింది.

సోదాల్లో స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్లు, భూములు, తదితర స్థిరాస్థుల, ఇతర కీలక పత్రాలపై ఆరా తీశారు. విచారణ నేపథ్యంలో ఐదు రోజుల పాటు ఏసీబీ కస్టడికి అప్పగించింది తెలిసిందే. ఇప్పటికే పదకొండు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి ఆయనకు సంబంధమున్న పత్రాలను సీజ్ చేశారు. ఒకొక్క పత్రంపై వివరంగా ఆరా తీశారు. ముప్పై నిమి షాల చొప్పున సమయం ఇచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యమైన డాక్యుమెంట్లు ఉండడంతో శుక్ర, శనివారాల్లో మరింత కీలక సమాచారం రాబట్టనుంది. అయితే తొలిరోజు వ్యక్తిగత విషయాలు, కుటుంబం, విధులపైనే ప్రశ్నించింది.

## వివాహేతర సంబంధాల్లో టాప్ 'కాంచీపురం'!

### గ్లోబల్ డేటింగ్ సైట్ ఆష్లే మ్యాడిసన్ నివేదిక

**న్యూఢిల్లీ, జూలై 24:** వివాహేతర సంబంధాల్లో దేశంలోనే టాప్‌సిటీగా పేరు తెచ్చుకుంది తమిళనాడులోకి కాంచీపురం. ప్రముఖ గ్లోబల్ డేటింగ్ సైట్ ఆష్లే మ్యాడిసన్ నివేదికను అనుసరించి వివాహేతర సంబంధాల్లో జూన్ 2025 డేటా ప్రకారం తమిళనాడులోని కాంచీపురం అనే పట్టణం భారతదేశ వివాహేతర సంబంధాల కేపిటల్‌గా నిలిచింది. గత సంవత్సరం ఈ చిన్నపట్టణం 17వ స్థానంలో ఉండగా 1వ స్థానానికి ఎగబాకడం గమనార్హం. రెండో స్థానంలో సెంట్రల్ ఢిల్లీ ఉంది. గురుగ్రామ్, గౌతమ్‌బుద్ధనగర్, సౌత్‌వెస్ట్ ఢిల్లీ, డెహ్రాడూన్, ఈస్ట్‌ఢిల్లీ, పుణే, బెంగళూరు, సౌత్ ఢిల్లీ, చండీగఢ్, లక్నో, కోల్‌కతా, వెస్ట్‌ఢిల్లీ, కామ్‌రూప్, నార్త్‌వెస్ట్ ఢిల్లీ, రాయ్‌గఢ్, హైదరాబాద్, ఘజియాబాద్, జైపూర్ ప్రాంతాల్లో ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. మన దేశంలో వివాహేతర సంబంధాలు విపరీతంగా పెరగడానికి కారణాలేంటో ఆష్లే మ్యాడిసన్ డేటింగ్ వెబ్‌సైట్ వెల్లడించలేదు. కానీ దేశంలోనే ఏయే నగరాల్లో వివాహేతర సంబంధాలు పెరిగాయో మాత్రం ఈ సంస్థ వెల్లడించింది. ఇది జూన్, 2025 డేటా అని చెబు తోంది ఆ డేటింగ్ సైట్. అంటే లేటెస్ట్ గణాం కాలు అన్నమాట. ఆష్లేమేడిసన్ అడల్ట్ డేటింగ్ యాప్ పాపులారిటీ టైర్2, టైర్ 3 సిటీస్‌లో వివాహేతర సంబంధాలు పెరగడం కూడా గమనార్హం. ఇక టాప్ 20 జాబితాలో ఏకంగా 9 ప్లేసులను కైవసం చేసుకుంది ఢిల్లీ. దేశ రాజధానిగానే కాదు, వివాహేతర సంబంధాల్లో రాజధానిగా కూడా ఢిల్లీ తన హవాను కొనసాగిస్తోంది. అయితే ఇతర మెట్రో నగరాలు ఈ జాబితాలో చోటు దక్కించుకోలేకపోయాయి. ఇక దేశ ఆర్థిక రాజధాని అయిన ముంబై ఈ వివాహేతర సంబంధాల చార్టులో, ఇంతకుముందు సెకండ్ ప్లేసులో ఉండేది. అది ఆ ర్యాంక్ నుంచి చాలా వరకు దిగిపోవడం ఆశ్చర్యకర అంశం. ప్రస్తుతం ముంబై టాప్20లో కూడా లేదు. గ్లామర్‌కి కేరాఫ్ అడ్రస్ అయిన ముంబై, ఈ లిస్టులో లేకపోవడం, అందరిని ఆశ్చర్యంలో పడేసింది. ఇక టైర్2 నగరా ల్లో ఈ వివాహేతర బంధాల ట్రెండ్ ఎక్కువగా నడుస్తోందట. ఇక దేశంలో 53శాతంమంది వివాహితులు, తమ పార్ట్‌నర్‌ని మోసం చేస్తున్నట్లు ఈ సర్వేలో ఒప్పుకున్నారట. ఆష్లే మాడిసన్ ఏజెన్సీ అనేది కెనడియన్‌ఫ్రెంచ్ సోషల్ నెట్ వర్కింగ్ డేటింగ్ సర్వీస్. ఇది 2002లో ప్రారంభమైన ఈ సంస్థ వివాహేతర సంబంధాలను కోరుకునే వివాహిత వ్యక్తులకు సేవలు అందిస్తుంది.



## అన్నప్రసాదం ట్రస్ట్‌కు భూరి విరాళం

## రూ.2 కోట్లు అందజేత



**తిరుమల, జూలై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు ట్రస్ట్‌లు, పథకాలకు భక్తులైన దాతలు తమ వంతుగా విరాళా లందించి అవసర మైన వారికి సేవ లందిం చేందుకు ముం దుకు వ స్తున్నారు. ఇందు లో భాగంగా తిరు మలకు వచ్చిన భక్తులు ఆకలి అనేది తెలియకుండా రుచిగా శుచిగా అన్నప్రసాదాలు అందిస్తున్న ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు ఓ దాత భూరీగా 2కోట్ల రూపాయలు విరాళం అందించారు. గురువారం ఉదయం హైదరాబాద్‌కు చెందిన ట్రినిటి కంబైన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు వేర్వేరుగా చెక్కుల రూపంలో ఆ సంస్థ ప్రతినిధులు 2కోట్లు విరాళాలను టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు. దాత ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందించారు.

## తెలంగాణకు సోలార్ బూస్ట్

### రైతులకు 450 మెగావాట్ల విద్యుత్, 20 వేల పంపులు

**హైదరాబాద్, జూలై 24, ప్రభాతవార్త:** పిఎం కుసుమ్ పథకం లో భాగంగా తెలంగాణకు 450 మెగావాట్ల కొత్త సోలార్ ప్లాంట్లు, 20,000 వ్యవసాయ పంపులు మం జూరు చేస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. 2026 నాటికి స్కీమ్ ముగిసిపోతుందన్నందున తక్షణం ఈ పథ కాన్ని అమలుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్రం రాష్ట్రానికి విజ్ఞప్తి చేసింది. వివిధ వ్యవసాయ భూ ముల్లో గ్రిడ్‌కి అనుసంధానమైన సోలార్ పవర్ ప్లాంట్లు, స్వతంత్రంగా పనిచేసే సౌరవ్యవసాయ పంపులు, గ్రిడ్‌తో అనుసంధానమైన సోలార్ పంపులను ఏర్పాటు చేయ నుంది. తద్వారా రైతులకు విద్యుత్, నీటి భద్రత, ఆదాయ వృద్ధి, డీజిల్ ఆధారిత వ్యవసాయంపై ఆధారా న్ని తగ్గించడం, పర్యావరణ కాలుష్యాన్ని నివారించడం వంటి ప్రయోజనాలు కలుగుతుందని తెలియచేసింది. ఈ ప్రధాన లక్ష్యాలుగా కేంద్రం తెలంగాణకు సోలర్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొంది. మరోపక్క తెలంగాణకు అదనంగా 450 మెగావాట్ల డీసెంట్రలైజ్డ్ గ్రిడ్ కనెక్టెడ్ సో లార్ పవర్ ప్లాంట్లుకు కేంద్రం ఆమోదం తెలిపింది.


**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY**
Lenin Center, Governorpet, Vijayawada - 520 002 (A.P.)

**E PROCUREMENT TENDER NOTICE**

| NIT No. | Name of work | Estimate Cost |
| --- | --- | --- |
| 59/MAU61-USI0TT(RRW)/5/2025-TT | Providing BT Hot mix Road and central divider with Street lighting for Extension of Mahanadu Road from Ballemvari Street to Poranki – Nidamanuru main Road. | Rs.3355.00 Lakhs |
| 60/MAU61-USI0TT(RRW)/6/2025-TT | Widening & Providing BT Hot mix Road with central divider lighting at Ballemvari Street Road from Bandar Road to HT Line Road Junction. | Rs.2980.00 Lakhs |
| 61/ MAU61-USI0TT(RRW)/7/2025-TT | Widening & Providing BT Hot mix Road, Central Divider and Street Lighting to HT Line Road from Ballemvari Street Junction to Nidamanuru Main Road Junction. | Rs.3495.00 Lakhs |

APCRDA invites tenders for the following works for which the bids can be downloaded on AP e-procurement portal from **25.07.2025 to 11.08.2025 upto 14:00 Hrs.** Due date for submission of Bid **11.08.2025 up to 15.00 Hrs**, Technical bid opening **11.08.2025 @16.00 Hrs.** For further details please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in**

Sd/- Commissioner, APCRDA, Vijayawada

వార్త

విచారణకు భయపడి పారిపోయే వ్యక్తి,
తన నేరాన్ని తనకు తానుగా అంగీకరించినట్టే!

-వైరస్

# కాగితాల్లోనే గిరిజన సంక్షేమం!

గిరిజన సంక్షేమం, అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తున్నామని, దేశవ్యాప్తంగా వేలాది కోట్ల రూపాయలు వెచ్చిస్తామని ఒకవక్క నేతలు గొప్పలు చెప్పుకుంటున్నా మరోవక్క కనీస వైద్య సదుపాయాలు లేక అర్థాంతరంగా అల్లాడుతున్న కోట్లాది మంది గిరిపుత్రుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. వైద్యసదుపాయం మాట అటుంచి కడుపు నిండా తిండి లేక, పౌష్టికాహారం లోపించి ఎందరో గిరిపుత్రులు క్రమేపీ కనుచూపు కోల్పోతున్నారనే వార్తలు చూసి ఆవేదన చెందని ప్రజాస్వామ్యవాదులు ఉండరు. భావిభారత పౌరులుగా ఎదగాల్సిన వేలాది మంది గిరిజన బాలలు రేచీకటి, గ్లోకోమా, క్యాటరాక్ట్, విటమిన్ ఏ లోపంతో అంధులుగా మారుతున్నారనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. సర్వేంద్రియాల్లో కళ్లు అత్యంత ప్రధానమైనవి. అవే మూసుకుపోయి అంధులుగా మారితే ఆ వ్యక్తితోపాటు ఆ కుటుంబం పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో ఊహించుకోచ్చు. అవిద్య, అజ్ఞానం, మూఢత్వం, దారిద్ర్యం ప్రకృతితోపాటు తోటి మానవుడు చేస్తున్న దోపిడీలతో నేటికీ గిరిజన ప్రాంతాలు అతలాకుతలం అవుతున్నాయి. ఆదివాసులకు ప్రత్యేక ప్యాకేజీలంటూ కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తున్న వేలాది కోట్ల నిధుల్లో నాలుగోవంతు కూడా వారికి చేరడం లేదనే విమర్శలను కొట్టివేయలేం. స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటిపోయినా వారి కోసం ప్రత్యేకంగా సమీకృత గిరి జనాభివృద్ధి సంస్థలు ఏర్పాటు చేసినా ఆశించిన మేరకు ప్రయోజనాలు చేకూరడం లేదు. ఇప్పటికీ దేశవ్యాప్తంగా ఎన్నో వేలాది గిరిజన గ్రామాలకు, గూడాలకు రహదారి సౌకర్యాలు లేవు. నడవడానికి కూడా సరైన బాటలు లేని గ్రామలు ఎన్నో ఉన్నాయి. ప్రాణాపాయ స్థితుల్లో కూడా డోలె కట్టి మోసుకుపోతున్న దృశ్యాలు నేటికీ కన్పిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో కూడా గిరిజన ప్రాంతాల పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నది. ముఖ్యంగా రోడ్లు లేకపోవడంతో వర్షాకాలంలో ఎలాంటి ఆపద వచ్చినా వైద్య సహాయం కోసం గ్రామాలు దాటలేని పరిస్థితి. ఇటీవల ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రహదారులులేని గిరిజన గ్రామాలకు రోడ్లు వేయించే ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఇక ఆరోగ్యం విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం చేశారు, చేస్తున్నారనే చెప్పొచ్చు. ఎండాకాలం పోయి, వర్షాకాలం ఆరంభమైన సమయంలో పాత నీరు, కొత్తనీరు కలయికతోపాటు వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల మలేరియా వంటి వ్యాధులు విజృంభించడంతో ఎందరో గిరిపుత్రులు అసువులు బాస్తున్నారు. వాస్తవంగా ఆదివాసుల ఆరోగ్యపరిస్థితి అధ్యయనం చేసేందుకు ప్రఖ్యాత గ్రామీణ ఆరోగ్యరంగ నిపుణులు డాక్టర్ అభయ్ బంగ్ నేతృత్వంలో కేంద్రప్రభుత్వం కమిటీని నియమించింది. ఆ కమిటీ గిరిజన ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి సమగ్ర అధ్యయనం అనంతరం 2018లో తమ నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. అందులో ఎన్నో విస్తుపోయే విషయాలు వెల్లడించింది. మలేరియా కేసులు అత్యధికంగా ముప్పైశాతం ఆదివాసి ప్రాంతాల్లోనే వెలుగు చూస్తున్నాయని, ప్రతినలుగురు గిరిజనుల్లో ఒకరు అధిక రక్తపోటుతో బాధపడుతున్నారని తెలిపింది. మరోపక్క దేశంలో ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఆదివాసుల్లో పొగాకు వినియోగం ఎక్కువగా ఉందని, దానివల్ల జరిగే హాని గురించి వారికి అంతగా అవగాహన కల్పించకపోవడంతో పదిహేళ్ల వయసు నుంచే దీనికి అలవాటుపడుతున్నారు. ఫలితంగా అధికశాతం క్షయవ్యాధిబారిన పడుతున్నట్లు ఆ నివేదికలో పేర్కొన్నారు. ఇక ఐదేళ్లలోపు ఆదివాసి చిన్నారుల్లో నలభైశాతం పౌష్టికాహారం కొరవడి వయసుకు తగ్గ బరువు, ఎత్తు లేక గిడసబారిపోతున్నట్లు కమిటీ గమనించింది. ఇతర విషయాలు ఎలా ఉన్నా గిరిజనుల విషయంలో వైద్యసేవలు నిర్లక్ష్యం చేయడం క్షమార్హంకాదు. వైద్యం, విద్య విషయాల్లో ప్రత్యేక శ్రద్ధవహించి వారికి కేటాయించిన నిధులు అందేలా చూడడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి దీనిని అధిగమించి వారికి కేటాయించిన నిధులు వారి సంక్షేమం కోసమే ఉపయోగించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. అందులో భాగంగా 1970లో సాంఘిక సంక్షేమ శాఖ నుంచి విడదీసి ప్రత్యేక గిరిజన సంక్షేమ శాఖను ఏర్పాటు చేశారు. అదిలాబాద్ జిల్లాకు చెందిన కొట్నాక భీమ్‌రావు తొలిగిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టగానే ఎంతోకాలంగా మూలనపడి ఉన్న హేమండర్ఫ్ నివేదికలోని సిఫార్సులను అమలు చేసేందుకు నడుం బిగించారు. ఆనాడే గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఐటిడిల ఏర్పాటుకు నాంది పలికారు. అప్పటి నుంచి రాష్ట్రంలో ఏర్పాటైన తొమ్మిది ఐటిడియేల ద్వారా వందలాది కోట్లు యేటా వెచ్చిస్తూనే ఉన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించారు. భవనాలు నిర్మిస్తున్నారు. డాక్టర్లు కిందిస్థాయి ఉద్యోగులను నియమిస్తున్నారు. కానీ వారిని గిరిజన ప్రాంతాలకు పంపి సకాలంలో వైద్యసహాయం అందించడంలో విఫలమవుతున్నారనే చెప్పొచ్చు. అందుబాటులో ఉండడం లేదనేది కాదనలేని వాస్తవం. దీనికితోడు సరఫరా అవుతున్న మందులు నాసిరకం, నకిలీవి కావడంతో రోగాలు తగ్గక, నమ్మకం సన్నగిల్లి గిరిజనులు నాటు వైద్యంవైపు మొగ్గుచూపుతున్నారు. పసర్లు, వేర్లతో వచ్చీరాని వైద్యం చేసుకొని కొందరు ఆరోగ్యం చెడగొట్టుకుంటుండగా మరికొందరు ప్రాణాలే తీసుకుంటున్నారు. ఇప్పటికైనా పాలకులు రాజకీయాలకు అతీతంగా వారి అభ్యున్నతికి పాటుపడాలి. ముఖ్యంగా విద్య, వైద్యం వంటి కనీస సదుపాయాలను అందించాల్సిన బాధ్యత నేతలపై ఉంది. దీనిని విస్మరిస్తే చరిత్ర క్షమించదు.

విషం ఒకసారి మాత్రమే పని చేస్తుంది. కానీ చెడు గ్రంథం నిరంతరాయంగా ప్రజల మనసుల్ని కలుషితం చేస్తూంటుంది.



జాన్ ముర్రే

ఈ ప్రపంచం మార్పును ద్వేషిస్తుంది. కానీ మార్పు మాత్రమే అభివృద్ధిని కనపరచగల ఏకైక సాధనం.



కాథరింగ్

# ప్రజావాక్కు



## షుగర్ మాత్రలు అందుబాటులో ఉంచాలి

రాష్ట్రవ్యాప్తంగా మధుమేహగ్రస్తుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతూ ఉంది. మారుతున్న జీవన శైలితో షుగర్ లెవల్స్ కూడా రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. 25ఏండ్ల వయస్సు దాటిన వారిలోనూ షుగర్ బయటపడుతోంది. ఈ క్రమంలో ఇన్సులిన్ వినియోగించే వారి సంఖ్య పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీలతోపాటు హైదరాబాద్ నగరంలోని ప్రధాన ఆస్పత్రులైన గాంధీ, ఉస్మానియాలోనూ షుగర్ ఇన్సులిన్ నిల్వలు నిండుకున్నాయి. దాదాపు మూడు నెలలుగా సరఫరా నిలిచిపోవడంతో మధుమేహ బాధితులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థిక భారంతోబయటకొనలేక, సర్కార్ఆస్పత్రుల్లో అందుబాటులో లేక మరోవైపు రోగుల్లో షుగర్ లెవల్స్ పెరుగుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. కొన్ని ఆస్పత్రుల్లో నో స్టాక్‌బోర్డులు ఏర్పాటుచేయగా మరికొన్నిఆస్పత్రుల్లో నిల్వలు లేవని వెనక్కి పంపిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు జిల్లా ఆసుపత్రుల్లో షుగర్‌ను తగ్గించే మందులు ఇంజెక్షన్‌లు అందుబాటులో ఉంచాలి.

- కామిడి సతీష్ రెడ్డి, జయశంకర్, భూపాల్ పల్లి జిల్లా

## ఆన్‌లైన్ బెట్టింగ్‌ను నియంత్రించాలి

ఇటీవల ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ యువతను వేగంగా ముప్పుతెచ్చే మాయా వలగామారాయి. క్రీడలు, ఫాంటసీ గేమ్స్ పేరిట నడుస్తున్న ఈ యాప్స్ డబ్బు ఆశ చూపించి విద్యార్థులు, నిరుద్యోగులను అప్పులఊబిలోకి నెట్టేస్తున్నాయి. చాలాసందర్భాల్లో ఆర్థిక భారం భరించలేక యువత ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ప్రస్తుతంఉన్న చట్టాల్లో బెట్టింగ్‌కుసంబంధించిన నిర్వచనం స్పష్టంగా లేకపోవడం వల్ల ఈ యాప్స్ ఖిస్కిల్ గేమ్స్ పేరిట చట్టాలను దాట వేస్తున్నాయి. అయితే గేమ్‌లు పేరుకుగానీ, గెలుపోటములు పూర్తిగా డబ్బుపై ఆధారపడుతున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం జిల్లా

## నైతిక విద్యను బోధించాలి

చదువుతోపాటు విద్యార్థులుమంచితనం, నిజాయితీ, క్రమశిక్షణ, బాధ్యత వంటి నైతిక విలువలతో పెరుగుతుంటేనే సమాజానికి వారు ఆస్తిగా మారగలుగుతారు. పాఠశాల స్థాయిలోనుంచే నైతికబోధన కార్యక్రమాలను ప్రవేశ పెట్టాలి. మంచి, చెడుమధ్యతేడావివరించేబోధన అవసరం.

- ఎమ్. రాజేష్, నల్గొండ

## కృత్రిమ మేధతో ఎన్ని లాభాలో అన్ని నష్టాలు

ఈ మధ్య అందరి నోట కృత్రిమ మేధ ఉపయోగం వలన ఎన్ని లాభాలు పొందవచ్చునో, ఎంతబాగా అన్నిరంగాలలో అభివృద్ధి చెందవచ్చునో దేశాధి, రాష్ట్రాల నేతలు ఈ సాంకేతిక విద్యకు ప్రథమ తాంబూలం ఇచ్చిగౌరవిస్తున్నారు. మోకాళ్ళ ఆపరేషన్లు, గుండె శస్త్రచికిత్సలు ఈ మేధ ఉత్పత్తి చేసిన రోబోలతో చేయిస్తున్నారు. ఇంజనీరింగ్ విద్యలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్ అనేకోర్సు ను అన్నిఇంజనీరింగ్ కాలేజీల్లోనూప్రవేశపెట్టారు. అంతా బాగానేఉంది. ఈ విజ్ఞానం ముదిరి అనేక ఆ సాంఘిక అరాచక విన్యాసాలకు దారితీస్తోంది. స్త్రీల ఫొటోలు తీసి వారిని అసభ్యంగా చూపిస్తున్నారు. ఈ మధ్య అమెరికా మాజీ ప్రెసిడెంట్ అయిన ఒబామాను ప్రస్తుత ప్రెసిడెంట్ డోనాల్డ్ ట్రంప్ సమక్షంలో చేతులు వెనక్కు కట్టి కారాగారంలో పెట్టినట్టు అన్ని రకాల మీడియాలలో విస్తృత ప్రచారంచేసారు. ఇది అత్యంత అవమానకరమైన సన్నివేశం. దీన్ని ప్రపంచ దేశాలన్ని చాలా సీరియస్‌గా భావించి ఖండించాలి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## తెలంగాణకు నీళ్ల శాతం పెంచాలి

గోదావరి బనకచర్ల వివాదం ముదిరి పాకాన పడుతోంది. ఈ బేసిన్‌ల గురించి రైతులు కూడా తెలుసుకుంటున్నారు. చైతన్యవంతులుఅవుతున్నారు. అది తెలంగాణ ఉద్యమం ద్వారా వారికి వచ్చిన చైతన్యం ఎందుకంటే ఉద్యమ నినాదమే నీళ్ళ, నిధులు, నియామకాలు కావున ఈనీళ్ల తెలంగాణకే ప్రాణావసరం. తెలంగాణలో గోదావరి 79శాతం కృష్ణ 68శాతం పారుతుంది. పారకం ఆధారంగా నీళ్లు ఇచ్చిన తెలంగాణ లో గోదావరిలో నీటి వాటా ఎక్కువగా దక్కాలి. ఆ దిశగా ప్రభుత్వం ప్రయత్నం చేయాలి. మహబూబ్ నగర్ వలసలు తెలంగాణ ఉద్యమంలో ఒకప్రధానఅంశంగా ఉంది కావున కృష్ణనదినీళ్లు తీసుకరావాలి.

-భారత అవినాష్, జనగామ

## మీటింగ్‌లు పెట్టొద్దు

తెలంగాణ రాష్ట్రంలో ఉన్నఎస్సీ, ఎస్టీ, బీసీ, భవనాలలో, డాక్టర్. బి.ఆర్.అంబేద్కర్ భవనాలలో రాజకీయపార్టీల మీటింగ్స్ పెట్టొద్దు అని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒక ఆర్డర్ జారీ చేయాలి. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్. అంబేద్కర్ భవనంలో జాతీయ పార్టీలు, సీ.పీఐ. వంటి రాజకీయ పార్టీల మీటింగ్స్ పెట్టిన ఆపార్టీ నేతలపై చట్టరీత్య చర్య తీసుకోవాలి. కుల సంఘాల మీటింగ్ ఏర్పాటు చేయాలి.

-రాపాక రవీందర్, జనగాం

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# యువతలో రాజకీయ స్పృహ పెరగాలి

**యువత తలుచుకుంటే సాధించలేనిది ఏదీ లేదు అని గ్రహించాలి. రాజకీయాలు అంటే డబ్బులు సంపాదించడం కాదు అని తెలిపాలి. సమాజం సర్వతో ముఖాభివృద్ధి చెందాలని నడుం బిగించాలి. గత చరిత్ర తిరగేయాలి. స్ఫూర్తి పొందాలి. అమెరికా సహకారం తో ఇజ్రాయెల్, పాలస్తీనా, గాజా పై చేస్తున్న అమానుష దాడులకు వ్యతిరేకంగా ఒక విద్యార్థి చేసిన ప్రసంగం యావత్ ప్రపంచాన్ని ఆలోచింప చేసింది. ఆ విధంగా నేటి మన యువత దేశంలో ప్రస్తుతం ఉన్న రాజకీయాల్లో అప్రజాస్వామిక విధానాలపై కలం, గళంవిప్పాలి. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజాప్రతినిధులుగా రావాలి. భారత రాజ్యాంగ నిర్మాతలు, సంఘసంస్కర్తలు, స్వాతంత్ర్యసమర యోధులు ఆశించిన సమసమాజ నిర్మాణానికి, అభ్యుదయ భావాలతో పారదర్శకంగా పరిపాలన ప్రజలకు అందించడానికి యువత రాజకీయాల్లోకి రావాలిసిన అవసరం ఉంది.**

ఐ.ప్రసాద రావు

ప్రపంచంలోనే అత్యధిక యువత ఉన్న దేశంగా భారత్ ప్రస్తుతం కొనసాగుతుంది. ముఖ్యంగా నేటి యువత అకడమిక్ సామర్థ్యాలు సాధించడం ద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కోసం దేశ విదేశాలకు పయనం అవుతున్నారు. గత మూడు దశాబ్దాలుగా సాఫ్ట్‌వేర్ రంగంలో యువత ఆరితేరి, అత్యధిక జీతభత్యాలు అందిపుచ్చుకుని 'స్వయం' అభివృద్ధికి పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతోంది. అంతేకానీ, రాష్ట్ర రాజకీయాల్లో, దేశ రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించాడానికి కనీసం ఆసక్తి చూపకపోవడం శోచనీయం. దీంతో రాష్ట్ర, జాతీయ రాజకీయాల్లో వృద్ధ నేతలు, రాజకీయ వారసులే ఈ రాజకీయ వ్యవస్థను నడుపుతున్న పరిస్థితి ఏర్పడింది. ఇటువంటి పరిస్థితులను అందరూ పరిశీలించవలసిన అవసరం, విశ్లేషణ చేసి భారత్ భవిష్యత్తు రాజకీయ వ్యవస్థను పటిష్టం చేయడానికి, అభివృద్ధి అందరికీ అందుబాటులోకి తెచ్చే విధంగా సమున్నత రాజకీయ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుతం ఉన్న రాజకీయ నాయకులు, వ్యవస్థ, పార్టీలు దాదాపు అన్ని వృద్ధ నేతలు, వారసత్వ నేతలతో నిండుపోయింది. దీనికితోడు అవినీతి కంపు కొడుతోంది. హత్యా రాజకీయాలు, అక్రమ సంపాదన దారులు, అఘాయిత్యానికి పాల్పడిన వారితో నిండుకుండలా పార్లమెంటు, శాసనసభలు, శాసనమండలి నిండిపోతున్న పరిస్థితి. పార్లమెంటు సమావేశాలు కానీ, శాసనసభ సమావేశాలు కానీ దాదాపు అన్ని అధికార, ప్రతిపక్ష పార్టీలు, నేతలు ఒకరు మీద ఒకరు బురద రాజకీయాలు, ఆరోపణలు చేసుకోవడం పరిపాటిగా మారింది. ప్రజా సమస్యలపై చర్చలు దాదాపు కనుమరుగవుతున్నాయి. తరచూ 'వాయిదాల పర్వం' కొనసాగుతోంది. చాలా చట్టాలు ముఖ్యంగా ఆర్థిక, సంస్కరణల బిల్లులు, అర్థవంతమైన చర్చలు లేకుండానే మూజువాణి ఓటుతో ఆమోదం పొందడం జరుగుతుంది. ఇటువంటి పరిణామాలు భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు ఏమాత్రం శ్రేయోష్కరం కాదు. మెజారిటీ ఉందని అధికార పక్షం, వారు అనుకున్న బిల్లులను ఏదో ఒక రూపంలో ఆమోదం పొందడం జరుగుతుంది. కనీసం మేధావులు, ప్రతి పక్ష పార్టీల సీనియర్ నేతలు అభిప్రాయాలు సలహాలుతీసుకోకుండా ఏకపక్షంగా ఇటీవల కాలంలో అనేక ముఖ్యమైన బిల్లులు చట్టాలుగా మారుతున్న పరిస్థితి. ఉదాహరణకు యన్.ఈ.పి 2020, వక్ఫ్ బోర్డు చట్టం వంటివి ఉన్నాయి. గతంలో వ్యవసాయ చట్టాలు, రైతుల నిరవధిక పోరాటం ద్వారా రద్దు చేయవలసి వచ్చింది. అంతేకానీ పార్లమెంటు చర్చలు ద్వారా కాలేదు అని గ్రహించాలి. భారతదేశానికి స్వాతంత్ర్యం కోసం, బ్రిటిష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా అనేక మంది యువకులు భగత్ సింగ్, సుఖ్‌దేవ్, అల్లూరి సీతారామరాజు, సుభాష్ చంద్రబోస్ వంటి ఎందరో యువకులు పోరుబాట పట్టారు. దేశ రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించారు. స్వామి వివేకానంద కూడా తన ప్రసంగాలు ద్వారా యువతలో చైతన్యం నింపారు. శ్రీశ్రీ వంటి రచయితలు యవ్వన కాలంలోనే కలంతో సమాజాన్ని చైతన్యవంతం చేసారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యార్థి దశ నుంచి రాజకీయాల్లో ఆరితేరినవారే. మరి నేటి యువత కేవలం తమ వ్యక్తిగత జీవితం, అభివృద్ధికే పరిమితం అవుతున్నారు. ఈ పరిస్థితి మారాలి. యువత రాజకీయ రంగ ప్రవేశం చేయాలి. దీనికి ప్రధాన




కారణం ప్రస్తుత రాజకీయాలు 'ఖరీదుగా' మారిపోయాయి. పంచాయతీ వార్డు మెంబర్ ఎన్నిక నుంచి దేశ పార్లమెంట్ సభ్యులు ఎన్నిక వరకు లక్షలు నుంచి వందల కోట్ల రూపాయలు ఖర్చు చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. దీంతో సామాన్య, పేద మధ్యతరగతి యువత నేటి ఎన్నికలరంగం నుంచి దూరంగా నిలబడి ఉంది. ప్రజాస్వామ్యం ధనస్వామ్యంగా మారిపోయింది. దీనికి తోడు 'రాజకీయ నేతలు వారి కుటుంబ సభ్యులను వారసత్వంగా' ముందుగా ప్లాన్ ప్రకారం ఎస్టాబ్లిష్ చేయడం జరుగుతుంది. అన్నిటికీమించి, తల్లిదండ్రులు తమ పిల్లలను ఉద్యోగస్తులుగా, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌లుగా, డాక్టర్లుగా చూడాలనుకుంటున్నారు తప్పా, ప్రజా ప్రతినిధులుగా ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనలో లేరు. దీనికి కుటుంబ నేపథ్యం, రాజకీయ అవగాహన లేకపోవడం, ఇతర రాజకీయ ఆర్థిక సామాజిక అంతరాలు కారణాలుగా కనపడుతుంది. గత కాలంలో ఉన్నత చదువులు చదివే కళాశాలల్లో, యునివర్సిటీల్లో విద్యార్థులకుసంఘాలు ఉండేవి. ఎన్నికల్లో పోటీ చేయడం, రాజకీయ అవగాహన కలిగి ఉండటం, చర్చలు, సేవలు అందించే అంశాలను తెలియజేయడం జరిగేది. విద్యార్థి దశలోనే లోకల్ సమస్యలు, జాతీయ అంతర్జాతీయ ఆర్థిక సామాజిక రాజకీయ అంశాలపై అవగాహన కలిగి ఉండే పరిస్థితి. ముఖ్యంగా సోషల్ సైన్సెస్ వంటి సబ్జెక్ట్స్ ఎక్కువగా చదివే పరిస్థితి. దేశం కోసం, సమాజ కోసం మంచి చేయాలనే తపన, సేవాభావం కలిగి ఉండే విధంగా తర్ఫీదు ఉండే పరిస్థితి. నేడు కేవలం 'స్టెమ్' వంటి సబ్జెక్టులకే ఎక్కువ మంది పరిమితం అవుతున్నారు. దీంతో యువత రాజకీయాల్లోకి రావాలనే ఆలోచన, ఆసక్తి చూపకపోవడం గమనించవలసిన విషయం. కొన్ని చోట్ల ఓటు వేయడానికి కూడా బద్ధకంగా ఉండుట అత్యంత బాధాకరమైన విషయం. మరి ఇటువంటి పరిస్థితుల్లో దేశంలో ఉన్న అనేక ఆర్థిక, సామాజిక రాజకీయ అంతరాలు తగ్గించాలంటే, రాజ్యాంగ ఆశయాలు నెరవేరాలంటే ప్రతీ పౌరుడు ఆలోచన చేసే సమయం ఆసన్నమైంది. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలకు సేవా భావం కలిగించే విధంగా తర్ఫీదు ఇవ్వాలి. రాజకీయ వ్యవస్థను పటిష్టం చేయడానికి, పారదర్శకంగా పరిపాలన ప్రజలకు అందించాడానికి తమ పిల్లలను ఆదర్శవంతమైన రాజకీయ నాయకులుగా తీర్చిదిద్దడంలో ప్రముఖ పాత్ర పోషించాలి. విద్యార్థులు కూడా కేవలం తమ అకడమిక్ చదువులకే పరి మితం కాకుండా, జాతీయ అంతర్జాతీయ ఆర్థిక రాజకీయ పరిస్థితులపై అవగాహన కలిగి ఉండాలి. గతంలో అనేక మంది విద్యార్థులు ఉన్నత చదువులు చదివి, ఉద్యోగాలు విడిచి పెట్టి దేశ రాజకీయాల్లో ప్రముఖ పాత్రపోషించారు. ముఖ్యంగా డాక్టర్లు, న్యాయవాదులు అనేక మంది గతంలో దేశ రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించారు. ఒక డాక్టర్ గా, ఇంజనీర్‌గానే కాకుండా ఒక మంచి రాజకీయ నాయకు డుగా కూడా మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకోవచ్చు అని యువత గ్రహించాలి. దేశంలో ఉన్న అవినీతి, అక్రమ సంపాదన, అఘాయిత్యాలు, అంతరాలు తగ్గించాలంటే యువత రాజకీయాల్లోకి రావాలి. గుత్తాధిపత్యంగా ఉన్న, ఏకపక్షంగా ఉన్న రాజకీయ పార్టీలకు ధీటుగా యువత రాజకీయాల్లోకి రావాలి. యువత తలుచుకుంటే సాధించలే నిది ఏదీ లేదు అని గ్రహించాలి. రాజకీయాలు అంటే డబ్బులు సంపాదించడం కాదు అని తెలిపాలి. సమాజం సర్వతో ముఖాభివృద్ధి చెందాలని నడుం బిగించాలి. గత చరిత్ర తిరగేయాలి. స్ఫూర్తి పొందాలి. అమెరికా సహకారం తో ఇజ్రాయెల్, పాలస్తీనా, గాజా పై చేస్తున్న అమానుష దాడులకు వ్యతిరేకంగా ఒక విద్యార్థి చేసిన ప్రసంగం యావత్ ప్రపంచాన్ని ఆలోచింప చేసింది. ఆ విధంగా నేటి మన యువత దేశంలో ప్రస్తుతం ఉన్న రాజ కీయాల్లో అప్రజాస్వామిక విధానాలపై కలం, గళం విప్పాలి. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజా ప్రతినిధులుగా రావాలి. భారత రాజ్యాంగ నిర్మాతలు, సంఘసంస్కర్తలు, స్వాతంత్ర్యసమర యోధులు ఆశించిన సమసమాజ నిర్మాణానికి, అభ్యుదయ భావాలతో పారదర్శ కంగా పరిపాలన ప్రజలకు అందించడానికి యువత రాజకీయాల్లోకి రావాలిసిన అవసరం ఉంది. •

# శాంతి చర్చలకు ఉక్రెయినే ముందడుగు వేయాలి

కనుమ ఎల్లారెడ్డి

రష్యా, ఉక్రైన్ యుద్ధం తీవ్ర రూపం దాల్చే స్థితిలో ఉంది. రష్యా చేస్తున్న దాడులతో కుంగిపోయిన ఉక్రైన్‌కు అగ్రదేశం, జర్మనీ, నెదర్లాండ్ దేశాలు ముందుకు వచ్చాయి. వీటితోపాటు నాటో కూటమి తోడైందని భోగట్టా. రష్యా దాడులు అడ్డుకోవడంలో ఉక్రెయిన్‌కు అండగా ఈ దేశాలు రక్షణగా 'ప్యా ట్రియట్' క్షిపణులను అందిస్తోందని సమాచారం. ఈ ప్యాట్రియట్ క్షిపణులు రష్యా ప్రయోగించే డ్రోన్లు, విమానాలను అడ్డుకుంటుందని నాటో కమాండర్ క్రిస్టాఫర్ గ్రీన్ కెవిచ్ ప్రకటించారు. అయితే ఈ ప్యాట్రియేట్ క్షిపణులకు రుసుం చెల్లించాలని అగ్రరాజ్యం పేర్కొంది. సుమారు పది దేశాలు ఇటువంటి వ్యవస్థను కలిగి ఉన్నాయి. ఏవి కలిగి ఉన్న అగ్రదేశానికి సాటి రావు. 60 నుంచి 160 కిలోమీటర్ల వరకు బాలిస్టిక్ క్షిపణులు నివారించడానికి ఇవి దోహదపడతాయి. రష్యా ప్రయోగించే కలిబర్, ఇస్కాండర్ క్షిపణులను నాశనం చేయగలవు. వీటి లక్ష్యాలను చూసి రష్యా ఎటువంటి ఆందోళనకుగురికాలేదు. పై పెచ్చు మా ఆత్మ విశ్వాసమే మా బలం. అటువంటి వాటికి, మేము ఎన్నటికీ బెదరం వాటిని కూడా పతనం చేయగల సత్తా మా రక్షణ వ్యవస్థకు ఉంది. ఇలా పరస్పర మాటల ప్రచ్ఛన్న యుద్ధంతో రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ఇప్పట్లో ఆగే దిశలో లేదు. శాంతికి కృషి చేయాలనే తలంపు లేకపోవడం, పైగా ఉక్రెయిన్‌కు తగిన సహాయం చేస్తామని యూరోపియన్ దేశాలు ప్రకటించడం యుద్ధం భీకరంగా కొనసాగే లక్షణాలు పొడచూపుతున్నాయి. విశ్వంలో భారత్ ఒక్కటే శాంతికి కృషి చేసే దేశంగా పేరుఉంది. భారత్, రష్యాను బుజ్జగిస్తే యుద్ధం ఆగి పోయే పరిస్థితి ఉంది. కాని భారత్‌కు ఆ అవకాశం దొరకలేదు. అవకాశం వచ్చినా రష్యా పర్యటనకు భారత్ ప్రధాని మోదీ వెళ్ళినా పుతిన్ తో భేటీ అవ్వడం, " ఇది యుద్ధల యుగం "కాదు. మీరు శాంతికి అడుగు వేయాలి అని చెప్పడం, అదే దిశలో ఉక్రైన్ అధ్యక్షుడు జెలెన్ స్కి ఒక యుద్ధ పిపాసి తో భారత్ ప్రధాని కలవడం విచార కరం అని యుద్ధం ఆగే మార్గాలు భారత్‌చేసే ప్రయత్నాలు బూడిదలో పోసిన పన్నీరు అయింది. వీటిమీద ఇక వ్యాఖ్యానించడం వృధా అని, జెలెన్ స్కి అగ్రదేశంపైనే నమ్మకం పెట్టుకోవడం, అగ్రదేశం పంపిణి చేస్తున్న ఆయుధాలను వాడటం మాకే విజయం దక్కుతుందని అనుకోవడం భ్రమ. రష్యా దాడిలో అస్తవ్యస్తమైన ఉక్రెయిన్ ఎప్పటికీ రష్యాను గెలవలేదు. అందుకే ఉక్రెయిన్ అగ్రదేశం, యూరోపియన్ దేశాల మద్దతుపై ఆధారపడింది. ఉక్రెయిన్ అదుపులోకి వచ్చేందుకు, పూర్తిగా నాశనం చేసేంత వరకు రష్యా దాడులను ఉక్రెయిన్ అడ్డుకోలేదు. అందుకే ఉక్రెయిన్ 'ప్యా ట్రియేట్' క్షిపణులను ప్రయోగించడానికి సిద్ధమైంది. అందుకే రష్యా మేము దేనికి బెదరం అనే ధీమాతో ఉంది. యుద్ధంతో ఆర్థికంగా దేశాలు నష్టపోతాయి. వివిధ రాజకీయాలు దేశాలను చుట్టుముడతాయి. జెలెన్ స్కి ఇతర దేశాలపై ఆధారపడటం తప్పా ఏమి చేయలేని స్థితి. అతను అన్ని ఆలోచించి రష్యాతో శాంతికి బాటలు వేస్తే యుద్ధం ఆగుతుంది. పౌరుల కోసం, దేశ భద్రత కోసం, పురోభివృద్ధి కోసం జెలెన్ స్కి ఈ ప్రతిపాదన చేయాలి. ఒక అడుగు ముందుకు వేసి, ఒక దేశ అధ్యక్షుడిగా తన దేశాన్ని, ప్రజలను కాపాడుకోవాల్సి న అవసరం ఉంది. ఇప్పటికే రష్యా దాడులతో ఉక్రెయిన్ ఎంతో నష్టాన్ని మూటగట్టుకుంది. అనేక అందమైన భవనాలుకూలిపోయాయి. వాటి పునర్నిర్మాణం బహుకష్టం. రష్యాకునష్టం వచ్చినా అది తట్టుకోగలదు. సామ్యవాదం అక్కడ ఉంది. ఉక్రెయిన్ ఇతర దేశాల ఆయుధాలతోనే రష్యాను ఢీ కొడుతోంది. తాజాగా ఆస్ట్రేలియా కూడా ఉక్రెయిన్‌కు సహాయం అందించటానికి ముందుకు వచ్చింది. ఇలా దేశాలుఉక్రెయిన్‌కు అండగా ఉంటున్నాయి. జెలెన్‌స్కి దేశాలపైఆధారపడటం మానుకోవాలి. తానే స్వయంగా రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ కావాలి. తన డిమాండ్లు ఆయన ముందుకు తేవాలి. ముఖ్యంగా ఉక్రెయిన్ అభివృద్ధికి మాట పొందాలి. తన స్వీయరక్షణకు అండగా ఉండాలని, ఉక్రెయిన్‌కు అన్నివిధాలా సహాయ, సహకారాలు అందించాలని రష్యాను కోరాలి. సమస్యను అతనే పరిష్కారం చేయాలి. దేశాల అండనే ఉక్రెయిన్ కొంప ముంచింది. అదే అతను చేసిన తప్పు. ఎవరో ఏదో చేస్తాం అనే భ్రమలోనే జెలెన్ స్కి ఉన్నాడు. తనకు అండగాఉన్న దేశాలతోనే రష్యాతో పోరాడుతున్నాడు. అందరూ సహాయం చేస్తామని అంటున్నారే కాని యుద్ధం ఆపే మాటలు ఎవరు తీసుకురావడం లేదు. అందుకే ఉక్రెయిన్‌కు ఎంత సహాయం చేసినా రష్యాను ఏమిచేయలేదు. అనవసరంగా దేశ పౌరుల ప్రాణాలు పోతాయి, సైన్యం కూడా దీర్ఘకాల యుద్ధంతో నీరసపడి పోయింది. ముఖ్యంగా ఆర్థిక వ్యవస్థ చిన్నా భిన్నం అయింది. బేషాజాలకు పోకుండా దేశ సంక్షేమం కోసం తన ప్రవర్తన మార్చుకోవాలి. రష్యాతో శాంతి చర్చలకు తానే ముందుకు రావాలి. •

# విద్యావ్యవస్థలో ప్రమాణాలు మెరుగుపడాలి..

డాక్టర్. వై. సంజీవ కుమార్

నాటి విద్యావ్యవస్థలో ఆధునిక వసతులు లేకున్నా, ఉపాధ్యాయులు, లెక్చెరర్లు, ప్రొఫెసర్లు నిజాయితీగా, నిబద్ధతతో ప్రతి విదార్థిపట్ల శ్రద్ధ తీసుకోని, నాణ్యమైన విద్యను అందించేవారు. అప్పటి చిన్నారులే నేడు అత్యున్నతమైన స్థానాలలో ఉన్నారు. కఠినమైన దండన విధించే స్వేచ్ఛ ఉండేది విద్యాపకులకు. నేటి విద్యా వ్యవస్థలో అన్ని ఆధునీకమే అయినా సరైన విద్యను అందించలేకపోతున్నారు. నేడు అన్ని హంగులు, ఆర్భాటాలే, ప్రచారంలో తల్లిదండ్రుల ఆలోచనలను, ఆశలను గాలిలో విహరింప చేస్తున్నారు. నాడు ఉన్నతమైన విద్యలోకి అడుగు వేయడానికి పిల్లల మైండ్ సర్దుబాటు అవుతుందా లేదా, ఆ చదువుకు తట్టుకోగలరా లేదా అనేవి అన్ని అలోచించి అడుగు ముందుకు వేసేవాళ్లు. నేడు ప్రతి తల్లిదండ్రి కోరిక పిల్లలు ఇంజనీర్లు, డాక్టర్లు, పెద్ద ఉన్నతమైన స్థానంలోకి వెళ్ళాలి అనే ఆశలతోనే ఉంటున్నారు. వీళ్ల ఆలోచనలకూ తగ్గట్టు కార్పొరేట్ విద్యాసంస్థలు గాలిలో మెడలు కట్టిస్తున్నారు. తల్లిదండ్రులు తమ స్తోమతను మించి అడుగు ముందుకు వేస్తున్నారు. మరీ ముఖ్యంగా తమ పిల్లలు వత్తిడిని తట్టుకోగలరా లేదా అనేది ఆలోచించడం మానేశారు. ఉపాధ్యాయుల దండనకు కూడా తల్లిదండ్రులు యుద్ధానికి వెళ్తున్నారు. చదువుల్లో వెనకపడ్డాము అని ఆత్మహత్యలు చేసుకుంటున్నారు, చదువు అందరికి అవసరమే అలా అని ప్రాణాలు తీసుకునే చదువులు అవసరం లేదు. తల్లిదండ్రుల అత్యాశకు విద్యార్థులు వత్తిడికి లోనవుతూ బలిదానం చేసుకుంటున్నారు. ప్రభుత్వాలు క్షత్రస్థాయి పరిశీలన చేయడంలేదు. విద్యార్థులకు సరైన అవగాహనా కలిపించే వాళ్ల కరువైనారు. ప్రమాదం జరిగినప్పుడే హడావుడి చేసి మర్చిపోతున్నారు. నేటి విద్యావ్యవస్థలో వంద శాతంలో నుంచి 0.01 శాతం మంది మాత్రమే ఉన్నతచదువులో రాణిస్తున్నారు. మిగితా 99.99విద్యపట్ల అవాహనలేకపోవడం, వత్తిడికి లోనవడం, అనేక ఇతర కారణాల వలన మధ్యలో విఫలమవుతున్నారు. మరి కొందరు అన్నిట్లో ఉన్నతమైన మార్కులు వచ్చినా, చదివిన చదువులో ప్రాక్టికల్ నాలెడ్జి లేకపోవడం వలన కూడా విఫలమవుతున్నారు. పదవతర గతి తరవాత సరైన అవగాహనా లేకపోవడం వలననే అనేక మంది విద్యార్థులు వేసే తప్పటడుగు వాళ్ల జీవితాలలో భారీమూల్యం చెలించుకోవలసి వస్తుంది. పలానా వాళ్లు ఈ కోర్స్ తీసుకున్నారు మనము కూడా ఆ కోర్స్ తీసుకోవాలి. వాళ్లు ఈ పని



చేసారు, నేను ఈ పని చేయాలి. వాళ్ళు ఎంసెంట్‌కి ప్రిపేర్ అవుతున్నారు, నేను ప్రిపేర్ అవ్వాలి, వాళ్ళు పాలనా కాలేజీలో చేరినారు, మేము మా పిల్లలను అందులో చేర్పించాలి, అనే ఆలోచనల నుంచి బయటపడ్డప్పుడే విద్యావ్యవస్థలో వారికి ఏది అవసరం, ఏది చేయగలరు అనే మార్గం గోచరిస్తుంది. హంగు హార్భాటాలు ప్రచారం చేసుకునే విద్యాసంస్థలలో చేరాలి. అక్కడ చేరితేనే స్టేటస్ పెరుగుతుంది అనే ఆలోచనల నుంచి తల్లిదండ్రులు బయటకు రావాలి. ఎనిమిదవ తరగతి నుంచే ప్రతి విద్యార్థికి చదువులలో రకాలు, ఎం చదివితే ఏ వైపు వెళ్తే ఏవిధంగా జీవితం ఉంటుంది అనేది తెలియజేయగలిగితే పదవతరగతి వచ్చేసరికి వాళ్ల ఆలోచ నలు పరిణితి చెంది వాళ్లు విజయం సాధిస్తారు అనుకునే కోర్స్ లోనే చేరుతారు. అలానే కష్టపడతారు. విజయం సాధిస్తారు, చదువుతోపాటు చిన్నప్పటినుంచే విద్యార్థులకు ఆటల పట్ల అవగహన కలిపించే విధంగా ప్రతి శనివారం ఆటల రోజుగా నిర్ణయించి అన్ని రకాల ఆటలు ఆడిస్తే విద్యార్థులలో ఆత్మసైర్యంతోపాటు ఆటల్లో ప్రావిణ్యం పొందే అవకాశం ఉంటుంది. నచ్చిన ఆటను స్ఫూర్తిగా తీసుకోని ఆటలో రాణించడానికి అవకాశం ఉంటుంది. ఎప్పటికప్పుడు భవిష్యత్‌లో అన్ని రంగాలలో వచ్చే మార్పులను వివరించగలితే వాళ్ల మేధాశక్తి పెరుగుతుంది. ఉన్నతమైన ఆలోచనల తో ముందుకు సాగుతారు. ప్రభుత్వ విద్యావ్యవస్థ విషయానికి వస్తే నేటికీమరుగుదొడ్లు, మూత్రశాలలు లేని పాఠశాలు దర్శనమిస్తాయి. ఉపాధ్యాయులు టెక్నాలజీ తగ్గట్టు విద్యార్థులకు నెరిపించే నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ప్రతిబడిలో ఉన్నతమైన ప్రమాణాలు పాటించినప్పుడే విద్యార్థులకు చిన్నప్పటినుంచే మంచి అవగాహనా అలవర్చుకోవడానికి అవకాశముంటుంది. విద్యా వ్యవస్థను ఎప్పటికప్పుడు ఆధునీకరించుకోవలసిన బాధ్యత ప్రభుత్వానికుంది. తల్లిదండ్రులు కూడా పాఠశాలలో, కళా శాలల్లో చేర్పించాము, మా పనైపోయింది అనే భావననుంచి బయటకు వచ్చి వాళ్ళు ఎలా చదువుతున్నారు, వాళ్ల విద్యాప్రమాణాలు ఎంతవరకు మెరుగుపడ్డాయి, పిల్లల ప్రవర్తన ఎలాఉంది అన్ని గమనిస్తూ లోపాలను సరిచేస్తూ ఉన్నప్పుడే వాళ్ల ఉన్నతమైన చదువు చదవడానికి అవకాశం ఉంటుంది. ఉన్నతమైన స్థానాలను పొందేమార్గం ఏర్పడుతుంది. ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రభుత్వం నిర్వహించే వివిధ కార్యక్రమాల నుంచి మినహాయింపు ఇచ్చి ఉపాధ్యాయులను ఉపయోగించుకోవడం తగ్గించి వాళ్ల పిల్లలకు బోధించే విద్యకు మెరుగైన ప్రమాణాలు జోడించి ప్రతి సంవత్సరం ఒక నెలరోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వగలిగితే ఉపాధ్యాయులు కూడా విద్యలో మెరుగవుతారు. విద్యార్థులకు మరింత సరికొత్త విద్యను అందించే అవకాశం ఉంటుంది. మార్పు ఒక్కరోజుతో సాధ్యంకాదు, నిరంతర ప్రక్రియ మార్పులు కొనసాగించినంతకాలం విద్యలో అనేక పెనుమార్పులు సంభవిస్తాయి. చదువును ఆధునీకరణ చేయడానికి అవకాశం ఉంటుంది. •

# థాయ్, కంబోడియా మధ్య 'వార్'!



## గ్యాస్‌స్టేషన్లపై రాకెట్లతో దాడులు.. 12 మంది మృతి

### ఆగ్నేయాసియాలో పరిస్థితులు ఉద్రిక్తం

**బ్యాంకాక్, జూలై 24:** రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్- ఇరాన్, ఇజ్రాయెల్-హమాస్ తర్వాత ఇప్పుడు మరో రెండు ఆసియా దేశాలు యుద్ధం బారిన పడ్డాయి. థాయ్‌లాండ్, కంబోడియా దేశాలమధ్య చాలా యేళ్లుగా కొనసాగుతున్న సరిహద్దు వివాదం మళ్లీ తీవ్రమైంది. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం.. రెండు దేశాల మధ్య సరిహద్దుల్లో కాల్పులు జరిగాయి. అదే సమయంలో థాయ్‌లాండ్ వైమానిక దళం కంబోడియాలోని రెండు సైనిక స్థావరాలపై దాడి చేసింది. ఈదాడుల్లో కంబోడియా సైనిక స్థావరాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. కంబోడియా దాడిలో థాయ్‌లాండ్‌లోని ఒక గ్యాస్‌స్టేషన్ ధ్వంసమైంది. దీని తర్వాత అనేక మీడియా నివేదికలలో థాయ్‌లాండ్ కంబోడియాపై వైమానికదాడులు చేసిందనికూడావార్తలు వస్తున్నాయి. థాయ్‌లాండ్‌లోని గ్యాస్‌స్టేషన్‌పై కంబోడియా బిఎం-21 రాకెట్‌తో దాడిచేసింది. దీంతో బ్యాంకాక్‌లో కలకలంరేగింది. ప్రాణలు కాపాడుకోవడానికి సైనికులు అనేక చోట్ల నేలపై పడుకని ఉన్నారు. ఈ సమయంలో చాలా మంది ప్రజలు గాయపడినట్లు నివేదికలు వస్తున్నాయి. ఇప్పటివరకు అందిన ధ్రువీకరించని నివేదిక ప్రకారం.. ఈ ఘర్షణల్లో 12 మంది మరణించారు. చాలా మంది పిల్లలు, సాధారణపౌరులు గాయపడ్డారు.

**అమెరికా తన పౌరుల కోసం అడ్వైజరీ జారీ**

థాయ్‌లాండ్, కంబోడియా దేశాలమధ్య యుద్ధం ప్రారంభమైన తర్వాత అమెరికా రాయబార కార్యాలయం తన పౌరుల కోసం భద్రతా అడ్వైజరీని జారీ చేసింది. థాయ్‌లాండ్‌లోని అమెరికా కాన్సులెట్ తన పౌరులకు ఈ నెల 24న థాయ్‌లాండ్, కంబోడియాలో రాకెట్, అర్టిలరీ గన్‌లతో దాడులు జరిగినట్లు సమాచారం అందిందని వెల్లడించింది. సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న అమెరికా పౌరులందరికీ ఆ ప్రాంతాన్ని వెంటనే ఖాళీ చేయాలని, థాయ్‌లాండ్ ప్రభుత్వ అడ్వైజరీని పాటించాలని సలహా ఇచ్చారు. కంబోడియా రక్షణ ప్రతినిధి జనరల్ మాలి సొచెటా మాట్లాడుతూ.. థాయ్ సైనికుల చొరబాటు తర్వాత తాము ప్రతీకార చర్యలు తీసుకున్నామని చెప్పారు. కంబోడియా ప్రధాని మాట్లాడుతూ.. థాయ్‌లాండ్ తమ ఓడార్ మీంచే, ప్రేయ విహార్ ప్రావిన్స్‌లలోని ఆలయాలు, సైనిక స్థావరాలపై దాడి చేసిందని అన్నారు. తాము ఎల్లప్పుడూ శాంతియుత పరిష్కారాన్నే కోరుకుంటున్నామని ఆయన అన్నారు. అసలు ఈ సరిహద్దు వివాదంతోనే థాయ్ ప్రధాని ఏకంగా పదవిని కోల్పోయారు. ఉభయ దేశాల మధ్య 508 మైళ్ల సరిహద్దు ఉంది. దీనిలో అత్యధిక భాగాన్ని ఫ్రాన్స్ పాలన కింద ఉన్నప్పుడే గుర్తించారు. ఇరు దేశాలు శాంతియుతంగా కలిసి ఉంటు టన్నప్పటికీ.. సరిహద్దులు మాత్రం తరచూ ఘర్షణలతోరగులుతున్నాయి. ముఖ్యంగా ప్రముఖ ఆలయాలు ఉన్న ప్రీహ్ విహార్, ట మోన్‌థోమ్, ట మ్యూన్ థోమ్ ఉన్న పర్వతాలు, అరణ్యాలు కలగలిసిన ప్రాంతాల కోసం ఈ పోరాటం జరుగుతోంది. వీటిల్లో 9వ శతాబ్దానికి చెందిన ప్రీహ్ విహార్ కీలకమైంది. దీనిని ఖెమర్ పాలకులు నిర్మించారు. డాంగ్రెక్ పర్వతాల శిఖరం థాయ్‌ల్యాండ్‌కు అత్యంత సమీపంలో ఉంటుంది. ఈ ఆలయం కంబోడియాకు చెందుతుందని 1962లో అంతర్జాతీయ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. దానిని థాయ్‌ల్యాండ్ అంగీకరించింది. కానీ, ఆ దేవాలయం కేంద్రంగా స్థానిక సెంటిమెంట్లు తరచూ వివాదాలకు కారణమవుతున్నాయి.



# ముంబై పేలుళ్ల కేసుపై సుప్రీం స్టే!

## బాంబే హైకోర్టు తీర్పుపట్ల అభ్యంతరం

**న్యూఢిల్లీ,జూలై 24:** దాదాపు రెండు దశాబ్దాల క్రితం జరిగిన ముంబయి రైలు పేలుళ్ల కేసులో నిందితులుగా ఉన్న 12 మందిని నిర్దోషులుగా ప్రకటిస్తూ బాంబేహైకోర్టు ఇటీవలఇచ్చిన తీర్పుపై తాజాగా సుప్రీంకోర్టు స్టే విధించింది. అయితే హైకోర్టు ఆదేశాలతో జైలు నుంచి విడుదలైన నిందితులను మళ్లీ అరెస్టు చేయాల్సిన అవసరం లేదని అత్యున్నత న్యాయస్థానం గురువారం ఉదయం వెల్లడించింది. మహారాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పీల్‌పై తమ స్పందన కూడా తెలియజేయాలంటూ నిందితులకు నోటీసులు జారీ చేస్తూ ఆదేశించింది. 2006 జులై 11వ తేదీన ముంబయి పశ్చిమ రైల్వేలైన్‌లోని పలు సబర్బన్ రైళ్లలో ఒక్కసారిగా వరుసగా బాంబు పేలుళ్లు చోటు చేసుకున్నాయి. దీంతో యావత్ దేశమంతా ఉలికిపడింది. ఆ మారణహోమంలో 189 మంది అమాయక పౌరులు ప్రాణాలు విడిచారు. మరో 800 మందికి పైగా గాయాలపాలయ్యారు. అయితే ఆ ఘటనపై సుదీర్ఘ దర్యాప్తు అనంతరం 2015 అక్టోబరులో ప్రత్యేక కోర్టు, 12 మంది నిందితులను దోషులుగా తేల్చింది. రైళ్లలో బాంబు అమర్చారన్న అభియోగాలపై ఐదుగురికి మరణశిక్ష విధించింది. మిగతా ఏడుగురికి జీవితఖైదు విధిస్తూ అప్పట్లో తీర్పు వెలువరించింది.

అయితే దోషుల్లో కమాల్ అన్సారీ అనే వ్యక్తి 2021లో కొవిడ్ కారణంగా నాగ్‌పూర్ జైల్లోనే చనిపోయాడు. ఆ తర్వాత ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పుపై దోషులు బాంబే హైకోర్టును కొన్నాళ్ల క్రితం ఆశ్రయించారు. దీనిపై సుదీర్ఘంగా విచారణ జరిపి ఉన్నత న్యాయస్థానం, ఆ 12 మందిని ఇటీవల నిర్దోషులుగా తేల్చింది. వారిపై ఉన్న అభియోగాలను నిర్ధరించడంలో ప్రాసిక్యూషన్ ఘోరంగా విఫలమైందని పేర్కొంది. అదే సమయంలో ఘటనలో ఎలాంటి పేలుడు పదార్థాలు వాడారన్నది నిరూపించలేకపోయారని తెలిపింది. దీంతో వారిని విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఆ తర్వాత హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్‌వీ అంజారియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం, హైకోర్టు ఇచ్చిన తీర్పుపై తాజాగా స్టే విధించింది.



## లోయలో పడిన బస్సు

### ఏడుగురు మృతి, 20 మందికిపైగా గాయాలు

**సిమ్లా, జులై 24:** హిమాచల్‌ప్రదేశ్ మండీ జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. గురువారం ప్రమాదవశాత్తూ ఒక బస్సు లోయలో పడింది. ఈ దుర్ఘటనలో ఏడుగురు ప్రయాణికులు మృతిచెందగా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, జిల్లా ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్సు మాండీ నుంచి సర్కాఘాట్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించిందని పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో ఐదుగురు ప్రయాణికులు అక్కడికక్కడే మరణించారని మరో ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మండి జిల్లా ఎస్పీ సాక్షివర్మ వివరించారు. అయితే ఈ ప్రమాదానికి గల కారణాలు అన్వేషిస్తున్నామన్నారు. సుమారు 25 మీటర్ల లోతుకు బస్సు దూసుకెళ్లింది.

### భారతీయులను నియమించుకోవడం

## ఇక ఆపేయండి: ట్రంప్

**వాషింగ్టన్, జూలై 24:** గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి భారీ టెక్ కంపెనీలు భారతీయులను నియమించుకోవడం నిలిపివేసి అమెరికన్లపై ఫోకస్‌పెంచాలని అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ సందేశం పంపించారు. టెక్ కంపెనీల గ్లోబలిస్టు మైండ్‌సెట్‌ను ఆయన విమర్శించారు. దేశంలో లభించిన స్వేచ్ఛను వాడుకుని చాలా టెక్ కంపెనీలు ఇతర దేశాల్లో పెట్టుబడులు పెడుతున్నాయన్నారు. తనపాలనలో ఆరోజులు ముగుస్తాయని హెచ్చరించారు. చాలా భారీ టెక్‌కంపెనీలుచైనాలో కంపెనీలు నిర్మిస్తూ భారతీయ ఉద్యోగులను నియమించుకుంటూ ఐర్లాండ్‌ను అడ్డంపెట్టుకుని తక్కువ లాభాలు చూపిస్తూ స్వేచ్ఛను అనుభ వించాయని, ఇక్కడిప్రజల అవకాశాలను పట్టించుకోకపోవడం నిర్లక్ష్యంచేయడం వంటివి చేసారని ఇక నాపాలనలో ఆరోజులు ఉండవని, ఎఐ రేసులో విజయం సాధించాలంటే సిలికాన్ వ్యాలీలో సరికొత్త దేశభక్తి అవసరమని అన్నారు. ఇక్కడఉన్న టెక్నాలజీ కంపెనీలు మొత్తం అమెరికా కోసమే దేశానికే మొదటి ప్రాధాన్యం ఇస్తూ పనిచేయాలి. మీరూ అదిచేయాలి. అదేనేను కోరుతున్నానని ట్రంప్‌అన్నారు.

## నటుడు దర్శన్‌కు బెయిల్ మంజూరు

### న్యాయాధికారం దుర్వినియోగమైందని వ్యాఖ్యానించిన సుప్రీంకోర్టు!



**బెంగళూరు, జులై 24:** రేణుకాస్వామి హత్య కేసులో నిందితుడిగా ఉన్న కన్నడ నటుడు దర్శన్‌కు కర్ణాటక హైకోర్టు బెయిల్ మంజూరుచేయడంపై సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. న్యాయాధికారం దుర్వినియోగం అయిందని వ్యాఖ్యానించింది. హైకోర్టుచేసిన తప్పునే తాముపునరావృతం చేయబోమని ఆగ్రహం వ్యక్తంచేసింది. దోషిగా లేక నిర్దోషిగా ప్రకటించేందుకు తాము ఎలాంటి తీర్పును ఇప్పుడే ఇవ్వబోమని ప్రధాన నిందితురాలు పవిత్రగౌడ తరఫు న్యాయవాదికి స్పష్టం చేసింది. అరెస్టుకు తగిన ఆధారాలు లేవని బెయిల్ ఇచ్చినప్పుడు తీర్పు కాపీలో హైకోర్టుపేర్కొన్న భాషపైనా విచారం వ్యక్తం చేసింది. 'ట్రయల్ కోర్టు ఇలాంటి పొరపాటు చేసిందంటే దానిని పరిగణనలోకి తీసుకోవచ్చు. కానీ ఒక హైకోర్టు న్యాయమూర్తి అలా చేయడం ఆమోదయోగయమైంది కాదు' అని అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. వారం క్రితం కూడా ఈ కేసుపై సుప్రీంలో విచారణ జరిగింది. 'వాస్తవంగా చెప్పాలంటే హైకోర్టు తన విచక్షణాధికారం ఉపయోగించిన తీరుతో మేం ఏకీభవించలేకపోతున్నాం. బెయిల్ రద్దు చేయాలని వాళ్లు కోరుతున్నారు. మీ క్లయింట్ బెయిల్‌పై ఉన్నందున మీ వాదన వింటాం. హైకోర్టు ఇచ్చిన తీర్పును మీరు చూసే ఉంటారు' అని దర్శన్ తరఫు న్యాయవాది కపిల్ సిబాల్‌ను ఉద్దేశిస్తూ జస్టిస్ పార్దీవాలా వ్యాఖ్యానించారు.

# ఆస్ట్రేలియాలో జాత్యహంకారుల వెర్రి చేష్టలు

## ఆలయంపై పిచ్చి రాతలు



**కాన్‌బెర్రా, జూలై 24:** ఆస్ట్రేలియాలో ఓ భారతీయ విద్యార్థిపై ఇటీవల దాడి చేసిన కొందరు దుండగులు జాత్యహంకార వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటన మరువకముందే ఆ దేశంలో మరో జాత్యహంకార ఘటన చోటుచేసుకుంది. మెల్‌బోర్న్‌లోని బోరోనియాలో ఓ హిందూ ఆలయంపై గుర్తుతెలియని వ్యక్తులు విద్వేషపూరిత వ్యాఖ్యలు రాశారు. స్వామినారాయణ్ ఆలయం వద్ద ఈ నెల 21న ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఆలయం గోడలపై హిట్లర్ చిత్రాన్ని ఉంచి, దానిపై 'గో హోమ్ బ్రౌన్..' అని రాశారు. ఇక, ఇదే ప్రాంతంలోని ఆసియన్లు నడిపే హోటళ్లపై కూడా ఇలాంటి విద్వేషపూరిత రాతలే రాసినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. హిందూ కౌన్సిల్ ఆఫ్ ఆస్ట్రేలియా అధ్యక్షుడు మకరంద్ భగవత్ ఈ ఘటనను ధ్రువీకరిస్తూ ఓ ప్రకటనను విడుదల చేశారు. ఇది తమను దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. దేవాలయాలు శాంతి, భక్తి, ఐక్యతకు నిలయంగా ఉంటాయని, అలాంటి వాటిని లక్ష్యంగా చేసుకొని ఇలా జాత్యహంకార చేష్టలకు పాల్పడటం సరైనది కాదన్నారు.

విక్టోరియా ప్రీమియర్ జసింత్ అల్లన్ దీనిపైస్పందిస్తూ.. ఈచర్యను ఖండిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులకు లేఖ రాశారు. అందులో విద్వేషంతో కూడిన ఈ జాత్యహంకార ఘటన తనను కలిచివేసిందన్నారు. ఇది కేవలం విధ్వంసమాత్రమే కాదని, ఉద్దేశపూర్వకంగా చేసిన ద్వేషపూరిత చర్య అని ఆమె పేర్కొన్నారు. ఇలాంటి దాడులకు విక్టోరియాలో చోటులేదన్న ఆమె.. జరిగిన ఘటనపై విచారణకు ఆదేశించారు. ఈ విషయాన్ని పోలీసులు తీవ్రంగా పరిగణించి కారకులపై చర్యలు తీసుకోవాలన్నారు. కాగా, ఈ ఘటనపై విచారణను ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

## ఎయిరిండియా ప్రమాదం తర్వాత 112 మంది పైలట్లు సిక్‌లీవ్

**న్యూఢిల్లీ,జూలై 24:** అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమాన ప్రమాదం జరిగిన అనంతరం ఆ సంస్థకు చెందిన 100 మందికి పైగా పైలట్లు సిక్‌లీవ్‌తీసుకున్నారని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటుకు తెలియజేసింది.

గత నెల 12న ప్రమాదం సంభవించిన తర్వాత ఎయిరిండియాలో సిక్ లీవ్‌ల సంఖ్య పెరిగినట్లు ప్రభుత్వం పేర్కొంది. నాలుగు రోజుల వ్యవధిలో సెలవులు తీసుకున్న వారి సంఖ్య 112కు చేరుకుందని వెల్లడించింది. సిక్‌లీవ్ తీసుకున్న వారిలో 51 మంది కెప్టెన్లు (పైలట్ ఇన్ కమాండ్), 61 మంది పైలట్లు (ఫస్ట్‌ఆఫీసర్లు) ఉన్నారని పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ లోక్‌సభకు తెలియజేశారు. 2023లో విమాన యాన సంస్థలకు జారీ చేసిన నోటీసుల గురించి కూడా ఆయన లోక్‌సభకు వివరించారు. సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహించే సమ యంలో మానసిక ఆరోగ్యాన్ని త్వరితగతిన అంచనా వేయడానికి అవసరమైన పద్ధతులు ఉండాలని ఆ నోటీసులలో పేర్కొన్నట్లు తెలిపారు.

## ధన్‌ఖడ్‌కు వీడ్కోలు సత్కారంపై ఎన్డీయే మౌనం

### అధికారిక నివాసాన్ని ఖాళీచేయనున్న ఉపరాష్ట్రపతి



**న్యూఢిల్లీ,జూలై 24:** ఉపరాష్ట్రపతిపదవికి రాజీనామా చేసిన జగ్‌దీప్ ధన్‌ఖడ్‌కు ఘనంగా వీడ్కోలు పలకాలని కాంగ్రెస్ పార్టీ కోరగా, కేంద్రం స్పందించలేదని సమాచారం. గురువారం రాజ్యసభలో ఏడుగురు సభ్యులకు వీడ్కోలు కార్యక్రమం ఉంది. ఈ నేపథ్యంలో బిఎసి సమావేశంలో కాంగ్రెస్ సీనియర్‌నేత జైరాం రమేశ్ ధన‌ఖడ్‌కు కూడా వీడ్కోలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అయితే దీనిపై కేంద్రం స్పందించలేదు. కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, జెపి నడ్డాకూడా ఈ అంశంపై ఏమీ మాట్లాడలేదని అధికార వర్గాలు తెలిపాయి. అదే సమయంలో జైరాం రమేశ్ డిమాండ్‌కు మిగిలిన ప్రతిపక్ష నేతల నుండి కూడా మద్దతు లభించలేదని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ధన్‌ఖడ్ రాజీనామాపై ప్రతిపక్షాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఇలాంటి సమయంలో జైరాం రమేశ్ డిమాండ్‌పై కేంద్రం స్పందించకపోవడం గమనార్హం. ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ధన్‌ఖడ్ సోమవారం ప్రకటించారు. ఆయన హఠాత్‌నిర్ణయం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. వ్యక్తిగత కారణాలవల్ల తాను రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అయితే ధన్‌ఖడ్ రాజీనామా వెనుక ఏదో పెద్ద కారణమే ఉందని ప్రతిపక్షాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. ధన్‌ఖడ్ రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ఆమోదించారు.

**అధికారనివాసం ఖాళీచేస్తున్న ధన్‌ఖడ్**

ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన జగ్‌దీప్ ధన్‌ఖడ్ త్వరలో తన అధికారిక నివాసాన్ని ఖాళీ చేసే యోచనలో ఉన్నారు. ధన్‌ఖడ్ రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. ధన్‌ఖడ్ తన వస్తువులను ప్యాక్ చేసుకోవడం ప్రారంభించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్ సమీపంలోని చర్చి రోడ్డులో నూతనంగా నిర్మించిన వైస్ ప్రెసిడెంట్ ఎన్‌క్లేవ్‌కు ధన్‌ఖడ్ గత ఏడాది ఏప్రిల్‌లో మారారు. ఉప రాష్ట్రపతి అధికారిక నివాసం, కార్యాలయంగా ఉండే ఈ ఎన్‌క్లేవ్‌ను సెంట్రల్ విస్టా డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా నిర్మించారు. గత 15 నెలలుగా జగ్‌దీప్ ధన్‌ఖడ్ అక్కడే నివాసం ఉంటున్నారు. ధన్‌ఖడ్‌కు లుటియన్స్ ఢిల్లీలో టైప్ -8 లేదా మరో ప్రాంతంలో బంగ్లా ఇచ్చే అవకాశం ఉందని పురపాలక శాఖ అధికారులు చెబుతున్నారు.

# అనిల్ అంబాని కంపెనీల్లో ఇడి సోదాలు!




**ముంబయి,జూలై 24:** ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీని ప్రభుత్వరంగ బ్యాంక్ ఎస్‌బీఐ ఫ్రాడ్ అని ప్రకటించిన రెండు రోజుల్లోనే ఆయనకు సంబంధించిన కంపెనీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సోదాలు చేపట్టింది. గురువారం ఢిల్లీ, ముంబయిలోని అనీల్ అంబానికి సంబంధించిన సంస్థల్లో ఇడి అధికారుల సోదాలు నిర్వహించారు. రూ.3 వేల కోట్ల రుణాలకు సంబంధించిన కేసులో అనీల్ అంబానీ కంపెనీల్లో పాటు ఎస్ బ్యాంకులోనూ సోదాలు చేపట్టింది. మనీలాండరింగ్ కేసులో భాగంగా 50 ప్రాంతాల్లో ఇడి సోదాలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఏకకాలంలోనే 35 ప్రదేశాల్లో ఇడి అధికారులు తనిఖీలు నిర్వహించారు. 25మందిని ప్రశ్నించారు. సిబిఐ నమోదు చేసిన రెండు ఎఫ్ఐఆర్‌లు, హౌసింగ్ బ్యాంక్, సెబీ, నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అథారిటీ, బ్యాంక్ ఆఫ్ బరోడా సమర్పించిన నివేదికల ఆధారంగా సోదాలు నిర్వహించినట్లు ఇడి అధికారులు తెలిపారు. బ్యాంకులు వాటాదారులు, పెట్టుబడిదారులు, ఇతర ప్రభుత్వ సంస్థలను మోసం చేయడం ద్వారా ప్రజా ధనాన్ని మళ్లించడానికి చేసిన పథకం వేసినట్లు ఈడీ ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని చెప్పారు. ఎస్ బ్యాంక్ ప్రమోటర్‌తోసహా బ్యాంకు అధికారులకు లంచాలు ఇవ్వడం వంటి విషయాలు కూడా పరిశీలనలో ఉన్నాయని పేర్కొన్నారు.

2017-19 మధ్య కాలంలో ఎస్ బ్యాంకు నుంచి అనధికారికంగా రూ.3వేల కోట్ల రుణాలను ఇతరత్రా మార్గాల్లో మళ్లించారని ఆరోపణలపై దర్యాప్తు కొనసాగుతోంది. రుణం మంజూరు చేయడానికి ముందు యాస్ బ్యాంక్ ప్రమోటర్లకు సంబంధిత సంస్థల్లో నిధులు బదిలీ అయి నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు ఇడి వర్గాలు తెలిపాయి. అనిల్ అంబానీ సంస్థలకు ఎస్ బ్యాంక్ ఇచ్చిన రుణాల్లో క్రెడిట్ అప్రూవల్ మెమోరాండమ్‌లు పాతవి. ఎటువంటి ఆర్థిక విశ్లేషణ లేకుండా పెట్టుబడులు ప్రతిపాదించడం బ్యాంక్ క్రెడిట్ పాలసీని ఉల్లఘంటన వంటి విషయాలను ఈడీ గుర్తించింది. ఈ రుణాలను నిబంధనలను విరుద్ధంగా గ్రూప్ సంస్థలు, షెల్ కంపెనీలకు మళ్లించారని ఈడీ వర్గాలు పేర్కొన్నాయి. ఆర్థికంగా బలహీనంగా ఉన్న సంస్థలకు రుణాలు, వాటికి సరైన డాక్యుమెంటేషన్ లేకపోవడం, రుణ గ్రహీతలకి ఒకే చిరునామా, సాధారణ డైరెక్టర్లు, ప్రమోటర్ సంస్థలకు నేరుగా రుణాల మళ్లింపు, జీపీసీ రుణాలను ఎవర్ గ్రీనింగ్ చేయడం, ఒకే రోజున రుణం దరఖాస్తు, మంజూరు, రుణాల మంజూరుకు ముందే డబ్బులు విడుదల, ఆర్థిక వివరాలను తప్పుగా చూపించడం వంటివి ఉన్నాయి.

## బంగారం దుకాణంలో దొంగతనం.. పట్టిచ్చిన పావ్‌బాజీ



### కర్ణాటకలో ఘటన!

**బెంగళూరు, జులై 24:** ఒక్కోసారి చిన్న చిన్న పొరపాట్లే భారీ కుంభకోణాలను, దొంగతనాలను బయటపెడుతుంటాయి. కర్ణాటకలోని కలబురిగిలో ఇదే తరహా ఘటన చోటు చేసుకుంది. పావ్‌బాజీ తినాలన్న కోరిక దాదాపు రూ.2.15 కోట్ల దొంగతనాన్ని బయటపెట్టింది. జులై 11న జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలను పోలీసులు తాజాగా వెల్లడించారు. కలబురిగిలోని మారాతుల్లా మాలిక్‌కు చెందిన బంగారు దుకాణంలో పట్టపగలే నలుగురు వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ప్రధాన సూత్రధారి ఫరూక్ అహ్మద్ మాలిక్ దుకాణం బయట గమనిస్తుండగా మిగతా ముగ్గురూ మాస్కులు ధరించి లోపలికి వెళ్లి యజమాని కాళ్లు, చేతులు కట్టేసి తుపాకీతో బెదిరించి బలవంతంగా లాక్ ఓపెన్ చేయించారు. డబ్బు, బంగారంతో అక్కడినుంచి పరారయ్యారు. మారాతుల్లా మాలిక్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. దుకాణం ముందున్న సిసిటివి ఫుటేజీలను పరిశీలించగా లోపలి నుంచి వచ్చిన ముగ్గురు నిందితులు బయట ఉన్న ఫరూక్ అహ్మద్ దగ్గరికి వచ్చి ఏదో మాట్లాడారు. అక్కడి నుంచి నలుగురు కలిసి వెళ్లిపోయారు. కొంత దూరం వెళ్లిన ఫరూక్ మళ్లీ వెనక్కి వచ్చి ప్లేట్ పావ్‌బాజీ తిని దుకాణదారుకు రూ.30ఫోన్‌పే చేశాడు. అదే అతడిని పట్టించింది. ఆ లావాదేవీ ద్వారా ఫోన్ నెంబర్‌ను గుర్తించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా దాదాపు 3 కిలోల బంగారం, కొంత నగదును దొంగిలించినట్లు అంగీకరించాడు. అయితే పోలీసులు మళ్లీ తన దుకాణంపైనే సోదాలు నిర్వహిస్తారేమోనన్న భయంతో కేవలం 805 గ్రాముల బంగారం, కొంత నగదు పోయినట్లు మారాతుల్లా ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు.

# సంక్షిప్తంగా..

## టాటాసన్స్ ఛైర్మన్ జీతం రూ.155.81 కోట్లు



**న్యూఢిల్లీ,జూలై 24:** టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 155.81 కోట్ల జీతం అందుకున్నారు. గతేడాదితో పోలిస్తే ఆ మొత్తం 15 శాతం పెరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి చంద్రశేఖరన్ వేతనంగా రూ. 135 కోట్లు అందుకున్నారు. కంపెనీ వార్షిక రిపోర్టు ద్వారా ఈ విషయం బయటకు వచ్చింది. 2025 ఆర్థిక సంవత్సరంలో ఆయన వేతనం రూపంలో రూ. 15.1 కోట్లు, ఇతర కమీషన్, లాభాల్లో భాగంగా రూ. 140.7 కోట్లు ఆర్జించారు. ఇక, టాటా సన్స్‌లో చేస్తున్న ఇతర ఉద్యోగుల్లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సౌరభ్ అగర్వాల్ 2025 వార్షిక సంవత్సరంలో రూ. 32.7 కోట్లు జీతంగా పొందారు. గతేడాదితో పోలిస్తే ఇది 7.7 శాతం అధికం. రతన్ టాటా మృతి తర్వాత టాటా సన్స్‌లో చేరిన నోయల్ టాటాకు రూ. 1.42 కోట్ల కమీషన్ వచ్చింది.

## మరోసారి రూ. లక్షదాటిన బంగారం

**ముంబయి,జూలై 24:** బంగారం, వెండి ధరలు తిరిగి పెరిగాయి. పసిడి ధర మరోమారు రూ. 1 లక్ష మార్కును అధిగమించగా, కిలో వెండి ధర రూ. 1.15 లక్షలకు చేరి సరికొత్త గరిష్ఠస్థాయిని నమోదు చేసింది. అంతర్జాతీయ పరిస్థితులు, దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి కారణంగా వీటి ధరలు పెరిగాయి. ఇండియన్ బులియన్ అండ్ జ్యువెల్లర్స్ అసోసియేషన్ విడుదల చేసిన సమాచారం ప్రకారం, 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.99,508 నుండి రూ.1,00,533కు పెరిగింది. 22 క్యారెట్ల బంగారం ధర కూడా గణనీయంగా పెరిగింది. నిన్న రూ.91,149గా ఉన్న పసిడి ధర ఈరోజు రూ. 92,088కి చేరుకుంది. 10 గ్రాముల 18 క్యారెట్ల పసిడి ధర రూ. 74,631 నుండి రూ. 75,400కు పెరిగింది.

## దక్షిణాఫ్రికాలో ఏనుగు దాడి, సిఇఒ మృతి!

**న్యూఢిల్లీ, జులై 24:** ఏనుగు దాడిలో ఒక సంపన్న సిఇఒ ప్రాణాలు కోల్పోయారు. ఆయన దక్షిణాఫ్రికాలో విలాసవంతమైన గోండ్వానా ప్రైవేట్ గేమ్ రిజర్వ్‌కు సహ యజమానిగా వ్యవహరిస్తున్నారు. ఏనుగును పక్కకు తోలుతుండగా ఈ ఘటన చోటుచేసుకుందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఆ గేమ్ రిజర్వ్ సిఇఒ పేరు ఎఫ్‌సి క్రానాడీ(39). దక్షిణాఫ్రికా ఎకోటూరిజంలో ఆయన అందరికీ సుపరిచితులు. రోజులాగే కార్యకలాపాలు పరిశీలిస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. టూరిస్టు లాడ్జిలకు దూరంగా ఏనుగుల గుంపును తోలుతుండగా ఒకటి మాత్రం విపరీతంగా ప్రవర్తించింది. తన దంతాలతో నెట్టి, పలుమార్లు తొక్కిందని, పక్కనే ఉన్న రేంజర్లు క్రానాడీని రక్షించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయిందని వెల్లడించారు.

## పాక్‌డ్రోన్లను కూల్చివేసిన సరిహద్దు భద్రతా దళం

**అమృత్‌సర్, జూలై 24:** పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు పాల్పడుతూనే ఉంది. తాజాగా పంజాబ్‌లోని అమృత్‌సర్ సమీపంలో భారత్-పాకిస్థాన్ సరిహద్దు గుండా ఆయుధాలు, మత్తు పదార్థాలను మన దేశంలోకి పంపించేందుకు కుట్ర పన్నింది. ఈ క్రమంలో పాకిస్థాన్ పంపించిన ఆరు డ్రోన్లను బిఎస్ఎఫ్ కూల్చివేసింది. ఈ ఘటనలో మూడు తుపాకులు, మ్యాగజీన్లతో పాటు ఒక కిలో హెరాయిన్‌ను స్వాధీనం చేసుకుంది. ఈ మేరకు బిఎస్ఎఫ్ అధికారులు మీడియాకు వివరాలు వెల్లడించారు. బుధవారం రాత్రి అనుమానాస్పద వస్తువులు భారత్ భూభాగంలోకి వస్తున్నట్లు గుర్తించిన బీఎస్ఎఫ్ సిబ్బంది అప్రమత్తమైంది. అవి పాక్‌కు చెందిన డ్రోన్లుగా గుర్తించి వెంటనే ప్రతిస్పందించి వాటిని కూల్చివేసింది.

## కుప్పకూలిన మరో చిన్న విమానం, ఇద్దరు మృతి

**రోమ్,జూలై 24:** ఇటలీ ఉత్తరప్రాంతంలోని ఎ21 కోర్డామోల్లే ఓస్పిటేల్ హైవేపై తేలికపాటి చిన్నవిమానం కుప్పకూలి మొత్తం దగ్ధం అయిపోయింది. గురువారం ఉదయం జరిగిన ఈప్రమాదంలో విమానంలో ఉన్న ఇద్దరూ కూడా స్పాట్‌లోనే చనిపోయారు. అయితే హైవేపై కూలిపోయి మంటలు వ్యాపించడం రోడ్డుపై ఉన్న ఇద్దరుడ్రైవర్లు కూడా తీవ్ర గాయాల పాలయ్యారు. గాలిలోనే ఈ విమానానికి మంటలు వ్యాపించినట్లు చెపుతున్నారు. విమానంలో ఉన్న ఇద్దరు సెర్గియో రవాగ్లియా(75), అన్నా మారియా డి స్టెఫానో(50) అని గుర్తించారు. ఈ ప్రమాదంలో హైవేపై రెండు వాహనాలు దగ్ధం అయ్యాయి. ఒక డ్రైవర్‌ను ఆసుపత్రిలోచేరిస్తే మరో డ్రైవర్‌కు స్పాట్‌లోనే చికిత్సను అందిస్తున్నారు.

# అప్రమత్తంగా ఉంటూ జిల్లాల్లో పర్యటించండి

## వరద ప్రభావిత ప్రాంతాల నుంచి గర్భిణులను తరలించాలి

### ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను ఆదేశించిన మంత్రి దామోదర రాజనర్సింహా

**హైదరాబాద్, జూలై 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉంటూ.. జిల్లాల్లో పర్యటించాలని వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. సంగారెడ్డి నుంచి వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, ఇతర ఉన్నతాధికారులతో మంత్రి గురువారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజ నర్సింహ మాట్లాడుతూ.. హైరిస్క్ జోన్లలో ప్రివెంటీవ్ మెజర్స్‌పైన దృష్టి పెట్టాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల నుంచి గర్భిణులను తరలించాలని సూచించారు. హాస్పిటల్స్‌లో సానిటేషన్‌పై స్పెషల్ ఫోకస్ పెట్టాలని.. పరిశుభ్రత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హాస్పిటల్స్‌లో ఉన్న క్యాంటీన్లలో తనిఖీలు చేయాలని ఫుడ్ ఇన్‌స్పెక్టర్లను మంత్రి ఆదేశించారు. హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, ఇతర ఉన్నతాధికారులతో గురువారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కేసులు ఎక్కువగా నమోదవుతున్న ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో పంచాయతీరాజ్, మున్సిపల్ డిపార్ట్‌మెంట్లను అలర్ట్ చేయాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో అవేర్‌నెస్ క్యాంపులు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ ప్రాంతాల్లో యాంటిలార్వాల్ ఆపరేషన్స్, ఫాగింగ్, ఇండోర్ స్ప్రేయింగ్ విస్తృతంగా చేయాలన్నారు. క్రమం తప్పకుండా మంచి నీటి నమూనాలను పరీక్షించాలన్నారు.

సీజనల్ వ్యాధులతో ప్రభుత్వ హాస్పిటళ్లలో ఓపీ, ఐపీ పెరిగే అవకాశం ఉన్నందున.. ఓపీ కౌంటర్లను పెంచాలని, అవసరమైతే ఓపీ టైమింగ్స్‌ను పొడిగించుకోవాలని మంత్రి ఆదేశించారు. అన్నిరకాల మెడిసిన్స్, డయాగ్నస్టిక్ ఎక్విప్‌మెంట్స్, టెస్టింగ్ కిట్స్ సరిపడా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఇన్‌పేషెంట్లు, అవుట్ పేషెంట్లకు అవసరమైన అన్ని టెస్టులు హాస్పిటల్స్‌లోనే చేయాలన్నారు. టీ–డయాగ్నస్టిక్ సెంటర్లపై పర్యవేక్షణ పెంచాలని, అన్ని రకాల టెస్టులు చేయడంతోపాటు, అదేరోజు పేషెంట్లకు రిపోర్టులు అందజేయాలన్నారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో సానిటేషన్, డైట్ నిర్వాహణ సరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు హాస్పిటళ్లలో తనిఖీ చేయాలని మంత్రి ఆదేశించారు. హాస్పిటల్స్‌లో వార్డులు, వాష్‌రూమ్‌లు పరిశుభ్రంగా లేకపోయినా, పేషెంట్లకు అందించే ఆహారంలో నాణ్యత లోపించినా హాస్పిటల్ సూపరింటెండెంట్, ఆర్ఎంవోలు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటళ్లలో జిల్లా, రాష్ట్రస్థాయి ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు రెగ్యులర్‌గా తనిఖీలు చేయాలన్నారు. ప్రైవేటు హాస్పిటళ్లపై నిఘా పెంచాలని, డెంగీ, ప్లేట్‌లెట్స్ పేరిట ప్రజలను దోచుకునే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బిల్లులు అధికంగా వేసే హాస్పిటళ్లపై నిబంధనల ప్రకారం వ్యవహరించి, పేషెంట్లను దోచుకోకుండా చూడాలన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ పనులు ఊపందుకున్న క్రమంలో రైతులు ఎక్కువ సమయం పొలాల్లోనే గడుపుతారని.. ఈ క్రమంలో పాము, తేలు కాటుకు గురయ్యే ప్రమాదం ఉంటుందని మంత్రి హెచ్చరించారు. ప్రైమరీ హెల్త్ సెంటర్ నుంచి టీచింగ్ హాస్పిటల్ వరకూ అన్ని హాస్పిటళ్లలో పాము, తేలు కాటు పేషెంట్లకు ట్రీట్‌మెంట్ అందించేందుకు అవసరమైన మెడిసిన్, ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వచ్చే రోగులకు, గర్భిణులకు తక్షణమే వైద్య సేవలు అందించాలని.. వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో నివసిస్తూ.. ఎస్టిమేటెడ్ డెలివరీ డేట్ దగ్గరలో ఉన్న గర్భిణులను హాస్పిటల్స్‌లోని బర్త్ వెయిటింగ్ రూమ్స్‌కు తరలించి సేవలందించాలని మంత్రి సూచించారు. ఇంట్లోనే ఫ్రెష్‌గా వండుకుని తినాలని ప్రజలకు మంత్రి విజ్ఞప్తి చేశారు. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో దగ్గు, జలుబు, జ్వరం, డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.



పోలీస్ విజేతలను అభినందిస్తున్న డిజిపి జితేందర్

## ‘వరల్డ్ పోలీస్, ఫైర్ గేమ్స్’ పోలీస్ విజేతలకు డిజిపి అభినందన

**హైదరాబాద్,జూలై24,ప్రభాతవార్త:** వరల్డ్ పోలీస్, ఫైర్ గేమ్స్‌లో విజేతలుగా నిలిచిన తెలంగాణ పోలీస్ క్రీడాకారులను గురువారం డిజిపి జితేందర్ అభినందించారు. జూన్ 27 నుంచి జూలై 6 వరకు అమెరికాలో జరిగిన క్రీడలో పోలీసులు 10 పతకాలు సాధించి సత్తా చాటారు. మూడు గోల్డ్, ఒక సిల్వర్, ఆరు బ్రాంజ్ మెడల్స్ వరించాయి. తెలంగాణ పోలీస్ టీమ్ వాటర్ స్పోర్ట్స్ కోచ్ పి.కృష్ణారావు (వనపర్తి హెడ్ కానిస్టేబుల్) రెండు బంగారు పతకాలు గెలిచారు. 50 ఏళ్ల కేటగిరీలో 2000 మీటర్లు, 500 మీటర్ల రోయింగ్ క్రీడలో విజేతగా నిలిచారు. అదేవిధంగా తెలంగాణ పోలీస్ అథ్లెటిక్స్ కోచ్ మహ్మద్ బాబా (కామారెడ్డి జిల్లాలోని పెద్దకొండపల్లి పీఎస్‌లో కానిస్టేబుల్) 35ప్లస్ కేటగిరిలో షాట్‌పుట్, 110 మీటర్ల హర్డిల్స్‌లో రెండు కాంస్య పతకాలు, తెలంగాణ పోలీస్ తైక్వాండో ప్లేయర్స్ గోపాలక్రిష్ణయ్య సైబరాబాద్ రాజేంద్రనగర్ హెడ్ కానిస్టేబుల్ 40 ఏళ్ల కేటగిరిలో 80 కిలోలలోపు క్యోరుగి ఈవెంట్‌లో ఒక రజతం, రికగ్నైజ్డ్ పూమ్‌సే , ఫ్రీస్టైల్ పూమ్‌సేలో పోటీపడి రెండు కాంస్యాలు దక్కాయి. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అంబర్‌పేట్ హెడ్‌క్వార్టర్స్‌లో పనిచేసే ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్ డీ సంజీవ్ కుమార్ మూడు పతకాలు గెలిచారు. 30 ఏళ్ల కేటగిరీ క్యోరుగి క్రీడలో బంగారు పతకం, రికగ్నైజ్డ్ పూమ్‌సే, ఫ్రీస్టైల్ పూమ్ సేలో రెండు కాంస్యాలు వచ్చాయి. అభినందన కార్యక్రమంలో ఐజిపి స్పోర్ట్స్ ఎం రమేశ్, స్పోర్ట్స్ ఆఫీసర్, డిఎస్పి ఆర్వీ రామారావు పాల్గొన్నారు.



నల్ల బాలు (శశిధర్ గౌడ్) కుటుంబసభ్యులతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

## భయపడకండి.. మీకు నేనున్నా

### తప్పుడు కేసులకు బెదిరిపోవద్దు

### నల్ల బాలు కుటుంబసభ్యులకు కెటిఆర్ భరోసా

**పటాన్‌చెరు, జూలై 24,ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ సోషల్ మీడి యా కార్యకర్తలపై పెడుతున్న అక్రమ కేసులకు భయపడవద్దని, ప్రతి ఒక్కరికి తనతో పాటు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) భరోసా ఇచ్చారు. సోషల్ మీడియాలో ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్న ఆరోపణలపై అరెస్టై బెయిల్‌పై తిరిగి వచ్చిన నల్ల బాలు (శశిధర్‌గౌడ్)ను సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో పోచారం గ్రామంలో నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కో ఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాజీ మంత్రి కేటీఆర్ పరామర్శిం చారు. ఈ సందర్భంగా శశిధర్ గౌడ్ ఇంటికి కేటీఆర్ చేరుకుని ఆయనతో పాటు కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. నల్ల బాలు కుటుంబ సభ్యులతో కలసి కేటీఆర్ కేక్ కట్‌చేసి తన జన్మదిన వేడుకను జరుపుకున్నారు. శశిధర్ గౌడ్ పిల్లలకు బహుమతులు అందించారు. వారితో కలిసి భోజనం చేశారు.

## కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు భేటీ



**హైదరాబాద్, జూలై 24, ప్రభాతవార్త:** కేంద్ర హోంమంత్రి అమిత్ షాను బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్‌రావు మర్యాదపూర్వకంగా కలిసారు. గురువారం ఢిల్లీలో అమిత్ షాతో భేటీ అయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఇప్పటికే పలువురు కేంద్ర మంత్రులు, జాతీయ అధ్యక్షులను కలిసిన రాంచందర్‌రావు, గురువారం అమిత్‌షాతో భేటి అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర పరిస్థితులను వివరించారు.

## రేవంత్ ప్యాకేజీ రాజకీయాలకు ప్రజాస్వామ్యం బలి

### కాంగ్రెస్ - బిఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలు మళ్లీ బయటపడ్డాయి

### బిజెపి ఎంపి డికె అరుణ

**హైదరాబాద్, జూలై 24, ప్రభాతవార్త:** తెలంగాణలో మరోసారి బిఆర్ఎస్ – కాంగ్రెస్ కుమ్మక్కు రాజకీయాల అసలైన రూపం బయటపడిందని, రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టే హైడ్ అండ్ సీక్ రాజకీయ నాటకం కొనసాగుతుందని బిజెపి ఎంపి డికె అరుణ విమర్శించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షుడిగా ఉన్న సమయంలో బిఆర్ఎస్ ప్రభుత్వంపై ఫోన్ ట్యాపింగ్, వ్యక్తిగత నిఘా, గోప్యత ఉల్లంఘనలపై రేవంత్ రెడ్డి తీవ్రంగా ఆరోపణలు చేశారు. తనతో పాటు తన కుటుంబం ఫోన్లు ట్యాపింగ్‌కు పాల్పడ్డారని మాట్లాడారు. కానీ ఇప్పుడు ఆయన అవన్నీ మరిచినట్టుగా, ఫోన్ ట్యాపింగ్ జరిగి ఉంటే తనకు నోటీసులు వచ్చేవి కదా అనే వ్యాఖ్యలు చేస్తున్నారు. అలాంటప్పుడు గతంలో రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలు నాటకమా? లేక ఇప్పుడు బిఆర్ఎస్ పార్టీతో కుదిరిన ప్యాకేజీ డీలే కారణమా? అనే అనుమానం కలుగుతుందన్నారు. బిఆర్ఎస్–కాంగ్రెస్ మధ్య ప్యాకేజీ బేరాలు కుదిరాయనడానికి ఇది స్పష్టమైన నిదర్శనమని, కాంగ్రెస్ – బిఆర్ఎస్ పార్టీలు ప్రజల ముందు కేవలం మాటల యుద్ధం చేసుకుంటూ కుమ్ములాటలు చేసుకుంటూ, చీకట్లో ప్యాకేజీలు కుదుర్చుకుంటున్న విషయం మరోసారి స్పష్టమైందన్నారు. గత 19 నెలలుగా కాళేశ్వరం అవినీతి దర్యాప్తు పేరుతో కాలయాపన చేస్తూ అసలు దోషులను అరెస్ట్ చేయకుండా విమర్శలకే పరిమితమైందన్నారు. ఇప్పటికైనా కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి కేసులో సిబిఐ విచారణకు కోరి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు.

## మీరాలం ట్యాంక్‌పై ఐకానిక్ బ్రిడ్జి కోసం రూ.430కోట్లకు పరిపాలన అనుమతులు

**హైదరాబాద్, జూలై 24, ప్రభాతవార్త:** హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ మిరాలం ట్యాంక్‌పై నిర్మించ తలపెట్టిన ఐకానిక్ బ్రిడ్జికి పరిపాలన పరమైన అనుమతులు మంజూరు అయ్యాయి. బ్రిడ్జి నిర్మాణానికి రూ.430కోట్ల రూపాయలకు అనుమతులు ఇస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ ఇలంబర్తీ ఉత్తర్వులు జారీ చేశారు. బెంగుళూరు హైవేపైన శాస్త్రీపురం నుంచి చింతల్‌మెంట్ వరకు ఈపిసి పద్దతిలో బ్రిడ్జిని నిర్మించనున్నారు.

# కాళేశ్వరం ఫోన్‌ట్యాపింగ్ నిందితులను వదలం

## ఏడు లక్షల కోట్ల అప్పులపాలైన ధనిక రాష్ట్రం

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**హైదరాబాద్, జూలై 24, ప్రభాతవార్త:** కాళేశ్వరం పై విచారణ జరుగుతోందని అందులోని సూత్రధారులు, పాత్రధారులను ఫోన్ ట్యాపింగ్ నిందితులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హెచ్చరించారు. గాంధీ భవన్‌లో గురువారం అందుబాటులో ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బిజెపి బిఆర్ఎస్ గల్లీలో లొల్లి ఢిల్లీలో దోస్తీ అనే వైఖరితో ప్రదర్శిస్తున్నారని వెనుకబడిన తరగతుల ప్రజలు గుర్తించాలని ఆయన కోరారు. తెలంగాణలో పదేళ్ల పాటు ఫోన్ ట్యాపింగ్ చేసి దొరికిపోయిన దొంగలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆడిపోసుకునే విధంగా సొంత ప్రత్రికలో రోత రాతలు రాస్తున్నారని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ దొంగల పాపం పండిదని ఆది అన్నారు. లోక్‌సభ ఎన్నికలో గుండు సున్నాకు పరిమిత మయ్యారు.

ఫోన్ ట్యాపింగ్ లో సూత్రధా రులు, పాత్రధా రులు పాత్ర తేలాల్సి ఉందని తెలి పారు. కలుగులో దాకున్న కూడా ఫోన్ ట్యాపింగ్ నిందితులను వదిలే ప్రసక్తే లేదని అన్నారు. కెటిఆర్ లోకేష్ తో భేటీ అయ్యారని సిఎం రేవంత్ చేసిన వ్యాఖ్యల్లో తప్పే ముందని ప్రశ్నించారు. వారి భేటీకి ఫోన్ ట్యాపింగ్ కి సంబంధం లేదని ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన కర్మ కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ బురద కాంగ్రెస్ పార్టీకి అంటించే ప్రయత్నం బిఆర్ఎస్ చేస్తోందని ఆయన అన్నారు. మా నాయకుడు దమ్మున్న నాయకుడు అని కీర్తించారు. మా పార్టీలో అంతర్గత ప్రజా స్వామ్యం ఎక్కువ, బిఆర్ఎస్‌లో నియంతృత్వ పోకడలు ఎక్కువ అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే పేదల ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వంపై విష ప్రచారం చేసే బిఆర్ ఎస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎదురుదెబ్బ తప్పదని జోస్యం చెప్పారు. కెసిఆర్ ప్రతిపక్ష పాత్ర పోషించలేక ఫాం హౌస్ కి పరిమితమయ్యారని అన్నారు. మీ పత్రికల్లో మీరే రాసుకొని డబ్బా కొట్టుకోండని అన్నారు మీ పత్రికలో రోత రాతలు మానుకో కుంటే మంచిదని హితవు చెప్పారు.

ఫోన్ ట్యాపింగ్ తో సినీతారలు, జడ్జీలు, భార్య భర్తలు మాట్లాడుకున్న మాటలను విన్నారని కవితే బహిరంగంగా చెబుతున్నారని గుర్తుచేశారు. ఫోన్ ట్యాపింగ్ బురద మాకు అంటించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆవేదన చెందారు. ఫోన్ ట్యాపింగ్ సూత్రధారులు లెక్క తేలాల్సి ఉందని చెప్పారు బిఆర్ఎస్ పార్టీనుంచి తెలంగాణ పదం తొలగించిన రోజే పేగు బంధం తెగిపోయిందని అన్నారు. మహాలక్ష్మి పథకంతో మహిళలకు 237 కోట్ల ప్రయోజనం కలిగిందని వెల్లడించారు. బిఆర్ఎస్ పదేళ్ల హయంలో పది రేషన్ కార్డులు ఇవ్వలేదు, పదేళ్లలో ఏ ఒక్క నియోజకవర్గంలో ఒక్క డబుల్ బెడ్ రూం ఇచ్చిన పాపాన పోలేదని విమర్శించారు. ధనిక రాష్ట్రం కాస్తా 7 లక్షల కోట్లకు అప్పులు కట్టే దుస్థితి దాపురించింది. ఎస్సీ వర్గీకరణ, బిసికుల గణన చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్త శుద్ధి నిరూపించుకుందని అన్నారు. ప్రశ్నించే గొంతులకు తెలంగాణ ప్రజలు పట్టం కట్టారు.

# పెన్షన్‌ల పంపిణీలో కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

### మంత్రి సీతక్క

**హైదరాబాద్, జూలై 24, ప్రభాతవార్త:** పింఛన్ లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా పెన్షన్ అందించేందుకు నూతన టెక్నాలజీని ఉపయోగించుకోవాలని, పింఛన్లు అందించడం సామాజిక బాధ్యత అన్నారు. చేయూత పెన్షన్ల పంపిణీపై ప్రజాభవన్‌లో మంత్రి సీతక్క గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. పేదరిక నిర్మూలన కోసం మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ఇందిరా మహిళా క్యాంటీన్‌లు ఇస్తున్నామని వెల్లడించారు. ప్రమాద బీమా ద్వారా పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు మంత్రి సీతక్క. 15 సంవత్సరాల వయస్సు నుంచే మహిళా సంఘాల్లో సభ్యులుగా అవకాశం కల్పిస్తున్నామన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితే కుటుంబం బాగు పడుతుందన్నారు. ఆర్టీసీలో 200 కోట్ల మహిళా ప్రయాణాలు జరిగాయంటే. మహిళలకు ఫ్రీ బస్సు బాగా ఉపయోగపడుతోందని, వారు ఫ్రీ బస్సు ఎక్కడమే కాదని, మహిళలను బస్సు ఓనర్లను చేసింది తమ ప్రభుత్వమే నన్నారు. పేదరికం తగ్గించకపోతే సమాజంలో అంతరాలు పెరుగుతాయని, నిజమైన లబ్ధిదారులకు పింఛన్లు చేరే విధంగా అధికారులు కఠిన నిబంధనలు అమలు చేయాలని సూచించారు. అనర్హులు పెన్షన్ తీసుకుంటే పేదవారికి అన్యాయం చేసినట్లు అవుతుందన్నారు. సాంకేతిక కారణాలతో పింఛన్లు ఆలస్యం అయితే ముందే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఫేషియల్ రికగ్నైజేషన్ ద్వారా అర్హులకే పింఛన్లు అందుతోందన్నారు. ప్రతీ నెల రూ.1000 కోట్ల పెన్షన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. పిల్లలు వదిలేసిన తల్లిదండ్రులకు ప్రభుత్వం ఇచ్చే పెన్షనే చేయూతని.. అదే వారి ధైర్యమన్నారు. ఈ క్రెడిట్ అంతా ఐఏఎస్ దివ్యాకే దక్కుతుందని, ప్రతీ అధికారి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాల న్నారు. అధికారులూ పెన్షనర్ల కష్ట సుఖాలు తెలుసు కోవాలని, మానవ సేవే మాధవ సేవ అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. సమావేశంలో సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, డైరెక్టర్ గోపీ, జిల్లా ప్రాజెక్ట్ ఆఫీసర్స్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

# బిసి నాయకుడికి సిఎం పదవి అప్పగించండి

### సిర్పూర్ శాసనసభ్యుడు డా. పాల్వాయి హరీశ్‌బాబు

**హైదరాబాద్, జూలై 24, ప్రభాతవార్త:** బిసిల పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలని సిర్పూర్ శాసనసభ్యుడు డా. పాల్వాయి హరీష్ బాబు డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. దమ్ముంటే బలహీన వర్గానికి చెందిన బిసి నాయకుడికి ముఖ్యమంత్రి పదవిని అప్పగించండి. బిసిలపై ప్రేమ చూపిస్తున్నట్టుగా నటిస్తున్న రేవంత్ రెడ్డి భారతీయ జనతా పార్టీపై విమర్శలు చేయడం సిగ్గుచేటు అన్నారు. బిసిలకు ఏ పార్టీ ఏమి చేసిందనే అంశంపై బహిరంగ చర్చకు బిజెపి సిద్ధంగా ఉందని, సిఎం రేవంత్ రెడ్డి దమ్ముంటే దీనిపై స్పందించాలని అన్నారు. భారతదేశంలో 50 ఏళ్లకుపైగా పాలించిన కాంగ్రెస్ పార్టీ ఒక్కసారి కూడా బలహీన వర్గాలకు చెందిన వ్యక్తిని ప్రధానిగా చేయలేదని అన్నారు.

ఒక్కసారైనా బిసిలకు రాష్ట్రపతి అయ్యే అవకాశం కల్పించలేద న్నారు. ఎమర్జెన్సీ అనంతరం దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌ను ప్రజలు తిరస్కరించినప్పటికీ, రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల ప్రజలు మెదక్ నుంచి ఇందిరాగాంధీ గారిని ఎంపిగా గెలిపించి రాజకీయ పునర్జన్మ ప్రసాదించారని అన్నారు. కానీ గెలిచాక కూడా బిసిలకు ప్రధాని, రాష్ట్రపతి, ముఖ్యమంత్రి పదవులు ఇవ్వకుండా అవమానించడమే కాంగ్రెస్ చరిత్రగా మిగిలింది. 1989లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఘోర ఓటమి పాలైనప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం కాంగ్రెస్‌కు 39 లోక్‌సభ స్థానాలు ఇచ్చిన తెలుగు ప్రజలను కూడా 2004, 2009లో ఎంపిలను గెలిపించినా కాంగ్రెస్ వంచించింది.

ఈ దేశంలో తొలిసారి బిసి వ్యక్తిని ప్రధానిగా చేసిన ఘనత భారతీయ జనతా పార్టీదే. మూడుసార్లు బిసి వ్యక్తిని ప్రధానిగా కొనసాగించి, కేంద్ర మంత్రివర్గంలో 27 మంది బిసిలకు స్థానం ఇచ్చిన ఘనత బిజెపిదే. అనేక రాష్ట్రాల్లో బిసిలను ముఖ్యమంత్రులుగా చేసిన ఘనత కూడా బిజెపిదే. దళిత, గిరిజన, మైనారిటీ వర్గాలకు అత్యున్నతమైన రాష్ట్రపతి పదవిని కల్పించిన ఘనత కూడా భారతీయ జనతా పార్టీదే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు అర్ధ శతాబ్దం పాటు పాలించిన కాంగ్రెస్ ఒక్కసారి అయినా బిసిని ముఖ్యమంత్రిగా చేయలేదు.

రాష్ట్ర జనాభాలో సగం మంది బిసిలు ఉన్నా... రేవంత్ రెడ్డి కేబినెట్‌లో ఆ మేరకు ప్రాతినిధ్యం కల్పించారా? నామినేటెడ్ పదవుల్లోనూ బిసిలకు అన్యాయమే జరిగింది. అటువంటి కాంగ్రెస్ పార్టీ ఈరోజు బిసిల గురించి మొసలికన్నీరు కారుస్తుందన్నారు.

రానున్న రోజుల్లో తెలంగాణలోని బడుగు, బలహీన వర్గాల ప్రజలు కాంగ్రెస్‌కు తప్పకుండా చరమగీతం పాడుతారు.

# కెజిబివిల్లో స్వాప్, మ్యూచువల్ బదలీలకు అనుమతి

## 26లోగా ఎస్‌పిడి ఆఫీసుకు పంపించాలి

### డిఇఒలను ఆదేశించిన స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్

**హైదరాబాద్, జూలై 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు(కెజిబివి)ల్లో బదలీలకు అనుమతిస్తూ సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్(ఎస్‌పిడి) మెమో జారీ చేశారు. అయితే వీటిలో అన్ని రకాల బదలీలకు కాకుండా కేవలం స్వాప్, మ్యూచివల్ బదలీలకు మాత్రమే అవకాశం కల్పించారు. కెజిబివిల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు స్వాప్, మ్యూచివల్ బదలీల్లో ఏదో ఒకదానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కెజిబివిల్లో బదలీలకు సంబంధించిన దరఖాస్తులను ఈ నెల 26 లోగా ఎస్‌పిడి ఆఫీసుకు అందించాలని మోమో నంబర్ 3638ను ఎస్‌పిడి జారీ చేశారు. జిల్లా విద్యాధికారులు(డిఈవో)లు కెజిబివిల్లో పనిచేస్తున్న కాం ట్రాక్ట్ ఉద్యోగుల నుంచి దరఖా స్తులను స్వీకరించి ఈ నెల 26 వరకు ఎస్‌పిడి ఆఫీసుకు పంపించాల్సి ఉంటుంది. కాంట్రాక్ట్ ఉద్యోగులు స్వాప్, మ్యూచు వల్‌లో ఏదో ఒకటి మాత్ర మే దరఖాస్తు చేసు కోవాలని మెమోలో స్పష్టం చేశారు.

**ఖాళీల్లో సాధారణ బదలీలకూ అవకాశం ఇవ్వాలి:యుటిఎఫ్**

కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో దంపతులు(స్పౌజ్), పరస్పర(మ్యూచువల్) బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలని, వారి వివరాలను ఈనెల 26లోగా ఎస్‌పిడి కార్యాలయానికి పంపాలని ఆదేశిస్తూ సమగ్ర శిక్ష, రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ మెమో నెం 3638 ద్వారా ఉత్తర్వులు ఇచ్చారని.. ఈ ఉత్తర్వులను టిఎస్ యుటిఎఫ్ స్వాగతి స్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ తెలిపారు. అయితే ఇటీవల పలు కెజిబివిలు అప్‌గ్రేడ్ అయ్యాయని... కొందరు సిబ్బంది ఇతర ఉద్యోగాలకు పోవడంతో ఖాళీలు ఏర్పడ్డాయని తెలిపారు. పలువురు ఉద్యోగులు అతి తక్కువ వేతనంతో దూరప్రాంతాల్లో పని చేస్తూ బదిలీలు కోరుకుంటున్నారని.. గత మూడు సంవత్సరాల్లో బదిలీలు జరిగినా వారిలో చాలా మందికి అవకాశం రాలేదన్నారు. అటువంటి వారికి మేలు జరిగే విధంగా నూతనంగా మంజూరైన, ఖాళీగా ఉన్న పోస్టుల్లో సాధారణ ఉద్యోగు లకు కూడా బదలీ (షిఫ్టింగ్)కి అవకాశం కల్పించాలని, దరఖాస్తు గడువును మరో రెండు రోజులు పొడిగించాలని వారు డిమాండ్ చేశారు.

## బైక్‌పై ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయి అక్రమ రవాణా

### 8.6 కేజీల సరకు స్వాధీనం చేసుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

**హైదరాబాద్, జూలై 24, ప్రభాతవార్త:** డేలెట్ సాఫ్టవేర్ కంపెనీలో సెక్యూరిటి గార్డు ఉద్యోగం. ఉద్యోగం చేస్తున్న కంపెనీ ఉద్యోగులకు గంజాయి అమ్మకాలు ప్రవృత్తిగా కొనసాగిస్తున్న అంజనీ దూబే అనే వ్యక్తిని, ఒరిస్సాకు చెందిన శంకర్‌దాస్‌ను 8.6 కేజీల గంజాయితో గురువారంఎస్‌టిఎఫ్ సి, డీ టీమ్‌ల సిఐలు సీఐలు పట్టుకున్నారు. బీహార్ రాష్ట్రాని చెందిన అంజనీ దూబే సాఫ్టేర్ కంపెనీలో సెక్యూరిటీగార్డుగా ఉద్యోగం చేస్తున్నాడు. ఒరిస్సాలోని మల్కాన్‌గిరి జిల్లాకు చెందిన శంక ర్‌దాస్‌తో పరిచయం ఏర్పడింది. సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేసే ఉద్యోగులకు ఇద్దరుకలిసి గంజాయి అమ్మకాలు జరుపుతూ సొమ్ము చేసుకుంటున్నారు. గత కొంతకాలంగా ఇద్దరు కలిసి గంజాయి అమ్మకాలు చేస్తున్నారు.

గంజాయి కోసం భద్రాచలం ప్రాంతానికి సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న అంజనీ దాస్ వెళ్లి తాను వచ్చినట్లు సమాచారం ఇస్తాడు. మల్కాన్ జిల్లా నుంచి బైక్‌పై గంజాయిని తీసుకువచ్చి సెక్యూరిటీ గార్డును గంజాయిని హైదరాబాద్‌లో బెక్‌పై తీసుకు వచ్చిన తనకు రావాల్సిన మొత్తాన్ని తీసుకెళతాడు. వీరిద్దరి గంజాయి రాకెట్‌ను చేధించడానికి స్టేట్ టాస్క్‌ఫోర్స్ సీ అండ్ డీ టీమ్‌ల సీఐలు వెంకటేశ్వర్లు, నాగరాజులు సిబ్బంది కలిసి స్థానిక ఎక్సైజ్ సిబ్బంది సహకారం తీసుకొని భద్రాచలం కూనవరం రోడ్డు ఆర్టీఓ చెక్‌పోస్టు వద్ద గంజాయితో బైక్ వస్తున్న ఇద్దరిని పట్టుకొని అరెస్టు చేశారు. నిందితుల వద్ద ఉన్న 8.6 కేజీల గంజాయితోపాటు రెండు సెల్ ఫోన్లను, గంజాయి రవాణకు వినియోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకొని భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐలు తెలిపారు.

## నీటిపారుదల శాఖలో 127 మంది ఎఇఇ లకు పదోన్నతులు

**హైదరాబాద్, జూలై 24, ప్రభాతవార్త:** నీటిపారుదల శాఖలో పనిచేస్తున్న 127 మంది ఎ.ఇ.ఇ లు పదోన్నతులు పొందారు. పదోన్నతులకోసం ఏ.ఇ. ఇ లు గడిచిన 18 ఏళ్ల నిరీక్షణకు నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి జోక్యంతో ఎట్టకేలకు తెరపడింది. ఇంజినీరింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి నాగరాజు, కోశాధికారి సంతోష్ రెడ్డి ల ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.




సమావేశంలో మాట్లాడుతున్న బాలగోని బాలరాజుగౌడ్, ఐలి వెంకన్నగౌడ్, యెలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్ తదితరులు

## గౌడ్‌లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

### వైన్స్, బార్లల్లో 25 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

### రాష్ట్ర గౌడ, కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ డిమాండ్

**హైదరాబాద్, జూలై 24, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ఎన్నికల ముందు గౌడ్‌లకు ఇచ్చిన హామీ మేరకు వైన్స్‌లు , బార్‌లల్లో 25 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అలాగే రాష్ట్రంలో కల్లు గీత సొసైటీలకు వైన్స్‌లను 50శాతం సబ్సిడీతో ఇవ్వాలని తెలంగాణ గౌడ, కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కమిటీ చైర్మన్ బాలగోని బాలరాజు గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మ న్ యెలికట్టె విజయ్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ గడ్డమీది విజయ్‌కుమార్‌గౌడ్‌లు మాట్లాడుతూ.. త్వరలోనే వైన్స్‌లకు టెండర్లు ఆహ్వానిస్తారని తెలుస్తుందని ఈ క్రమంలోనే ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ గౌడ్లకు వైన్స్, బార్లలో 25శాతం రిజర్వేషన్లు కేటాయిస్తామన్న హామీని నెరవేర్చాలని కోరారు. అలాగే గత బిఆర్ఎస్ ప్రభుత్వం గౌడ్లకు వైన్స్‌లో 15శాతం రిజర్వేషన్‌లు కేటాయించిందని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా గౌడ్స్‌కు 10 శాతం వైన్స్ లను 50 సబ్సిడీతో ఇవ్వడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 20 నెలల పూర్తయినా ఇచ్చిన హామీలు నెరవేర్చుకోకపోవడం బాధాకరమని ప్రభుత్వం చిత్తశుద్ధి ఉంటే నూతన పాలసీకి నోటిఫికేషన్ ఇవ్వకముందే రిజర్వేషన్ సంబంధించిన గేజిట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్, బీసీ సమైక్య అధ్యక్షులు ఎస్. దుర్గయ్యగౌడ్, అఖిల భారత గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కూరెళ్ల వేములయ్య గౌడ్, గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్, బత్తిని కీర్తి లత గౌడ్, కొత్త నవీన్ గౌడ్, సింగం నాగేశ్వర గౌడ్, పోతాగని ఐలన్ గౌడ్,గోదా వెంకటేష్ ,యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## పరువునష్టం కేసులో రాహుల్‌కు ఊరట



**నాసిక్, జూలై 24:** కాంగ్రెస్ అగ్ర నాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి కోర్టులో ఊరట దక్కింది. పరువు నష్టం కేసులో ఆయనకు నాసిక్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. హిందుత్వ సిద్ధాంతకర్త, స్వాతంత్య్ర సమర యోధుడు వినాయక్ దామోదర్ సావర్కర్‌పై గతంలో చేసిన వ్యాఖ్యలను సంబంధించిన పరువు నష్టం కేసులో బెయిల్ మంజూరు చేస్తూ నాసిక్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా రాహుల్ గాంధీ వీడియో లింక్ ద్వారా అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆర్ సి నర్వాడియా ఎదుట హాజరై తాను నిర్దోషినని తెలిపారు. రూ.15వేల బాండ్‌ను సమర్పించడంతో బెయిల్ మంజూరు చేసినదని న్యాయవాదులు తెలిపారు. 2022 నవంబర్ భారత్ జోడోయాత్ర సందర్భంగా హింగోలిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సావర్కర్ ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారని దేవేంద్ర భూతాడా ఆరోపించారు. రాహుల్ ప్రసంగం పిటిషన్ ఆరాధ్యదైవం, స్వాతంత్య్ర సమరయోధుడు వీర్ సావర్కర్ ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని పిటిషన్‌లో ఆరోపించారు.

## రాష్ట్రంలో పురుషులు 1.79 కోట్లు, స్త్రీలు 1.75 కోట్లు

### మళ్లీ కులగణన విడుదల చేసిన ప్రభుత్వం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 24:** కులగణనకు సంబంధించిన వివరాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరోసారి విడుదల చేసింది. 1.12 కోట్ల(97.10శాతం) ఇళ్లలో సర్వే చేశామని, 3.55 కోట్ల మంది పాల్గొన్నారని గురువారం తెలిపింది. 3.34లక్షల ఇళ్ల సర్వేలో పాల్గొనలేదని వెల్లడించింది. జనాభా పరంగా ఎస్సీలు 61.91లక్షలు (17.42శాతం),ఎస్టీలు 37.08లక్షలు (10.43శాతం),బీసీలు రెండు కోట్లకు పైగా (56.36శాతం),ఓసీలు 56.13లక్షలు(15.97శాతం) ఉన్నారని పేర్కొంది. పురుషులు 1.79 కోట్లు,స్త్రీలు 1.75కోట్ల మంది,థర్డ్ జండర్ వారు 13,789 మంది ఉన్నారని తెలిపింది.

## నేటి నుంచి ఎప్‌సెట్ సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్


### 26, 27న వెబ్‌ఆప్షన్లు.. 30న సీట్ల కేటాయింపు

**హైదరాబాద్, జూలై 24, ప్రభాతవార్త:** ఎప్‌సెట్–2025 కౌన్సెలింగ్‌లో భాగంగా నేటి(శుక్రవారం) నుంచి సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నారు. ఈ నెల 26(శనివారం) సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహిస్తారు. ఈ నెల 26, 27 తేదీల్లో వెబ్ ఆప్షన్ల అవకాశం కల్పించినట్లు సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి ఈ నెల 30న సీట్ల కేటాయింపు చేయనున్నారు. ఇప్పటికే మొదటి సీట్ల కేటాయింపు చేపట్టగా.. సీట్లు పొందిన విద్యార్థులు కాలేజీల్లో చేరడానికి ఇచ్చిన గడువు ముగిసింది. గడువు ముగిసే నాటికి 77,561 సీట్లను కేటాయించగా.. వాటిలో 59,980 మంది సెల్ఫ్ రిపోర్టింగ్ చేసినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో కన్వీనర్ కోటాలో 83,054 సీట్లు అందుబాటులో ఉండగా.. మొదటి విడతలో 77,561 సీట్లను కేటాయించారు. వాటిలో 59,980 మంది చేరినట్లు తెలిపారు.

## భార్యను కత్తితో పొడిచి హత్య చేసిన భర్త

### అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఘటన

**హైదరాబాద్ (అబ్దుల్లాపూర్‌మెట్), జూలై 24, ప్రభాతవార్త:** భార్య భర్తల మధ్య జరిగిన మనస్పర్థల కారణంగా బంధువుల ఇంట్లో జరిగిన పుట్టిన రోజు వేడుకల్లో భార్యను కత్తితో పొడిచి హత్య చేసిన భర్త పరారైన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సూర్యాపేట పట్టణం బాపూజీనగర్ తండాకు చెందిన సాతుపాటి శ్రీనివాస్, కళావతి దంపతులు. కాగా కళావతి ఆరోగ్య పరిస్థితి సరిగ్గా లేకపోవడంతో ఆమె చెల్లెలు సమ్మక్క(40) శ్రీనివాస్ 13 ఏళ్ల క్రితం వివాహం చేసుకోగా వారికి ఇద్దరు పిల్లలు పుట్టారు. వారితో కలిసి సూర్యాపేట పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో జనగాం రోడ్డులో పాత ఇనుపసామాన్ల వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో గత 15 రోజుల క్రితం శ్రీనివాస్, సమ్మక్కల మధ్య గొడవ జరగడంతో అబ్దుల్లాపూర్‌మెట్‌లోని బీఎన్‌రెడ్డిలో నివాసముంటున్న వాళ్ల మేనకోడలు రాజేశ్వరి ఇంటికి సమ్మక్క వచ్చింది. ఈ క్రమంలో గురువారం రాజేశ్వరి బిడ్డ పుట్టిన రోజు సందర్భంగా అందరూ వేడుకలు జరుపుకుంటుండగా రాజేశ్వరి ఇంటికి శ్రీనివాస్ ఎవరికీ అనుమానం రాకుండా అందరితో కలిసి పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్నాడు. పుట్టిన రోజు జరుపుకుంటున్న రాజేశ్వరి కూతురును సమ్మక్క తన సెల్‌ఫోన్‌లో ఫోటోలు తీస్తుండగా అప్పటికే తన వెంట కత్తిని తీసుకువచ్చిన శ్రీనివాస్ అతని భార్యను కత్తితో పొడిచి దారుణంగా హత్య చేశాడు. అందరూ తేరుకునేలోపే శ్రీనివాస్ అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు ఎల్‌బీనగర్ అదనపు డీసీపీ కోటేశ్వరరావు, వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ అశోక్‌రెడ్డి, ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డిలు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. హత్యకు గల కారణాలను తెలుసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## బౌద్ధ స్తూపాలను ధ్వంసం చేసిన చైనా

**బీజింగ్, జూలై 24:** చైనాలో మతాలపై కమ్యూనిస్టు ప్రభుత్వం ఎంత ఉక్కుపాదం మోపుతుందో తెలిసిందే. కొన్నేళ్ల క్రితం వందలాది చర్చిలు, మసీదులను డ్రాగన్ ఎలా నేలమట్టం చేసింది. తాజాగా టిబెట్‌లోని బౌద్ధమతాలు, స్తూపాలపై బీజింగ్ విరుచుకుపడింది. వందలాది బౌద్ధస్తూపాలను చైనా అధికారులు నేలమట్టం చేశారు. బయటి ప్రపంచానికి తెలియకుండా రహస్యంగా టిబెట్ సాంస్కృతిక వారసత్వాన్ని చైనా చెరిపేస్తోంది. టిబెట్‌లో మూడొందలకు పైగా బౌద్ధ స్తూపాలను చైనా తాజాగా ధ్వంసంచేసింది. కార్జేలో ఉండే ప్రముఖ పద్మసంభవ విగ్రహాన్ని సైతం నాశనం చేసింది. టిబెట్‌లో బౌద్ధమతాన్ని నియంత్రించాలని సంకల్పించుకున్న చైనా ప్రభుత్వం, స్థానికులపై మరిన్ని కఠినమైన ఆంక్షలు విధించింది. భారత్‌లోని ధర్మశాల వేదికగా పాలించే సెంట్రల్ టిబెటన్ అడ్మినిస్ట్రేషన్ వెల్లడించింది. చైనా ధ్వంసం చేసిన వాటిలో జంగ్అంగ్ బౌద్ధమఠం సమీపంలో మూడు భారీ బౌద్ధస్తూపాలు ఉన్నాయని పేర్కొంది. స్థానిక బౌద్ధులు, ప్రజలు తమ గురువులుగా భావించే కెన్పో జిగ్మే ఫుంట్సోక్, గురు రిన్పోచే విగ్రహాలను చైనా కూల్చినట్లు సెంట్రల్ టిబెటన్ అడ్మినిస్ట్రేషన్ తెలిపింది. చైనా సైన్యం, అధికారులు టిబెటియన్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారనీ వారిపై అనేక ఆంక్షలు విధించారని సెంట్రల్ టిబెటన్ అడ్మినిస్ట్రేషన్ వెల్లడించింది. అక్కడ జరిగే విధ్వంసం బయటకు వెళ్లకుండా డ్రాగన్ గట్టి నిఘాపెట్టింది. అనుమానితులను రాజ్య రహస్యాల నేరం కింద అరెస్టులు చేస్తోంది.

# శృంగారానికి సమ్మతి వయసును 16 యేళ్లకు తగ్గించాలి

### రెండేళ్లు పెంచడం ఏకపక్షంగా జరిగిన చర్యలే..
### అమికస్‌క్యూరీ సీనియర్ న్యాయవాది ఇందిరాజైసింగ్



**న్యూఢిల్లీ, జూలై 24:** పోక్సో చట్టం కింద లైంగిక కార్యకలాపాలకు సమ్మతి తెలిపే వయసును 18 నుంచి 16 ఏళ్లకు తగ్గించాలని సుప్రీంకోర్టుకు అమికస్ క్యూరీ, సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ విజ్ఞప్తి చేశారు. పోక్సో చట్టం 2012, ఐపీసీ సెక్షన్ 375 ప్రకారం 16–18 ఏళ్ల వయసులో ఉన్నవారి లైంగిక కార్యకలాపాలను పూర్తిగా నేరంగా పరిగణించడాన్ని సవాల్ చేస్తూ సుప్రీంలో ఆమె వాదనలు వినిపించారు. ప్రస్తుత చట్టం కౌమారదశలో ఉన్నవారి మధ్య ఏకాభిప్రాయ ప్రేమ సంబంధాలను నేరంగా పరిగణిస్తుందని, ఇది వారి రాజ్యాంగ హక్కులను ఉల్లంఘిస్తుందని అభిప్రాయ పడ్డారు. పోక్సో చట్టం కౌమారదశలో ఉన్నవారి మధ్య ఏకాభిప్రాయ సంబంధాలను తప్పుగా చూపిస్తోంది. వారి స్వయంప్రతిపత్తి, పరిపక్వత, సమ్మతిని విస్మరిస్తుంది. 16–18 సంవత్సరాలకు సమ్మతి వయసును పెంచడాన్ని సమర్థించడానికి ఎటువంటి హేతుబద్ధమైన కారణం లేదా అనుభవైక డేటా లేదు. దర్యాప్తు లేకుండానే సెక్స్ సమ్మతి వయసును 18ఏళ్లకు పెంచారు. లైంగిక కార్యకలాపాల సమ్మతి వయసు 16ఏళ్లని జస్టిస్ వర్మ కమిటీ చేసిన సిఫార్సుకు ఇది విరుద్ధంగా ఉంది. 2017–21 మధ్య 16–18 ఏళ్ల వయసు గల మైనర్లపై పోక్సో కేసులు 180 శాతం పెరిగాయని ఇందిరా జైసింగ్ తెలిపారు. కౌమారదశలో ఉన్నవారి మధ్య ఏకాభిప్రాయ లైంగిక చర్యలను పోక్సో, ఐపీసీ సెక్షన్ల కింద విచారణ నుంచి మినహాయించాలి. దీన్ని చట్టంలో చేర్చాలి. టీనేజర్ల మధ్య లైంగిక చర్యను నేరంగా పరిగణించడం ఏకపక్షం, రాజ్యాంగ విరుద్ధం. లైంగిక కార్యకలాపాల విషయంలో నిర్ణయం తీసుకునే హక్కు కౌమార దశలో ఉన్నవారికి ఉందని ఇందిరా జైసింగ్ వ్యాఖ్యానించారు. బొంబాయి, మద్రాస్, మేఘాలయతో సహా వివిధ హైకోర్టులు పోక్సో చట్టం గురించి గతంలో చేసిన వ్యాఖ్యలను ఇందిరా జైసింగ్ ఉదహరించారు. పోక్సో చట్టం కింద కౌమారదశలో ఉన్న అబ్బాయిలపై విచారణ జరపడంపై అసంతృప్తి వ్యక్తం చేశారని గుర్తు చేశారు. మైనర్లతో సంబంధం ఉన్న అన్ని లైంగిక చర్యలు బలవంతం కాదని తెలిపాయన్నారు. పోక్సో చట్టం దుర్వినియోగం, ఏకాభిప్రాయ సంబంధాల మధ్య తేడాను గుర్తించాలని పలు హైకోర్టులు నొక్కిచెప్పాయన్నారు. 16–18 ఏళ్ల వయసు గల కౌమారదశలో ఉన్నవారి మధ్య ఏకాభిప్రాయ లైంగిక చర్య దుర్వినియోగం కాదు. పోక్సో, అత్యాచార చట్టాల పరిధి నుంచి వారిని మినహాయించాలి. కౌమారదశలో ఉన్నవారు సురక్షితమైన వైద్య సంరక్షణ పొందకుండా నిరోధించే పోక్సో చట్టంలోని సెక్షన్ 19ని సమీక్షించాలని ఇందిరా తెలిపారు. పోక్సో చట్టం ప్రకారం ఇద్దరు వ్యక్తుల మధ్య లైంగిక సంబంధం విషయంలో సమ్మతి వయసుపై కొన్నాళ్ల క్రితం లా కమిషన్ కీలక వ్యాఖ్యలు చేసింది. లైంగిక కార్యకలాపాల్లో పాల్గొనడానికి అంగీకారం తెలిపే కనీస వయసు 18 సంవత్సరాల నుంచి 16 ఏళ్లకు తగ్గించాలనే వాదనను తిరస్కరించింది. పోక్సో చట్టం ప్రకారం ప్రస్తుతమున్న సమ్మతి వయసును మార్చడం అంత మంచిది కాదని పేర్కొంది.

## పర్యావరణం, వాతావరణానికి అనుగుణంగా మార్పులు

### ఇఎస్‌సిఐ డైరెక్టర్ రామేశ్వర్‌రావు
### రీబార్ కంపోజిట్స్ ఫైబర్ రీఫోర్స్‌డ్ కాంక్రీట్‌లో ప్రస్తుత పరిస్థితులపై వర్క్‌షాప్

**హైదరాబాద్, జూలై 24, ప్రభాతవార్త:** ప్రస్తుతం వాతావరణ మార్పులకు అనుకూలంగా బిఎఫ్ ఆర్‌పి/ జిఎఫ్‌ఆర్‌పి రీబార్ కంపోజిట్స్‌తో ఫైబర్ రీఫోర్స్‌డ్ కాంక్రీట్‌లో మార్పులు చోటు చేసుకున్నాయని ఈఎస్‌సిఐ డైరెక్టర్ రామేశ్వర్‌రావు అన్నారు.

గురువారం బిఎఫ్‌ఆర్‌పి/జిఎఫ్‌ఆర్‌పి రీబార్ కంపోజిట్స్‌తో ఫైబర్ రీఫోర్స్‌డ్ కాంక్రీట్‌లో మార్పులు అనే అంశంపై ఒక రోజు వర్క్‌షాప్ ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా జరిగింది. ఈ వర్క్ షాప్‌లో అకడమియా, పరిశ్రమ, ప్రభుత్వ సంస్థలు, పరిశోధన సంస్థల నుంచి పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు. వాతావరణ మార్పులు, పర్యావరణ ప్రగతి నేపథ్యంలో ఫైబర్ రీఫోర్స్‌డ్ కాంక్రీట్ బాసాల్ట్ / గ్లాస్ ఫైబర్ రీబార్ కంపోజిట్స్ వంటి నూతన, పర్యావరణ అనుకూల నిర్మాణ పదార్థాల వినియోగాన్ని ప్రోత్సహించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా డా. జి. రమేశ్వర్‌రావు మాట్లాడుతూ వాతావరణ అనుకూల నిర్మాణ విధానాల అవసరాన్ని ప్రస్తా విస్తూ, బిఎఫ్‌ఆర్‌పి, జిఎఫ్‌ఆర్‌పి రీబార్లు వంటి ఆధునిక పదార్థాలు తక్కువ బరువుతో, తక్కువ కార్బన్ ఉద్గారాలతో, తుపానులకు, తేమకు, సముద్ర ప్రాంతాలకు తట్టుకొనే సామర్థంతో ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజీవ్ బిష్ట్, డా. చంద్రకళ, నరేష్ తోపాటు పలువురు నిపుణులు పాల్గొన్నారు. మహీంద్రా యూనివర్సిటీతోపాటు ఇతర ప్రఖ్యాత సంస్థల నిపుణులు తమ అనుభవాలు, పరిశోధనా ఫలితాలు, నూతన విషయాలను వివరించారు.

## ఖరీఫ్‌లో ఇప్పటి వరకూ 76.28 లక్షల ఎకరాల్లో సాగు

**హైదరాబాద్, జూలై 24, ప్రభాతవార్త:** రాష్ట్ర సాధారణ సాగు విస్తీర్ణం 1,32,44,305 ఎకరాలకు గాను ఇప్పటివరకు 76,28,084 ఎకరాల్లో రైతులు పంటలు వేసినట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో పేర్కొంది. వరి సాధారణ విస్తీర్ణం 62,47,868 ఎకరాలు కాగా, 17,52,144 ఎకరాల్లో (28.4 శాతం) నాట్లు వేశారు. పత్తి సాధారణ విస్తీర్ణం 48,93,016 ఎకరాలు కాగా 42,00,411 ఎకరాల్లో (85.85 శాతం) సాగు పూర్తయింది. మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 5,21,206 ఎకరాలకు గాను 5,20,527 ఎకరాల్లో (99.87శాతం) పంట వేశారు. అలాగే కంది 62.95 శాతం, సోయాబీన్ 83.12శాతం విస్తీర్ణంలో సాగయ్యాయి. ఇతర పంటలు, పప్పుధాన్యాలు, నూనె గింజల సాగు పురోగతిలో ఉందని వ్యవసాయశాఖ పేర్కొంది.

**వర్షాలతో అప్రమత్తం:**
**వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా వుండి, రైతులకు తగిన జాగ్రత్తలు తెలియచేయాలని వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులకు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు సూచించారు. వాగులు, వంకల దగ్గర అప్రమత్తంగా వుండి యెటువంటి ప్రాణ ఆస్తి నష్టం కాకుండా చూడాలని జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ యంత్రాంగానికి విజ్ఞప్తి చేసినట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ఉపరాష్ట్రపతి ఎన్నికలో ఇండియా కూటమి పోటీ!

**న్యూఢిల్లీ, జూలై 24:** జగదీప్‌ధన్‌ఖడ్ రాజీనామా చేసిన నేపథ్యంలో త్వరలోనే ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నిక నిర్వహించేందుకు ఈసీ ఏర్పాట్లుచేస్తోంది. అయితే పార్లమెంటులో ఎన్డీయేకు స్పష్టమైన మెజార్టీ ఉన్నప్పటికీ ఈ ఎన్నికలో పోటీచేసే యోచనలో విపక్షాలకూటమి ఉన్నట్లు కనిపిస్తోంది. ఇందుకు సంబందించి ఉమ్మడి అభ్యర్థిపై సమష్టినిర్ణయం తీసుకోనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

ఫలితంతో సంబంధంలేకుండా బలమైన సందేశాన్ని పంపే ఉద్దేశ్యంతోనే పోటీచేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఉభయసభల్లో వివిధ ఖాళీలతోకలిపి సభ్యులు మొత్తం 786గా ఉంది. వీరిలో 394 మంది మద్దతు అవసరం. లోక్‌సభలో ఎన్డీయేకు 293 మంది సభ్యుల బలం ఉంటే రాజ్యసభలో 129 మంది మద్దతున్నది. మరోవైపు విపక్షకూటమికి లోక్‌సభలో 234 మంది సభ్యులు, రాజ్యసభలో 79 మంది సభ్యుల బలం ఉంది. మొత్తంగా ఎన్డీయేకు 422 మంది విపక్షకూటమికి 313 మంది అనుకూలంగా ఉన్నారు. ఇలా ఉభయసభల్లో మెజార్టీ లేనప్పటికీ



ఉపరాష్ట్రపతి ఎన్నికలో పోటీచేసేందుకు విపక్షాలు సిద్ధం అవుతున్నాయి.

## సినీ నటుడు విజయ్ దేవరకొండకు ఇడి నోటీసులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 24:** సినీ నటుడు విజయ్ దేవరకొండకు ఇడి మరోసారి నోటీసులు జారీ చేసింది. సినీ నటులు, సోషల్ మీడియా ఇన్ఫ్లూయెన్సర్ల బెట్టింగ్ యాప్ ప్రమోషన్లకు సంబంధించి మనీలాండరింగ్ పై ఇడి దృష్టి సారించింది. ఈ క్రమంలో సినీ నటులు, సోషల్ మీడియా ఇన్ఫ్లూయెన్సర్లు విచారణకు హాజరు కావాలంటూ ఇడి నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలో సినీ నటుడు విజయ్ దేవరకొండకు మెదటగా ఆగస్ట్ 6వ తేదీన విచారణకు రావాలని నోటీసులు ఇచ్చింది. అయితే తాజాగా మరోసారి జారీ చేసిన నోటీసుల్లో ఆగస్ట్ 11వ తేదీన హాజరు కావాలని సూచించింది. కాగా, విజయ్ దేవరకొండ విజ్ఞప్తి మేరకు విచారణ తేదీని మార్చినట్లు సమాచారం. ఇదే కేసులో జూలై 30వ తేదీన ప్రకాశ్ రాజ్, ఆగస్ట్ 13న మంచు లక్ష్మీ విచారణకు రావాలని ఇడి నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే.

## నాకు రూ.కోటి ఇస్తేనే తండ్రి వద్దకు వెళతా!

### సుప్రీంలో 12 యేళ్ల బాలిక వాదన విని విస్తుపోయిన చీఫ్‌జస్టిస్

**న్యూఢిల్లీ, జూలై 24:** సుప్రీంకోర్టులో 12 ఏళ్ల బాలిక మాటలు విని న్యాయమూర్తులనుంచి న్యాయ వాదులు మొత్తం అందరూ విస్తుపోయారు. బాలిక తండ్రితో కలిసి జీవించడానికి రూ.ఒక కోటి డిమాండ్‌చేయడంతో షాక్ అయ్యారు. వాస్తవానికి తల్లితండ్రుల మధ్య ఉన్న వివాదానికి సంబంధించిన పిటిషన్ సుప్రీంకోర్టులో విచారణకు వచ్చింది. సుప్రీంచీఫ్ జస్టిస్ బిఆర్‌గవాయి ఈ పిటిషన్ విచారించారు. ఆ బాలిక మాటలు విని ఒక్కసారిగా విస్తుపోయారు. వెంటనే ఆ అమ్మాయి తల్లిని మందలించారు. వాస్తవానికి ఉత్తరాఖండ్‌కు చెందిన దంపతుల మధ్య వివాదం తలెత్తింది. వారిక ఒక కుమార్తె. జిల్లాకోర్టు కూతురుబాధ్యతను తండ్రికి అప్పగించింది జిల్లా కోర్టు ఈ ఉత్తర్వులను హైకోర్టులో తల్లి సవాలుచేసింది. ప్రస్తుతం హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. జిల్లాకోర్టు తీర్పును తల్లి ధిక్కరించిందని, తన కూతురును అప్పగించలేదని తండ్రి సుప్రీంకోర్టుకు చేరాడు. ఈ పిటిషన్ సుప్రీంకోర్టులో విచారణకు వచ్చింది. ఆ 12 ఏళ్ల బాలికను విచారించిన సుప్రీం సీజెఐ గవాయి విస్తుపోయారు. 'నువ్వు నా తల్లిని వేధిస్తున్నావు. నా తల్లిపై కోర్టు ధిక్కారకేసు దాఖలు చేసావు. నాకు రూ.కోటి ఇవ్వడం. అలాగేతైనే తండ్రివద్దకు వెళతా అని బాలిక చెప్పింది. పాఠశాల రికార్డుల్లో కూడా ఆ తల్లి బాలిక తండ్రిపేరును తొలగించారు. ఇది తెలుసుకున్న సిజెఐ బిఆర్‌గవాయి ఆగ్రహం వ్యక్తంచేసారు. తల్లిని తీవ్రంగా మందలించారు. బాలిక మనసును పాడుచేయవద్దు. తండ్రిపై తప్పుడు ప్రచారం చేయొద్దని సూచించారు. అనవసరంగా ఈ బిడ్డను లాగుతున్నారరని మండిపడ్డారు. తల్లికుమార్తె మనసులో తప్పుడు విషయాలు ద్వేషాన్ని నింపుతోందని చీఫ్‌జస్టిస్ పేర్కొన్నారు. తండ్రి తరపున సీనియర్ న్యాయవాది పిఆర్ పట్వాలియా సుప్రీంలో వాదిస్తే తల్లితరపున న్యాయవాది అనుభా అగర్వాల్‌మధ్యవర్తిత్వానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టంచేసారు. ఇరుపక్షాలు అంగీకరించిన తర్వాత కోర్టు మధ్యవర్తికి అప్పగించింది. ఉత్తరాఖండ్ హైకోర్టు మాజీ సిజె జస్టిస్ రీతుబహ్రీని మధ్యవర్తిగా నియమించింది.




## లెజెండరీ రెజ్లర్ హాల్క్‌హోగన్ మృతి

**జార్జియా, జూలై 24:** అమెరికన్ లెజెండరీ రెజ్లర్ హాల్క్ హోగన్ మరణించాడు. ఆయన గుండె పోటుతో కన్ను మూసి నట్లు వైద్యులు తెలిపారు. ఆగస్టు 11, 1953న జార్జియాలోని అగస్టాలో జన్మించిన హాల్క్ రెజ్లింగ్ క్రీడకే ప్రత్యేక వన్నె తెచ్చారు. డబ్ల్యూడబ్ల్యూఈకి ప్రజాదరణ తీసుకురావడంలో హాల్క్ తీవ్రంగా కృషి చేశారు. 1983లో వరల్డ్ రెజ్లింగ్ ఫెడరేషన్‌లో చేరడంతో ఆయన కెరీర్ ఒక గొప్ప టర్న్ తీసుకుంది. ఆండ్రీ ది జెయింట్, మాకో మ్యాన్ రాండీ సావేజ్, అల్టిమేట్ వారియర్ వంటి గొప్ప రెజ్లర్‌లతో చారిత్రాత్మక మ్యాచ్‌లలో పోటీపడ్డారు. హాల్క్ ఆరు సార్లు డబ్ల్యూడబ్ల్యూఈ ఛాంపియన్‌గా నిలిచారు. హాల్క్ హ్యాండిల్ బార్ మీసాలతోనూ సూపర్ క్రేజ్ తెచ్చుకున్నారు. హోగన్ 2005లో డబ్ల్యూడబ్ల్యూఈ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కించుకున్నారు. 1984లో మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో ది ఐరన్ షేక్‌ను ఓడించడం ద్వారా హుగన్ తన మొదటి డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకున్నాడు. ఈ విజయంతో హాల్క్‌మానియా ప్రారంభమైంది. రెజ్లింగ్‌తో పాటు హోగన్ పలు సినిమాల్లో నటించారు. నో హోల్డ్స్ బారెడ్, సబర్బన్ కమాండో, మిస్టర్ నాన్నీ వంటి సినిమాల్లో నటించారు. టీవీ షోలలోనూ పాల్గొన్నాడు. హాల్క్‌కు ఇండియాలోనూ చాలా మంది ఫ్యాన్స్ ఉన్నారు. హాల్క్ మరణవార్తను డబ్ల్యూడబ్ల్యూఈ ధ్రువీకరించింది. డబ్ల్యూడబ్ల్యూఈ హాల్ ఆఫ్ ఫేమ్‌లో ఒకడైన లెజెండరీ రెజ్లర్‌ను కోల్పోయామని సంతాపం తెలియజేస్తూ ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది.

## కేంద్రమంత్రి బండి సంజయ్, మంత్రి ఉత్తమ్‌లకు నాన్‌బెయిలబుల్ వారంట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 24:** కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు నాన్‌బెయిలబుల్ వారంట్ జారీ చేసింది. హుజూరాబాద్ ఎన్నికల ప్రచారానికి సంబంధించి నమోదైన కేసులో కోర్టు ఎదుట హాజరు కావాలని ఎన్నిసార్లు నోటీసులు పంపినా బండి సంజయ్ హాజరు కాకపోవడంతో కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు ఉన్నందున వ్యక్తిగత హాజరుకు మరికొంత సమయం కావాలని కోరుతూ బండి సంజయ్ న్యాయవాది రీకాల్ పిటిషన్ దాఖలు చేయడంతో పాటు ఈ నెల 30వ తేదీన హాజరైయ్యేందుకు అనుమతి కోరనున్నారు. మరోక కేసులో రాష్ట్ర మంత్రికి సైతం నాన్‌బెయిలబుల్ వారెంట్ జారి అయింది. రాష్ట్ర పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై ఎన్నికల సందర్భంగా నేరేడుచర్ల పోలీస్ స్టేషన్లలో కేసు నమోదైంది.

ఈ కేసు విచారణకు మంత్రి ఉత్తమ్ గైర్హాజరు కావడంతో నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. కాగా, ఇప్పటికే ఈ కేసును కొట్టివేయాలంటూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు.

## ప్రియాంకగాంధీతో సిఎం రేవంత్‌రెడ్డి భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూలై24:** రెండు రోజుల పర్యటనలో భాగంగా ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అగ్రనాయకురాలు, ఎంపీ ప్రియాంక గాంధీతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణాలో చేపట్టిన కులగణన సర్వే సంబంధించిన వివరాలను సీఎం రేవంత్ రెడ్డి ప్రియాంకకు వివరించారు. ఎన్నికల్లో, విద్య, ఉద్యోగాల్లో ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆమె అభినందించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్దత కల్పించేందుకు తాము అండగా ఉంటామని ప్రియాంక హామీ ఇచ్చారు.

## బిసిల విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను 50 శాతానికి పెంచాలి

### కేంద్ర మంత్రి హార్దీప్‌సింగ్‌కు ఎంపి ఆర్.కృష్ణయ్య వినతి

**హైదరాబాద్,జూలై 24,ప్రభాతవార్త:** బిసిల విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను 25 శాతం నుంచి 50 శాతం పెంచాలి అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య అన్నారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో ఎంపీ లు బీద మస్తాన్ రావు, పాక సత్యనారాయణ, పుట్ట మహేష్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తదితరులతో కలిసి కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హార్దీప్ సింగ్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ పార్లమెంట్‌లో బిసి బిల్లు పెట్టి అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికలలో 50 శాతం రిజర్వేషన్లు పెట్టాలన్నారు. త్వరలో జరుపబోయే జనాభా గణనలో కులాల వారి లెక్కలు తీయాలని బి సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని అందుకు రాజ్యాంగాన్ని సవరించాలన్నారు. అలాగే బి.సిల విద్య ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే బి.సి లకు పారిశ్రామిక పాలసీ లో 50 శాతం కోటా ఇవ్వాలన్నారు. కేంద్రం లో బి.సి లకు ప్రతేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసి 2 లక్షల కోట్లతో ప్రతేక అభివృద్ధి పథకం ప్రకటించాల న్నారు. అలాగే హై కోర్టు సుప్రీంకోర్టు జడ్జిల నియమాకంలో రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు దుర్గా నరేశ్, ఢిల్లీ ఇన్‌చీర్జి కర్రి వేణుమాధవ్, నందగోపాల్, మహిళా విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్ శారద తదితరులు పాల్గొన్నారు.



కేంద్రమంత్రి హార్దీప్‌సింగ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జకృష్ణ, మస్తాన్‌రావు, సత్యనారాయణ తదితరులు

## ఆగస్టు 2న రైతులకు పిఎం కిసాన్

### 20వ విడత నిధుల విడుదల

**హైదరాబాద్, జూలై 24, ప్రభాతవార్త:** ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం కింద అగస్టు 2వ తేదీన అన్నదాతల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమకానుంది. ఈ మేరకు దీనికి సంబంధించి 20వ విడత సహాయ నిధుల విడుదల తేదీ దాదాపు ఖరారైంది. దేశంలోని రైతులకు అందించే పీఎం కిసాన్ యోజన ఆగస్టు 2న అన్నదాతల అకౌంట్లో జమ కానున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వారణాసి పర్యటన ఆగస్టు 2న ఉండగా అదే రోజు అక్కడ జరిగే బహిరంగ సభలో ఈ నిధులను విడుదల చేయనున్నట్టు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కాగా గతంలో కూడా ప్రధాని వారణాసి పర్యటనలో ఉన్నపుడే 17వ విడత నిధులు విడుదల చేసారు. కాగా కేంద్ర ప్రభుత్వం రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. 2019 ఫిబ్రవరిలో ఈ పథకాన్ని అమలులోకి తీసుకొచ్చింది. దీని ద్వారా రైతులకు పంట సాయంగా ఎకరానికి సంవత్సరానికి 6 వేల రూపాయలు అందిస్తోంది. ఇలా ప్రతి సంవత్సరం 2 వేల రూపాయల చొప్పున మూడు దఫాలుగా నేరుగా రైతుల అకౌంట్స్‌లో జమ చేస్తూ వస్తోంది. తొలి విడతగా ఏప్రిల్–జులై, రెండో విడతగా ఆగస్టు–నవంబర్, మూడో విడతగా డిసెంబర్ –మార్చిలో రూ.2 వేల చొప్పున కేంద్ర సర్కార్ ఈ ఆర్థిక సాయాన్ని అందిస్తోంది.

# తెర

# ఏదీ శాశ్వతం కాదు



తాజాగా రష్మీ పంచుకున్న ఓ పోస్ట్ అభిమానులకు షాక్ ఇచ్చింది. మళ్లీ కలుద్దాం అంటూ ఆమె ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు. అయితే ఆమె ఇలా ఎందుకు పోస్ట్ పెట్టిందని అంతా ఆశ్చర్యపోయారు. రష్మీ గౌతమ్ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. బుల్లితెరపై ట్రెండీ యాంకర్‌గా, అప్పుడప్పుడు సినిమాల్లో కథానాయికగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తను చెప్పాలనుకున్న విషయాన్ని సోషల్ మీడియా వేదికగా సూటిగా చెబుతుంటారు. నెగటివ్ కామెంట్స్ చేసే వాళ్లపై ఆమె మాటలు కాస్త ఘాటుగానే ఉంటాయి. అలాగే హాట్‌హాట్ లుక్స్‌తో ఎంటర్‌టైన్ చేయడంలోనే ముందుంటారు. తాజాగా ఆమె పంచుకున్న ఓ పోస్ట్ అభిమానులకు షాక్ ఇచ్చింది. ఏదీ శాశ్వతం కాదు. ఈ కాలం కూడా గడిచిపోతుంది. మళ్లీ కలుద్దాం అంటూ ఆమె ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు. అయితే ఆమె ఇలా ఎందుకు పోస్ట్ పెట్టిందని అంతా ఆశ్చర్యపోయారు. ఆ పోస్ట్‌లోనే అసలు విషయం ఏంటో కూడా చెప్పారు. ఇక సోషల్ మీడియాకు గుడ్ బై అనేది రష్మీ పోస్ట్ సారాంశం. హాలో ఆల్.. ఒక నెల రోజులపాటు డిజిటల్ డీటాక్స్ పాటించాలనుకుంటున్నా. వ్యక్తిగతంగా, వృత్తిపరంగా కొన్ని ఒడుదొడుకులను ఎదుర్కొం టున్నాను. సోషల్ మీడియా కూడా అందులో ఓ భాగమే. కొన్నిసార్లు అది మన ఆలోచనలను చాలా ప్రభావితం చేస్తుంది. ఒక విషయంలో మాత్రం మాట ఇస్తున్నా. కచ్చితంగా నేను డబుల్ ఎనర్జీతో తిరిగి వస్తా. నా శక్తియుక్తులను రీ బిల్ట్ చేసుకోవాలి. ఎలాంటి ప్రేరణ, డిజిటల్ ఎఫెక్ట్ లేకుండా నాకు నేను ఆత్మ పరిశీలన చేసుకోవాలి. నేనెప్పుడూ బలంగా ఉంటానని అందరూ అనుకుంటారు. కానీ కొన్నిసార్లు నేనూ కుంగిపో తున్నాను. కొన్ని విషయాలను సరిదిద్దుకోవడానికి ఇది నాకు సరైన సమయం. అభిమానులకు అందుబాటులో ఉన్నా లేకపోయినా మీ ప్రేమ మద్దతు కంటిన్యూ అవుతుందని ఆశిస్తున్నాన్న అని అన్నారు. ఉన్నటుండి రష్మీ ఇలాంటి పోస్ట్ పెట్టడంతో ఫ్యాన్స్ తనకు ఏమైందంటూ ఆరాలు తీస్తున్నారు.



# సలసల మరిగే...

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన తాజా చిత్రం హరిహర వీరమలు గురువారం జనం ముందుకొచ్చింది. ఎంపిక చేసిన కొన్ని థియేటర్లలో ఒక రోజు ముందే రాత్రి ప్రీమియర్ షోస్‌నూ వేశారు. ప్రముఖ నిర్మాత ఎ.ఎం. రత్నం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన హరిహర వీరమల్లు సినిమాను క్రిష్‌తో పాటు జ్యోతికృష్ణ డైరెక్ట్ చేశారు. 17వ శతాబ్దానికి చెందిన కథతో రూపుదిద్దున్న హరిహర వీరమల్లుఖికు ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందించారు. ఈ సినిమా నుండి తాజాగా మరో లిరికల్ వీడియో విడుదలైంది. సలసల మరిగే.. అంటూ సాగే ఈ అర్థవంతమైన పాటను ప్రముఖ గీత రచయిత చైతన్య ప్రసాద్ రాశారు. దీనిని సాయిచరణ్ భాస్కరుని పాడారు. అతనితో పాటు లోకేశ్వర్ ఈదర, హౌమత్ మహమ్మద్, పీవీఎన్ఎస్ రోహిత్ తదితరులు గానం చేశారు. నప్రపంచ వ్యాప్తంగా విడుదలైన ఈ సినిమాలో నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటించింది. రూ. 250 కోట్లకు పైగా బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా ప్రీమియర్ షోకు కలెక్షన్ల వర్షం కురిసి నట్లుగా తెలుస్తోంది. ప్రీమియర్స్ ద్వారానే సినిమా రూ. 11 కోట్లకు పైగా కలెక్ట్ చేసినట్లుగా చెబుతున్నారు. ఇందులో తెలుగు రాష్ట్రాల్లో రూ. 7 కోట్లు, ఓవర్సీస్‌లో రూ. 4 కోట్లు రాబట్టి నట్లుగా సమాచారం. అలాగే సినిమా మొదటి రోజే రూ. 80 కోట్లకు పైగా కలెక్ట్ చేస్తుందని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## కొల్లాగొట్టినాదిరో..



వారం రోజులుగా సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా నిధి అగర్వాల్ హవానే కనిపిస్తుంది. పవన్ కళ్యాణ్ సరసన నిధి నటించిన హరిహర వీరమల్లు చిత్రం రిలీజ్ అయింది. దీంతో వారం రోజులుగా ప్రమోషన్స్‌లో ఫుల్ బిజీగా ఉంది నిధి. ఇక ఎక్కడికి వెళ్లినా సరే

పాపలకే పాప నిధి పాప అంటూ హీరోయిన్‌ని ఆకాశానికి ఎత్తేస్తున్నారు ఫ్యాన్స్. పవన్ కళ్యాణ్ కూడా వీరమల్లు ప్రమోషన్స్‌ని నిధి తన భుజాలపై మోసిందంటూ కొనియాడారు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, డార్లింగ్ ప్రభాస్ ఇలా ఇద్దరూ బడా స్టార్లతో వర్క్ చేసే అవకాశం కొట్టేసి శభాష్ అనిపించుకుంది ఈ ముద్దుగుమ్మ.

కెరీర్‌లోనే అతి పెద్ద ప్రాజెక్టులైన ఈ రెండింటిలో హరిహర వీరమల్లు చిత్రంలో కొల్లగొట్టినాదిరో అంటూ కుర్రాళ్ల గుండెల్ని నిజంగానే కొల్లగొట్టేసింది నిధి. సినిమాలోనే కాకుండా బయట సోషల్ మీడియాలో కూడా ఫ్యాన్స్‌కి ట్రీట్ ఇస్తుంది. తాజాగా ఆమె తన ఫొటోలను షేర్ చేసింది.



# వార్ 2లో.. ఆల్ఫా బ్యూటీస్

బాలీవుడ్ స్పై యాక్షన్ మూవీస్‌లో మరో సంచలనం సృష్టించేందుకు సిద్ధమవుతోంది వార్ 2 మూవీ. యశ్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌లో భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ , హృతిక్ రోషన్ కలిసి తెరపై సందడి చేయనున్నారు. ఈ సినిమా కోసం అభిమానులు ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. ఇది ఆగస్టు 14న థియేటర్లలో సందడి చేయడానికి సిద్ధంగా ఉంది. ఇద్దరు సూపర్‌స్టార్ల కలయిక కారణంగా ఈ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి.

మరోవైపు జూలై 26న మేకర్స్ ట్రైలర్ రిలీజ్ చేసేందుకు రెడీ అవుతున్నారు. టీజర్‌లో కనిపించిన భారీ యాక్షన్ సన్నివేశాలు, ఎన్టీఆర్ హృతిక్ మధ్య జరిగే హైఇంటెన్సిటీ ఫైట్ సీక్వెన్స్ ప్రేక్షకులను థ్రిల్‌కు గురిచేశాయి. ఇదిలా ఉంటే ఆస్ట్రేలియా మెల్ బర్న్‌లో యంగ్ టైగర్ ఫ్యాన్స్ ఆకాశంలో స్మోక్‌తో ఎన్టీఆర్ వార్ 2 అంటూ రాసిన వీడియోలు వైరల్ అవుతున్నాయి.

ఇదే సమయంలో మేకర్స్ మరో భారీ సర్‌ప్రైజ్‌ను ప్లాన్ చేస్తున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది.

వార్ 2 సినిమా క్లైమాక్స్ తర్వాత, యశ్ రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న మరో స్పై యాక్షన్ చిత్రం ఆల్ఫాకు సంబంధించిన ఒక సీక్వెన్స్‌ను స్క్రీన్‌పై చూపించనున్నారట. అలియా, శార్వరీ వార్ 2 చివరిలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఈ సీక్వెన్స్ ప్రేక్షకులను థియేటర్లలో కేరింతలు కొట్టించేలా ఉంటుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఆల్ఫా మూవీ రెండు వేర్వేరు నేపథ్యాల నుంచి వచ్చిన యువతులు స్పై ఏజెంట్లుగా చేసే హై ఒల్టేజ్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది.

ఈ చిత్రం డిసెంబర్‌లో విడుదల కానుంది. అంతకు ముందు, వార్ 2లో షారుఖ్ ఖాన్ గెస్ట్ రోల్‌లో కనిపిస్తాడని లేదా క్లైమాక్స్ తర్వాత ఓ సీక్వెన్స్ ఉంటుందని ఊహాగానాలు వచ్చాయి. అయితే... ఇప్పుడు ఆల్ఫా సీక్వెన్స్‌తో సినిమాకు శుభం కార్డు పడుతుందని అంటున్నారు. వార్ 2 తర్వాత స్పై యూనివర్స్ నుండి వచ్చేది ఆల్ఫానే అని యశ్ రాజ్ ఫిలిమ్స్ ఈ సీన్స్‌తో చెప్పకనే చెబుతునట్టు అవుతోంది. వార్ 2 చూసి థియేటర్ల నుండి బైటకు వెళ్ళే ప్రేక్షకుల మనసుల్లో ఆల్ఫాను చూడాలనే కోరిక కలిగేలా యశ్ రాజ్ ఫిలిమ్స్ ఈ నిర్ణయం తీసుకుందని అంటున్నారు.



# పొలిటికల్ గ్రౌండ్ వర్క్

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ కూడా రాజకీయాల వైపు ఆసక్తి కనబరుస్తున్నాడని సమాచారం. అభిమానులందరినీ క్రోడీకరించి, వారిని పార్టీ కార్యకర్తలుగా మార్చే వ్యూహానికి ధనుష్ శ్రీకారం చుట్టబోతున్నట్టు తెలుస్తోంది. నిజానికి తమిళనాడు రాజకీయాలు, సినిమా రంగం చెట్టపట్టాలేసుకునే కొన్ని దశాబ్దాలుగా తిరుగుతున్నాయి. కరుణానిధి, ఎంజీఆర్, జయలలిత వీళ్లంతా ముఖ్యమంత్రులు కాకముందు... రాజకీయాలలో క్రియాశీలక పాత్ర పోషించిన వారే. అలానే ఎంజీఆర్ భార్య జానకీ రామచంద్రన్ తో పాటు శివాజీ గణేశన్, టి. రాజేందర్, శరత్ కుమార్ వంటి వారు కొన్ని పార్టీలలో ప్రధాన పదవులను నిర్వహించారు. మరి కొందరు సొంత పార్టీలు పెట్టారు. చిత్రం ఏమంటే... రజనీకాంత్ వంటి సూపర్ స్టార్ పాలిటిక్స్‌లోకి అడుగుపెడతానని, సొంత పార్టీ పెడతానని చెప్పి... చివరకు యూ టర్న్ తీసుకున్నారు. అందరితో మంచిగా ఉండాలనుకునే రజనీకాంత్ లాంటి వారికి పాలిటిక్స్ పడవని సన్నిహితులు చెబుతుంటారు. అయితే... రజనీకాంత్ సమకాలీనుడైన కమల్ హాసన్ మాత్రం సొంత పార్టీ పెట్టాలనే కోరికను తీర్చుకున్నారు. రాజకీయ నేతగా గొప్ప విజయాలను అందుకోలేకపోయినా, ఎదురు దెబ్బలు తగిలినా... ఇప్పటికీ పార్టీని నిర్వహిస్తున్నారు. ఆ మధ్య జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో తమిళనాడులో అధికార డీఎంకెకు మద్దత్తు పలికాడు కమల్ హాసన్. దాంతో తాజాగా ఆయనను డీఎంకే పార్టీ రాజ్యసభకు పంపింది. ఇదే సమయంలో స్టార్ హీరో విజయ్ పార్టీ పెట్టడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. జయలలిత మరణానంతరం అన్నా డీఎంకే చీలిపోవడంతో దానిని భర్తీ చేసే క్రమంలో తాను పార్టీ పెట్టి లబ్ధి పొందొచ్చని విజయ్ భావించి ఉండొచ్చు. ఈసారి జరగబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందని విజయ్ చెబుతున్నారు. అందుకే పొంగల్ కానుకగా రాబోతున్న జన నాయగన్ తర్వాత ఇక సినిమాలు చేయనని స్పష్టం చేశారు.

ఈ నేపథ్యంలో రజనీకాంత్ చేయని పనిని ఆయన మాజీ అల్లుడు ధనుష్ చేయబోతున్నాడని సమాచారం. ధనుష్‌కు సైతం రాజకీయాల మీద ఆసక్తి ఉందని, అందుకే అతను అందుకోసం ఇప్పటి నుండే రంగాన్ని సిద్ధం చేసుకుంటున్నాడని వార్తలు వస్తున్నాయి. సహజంగా హీరోలు తమ అభిమానులను తరచూ కలుసుకోవడం, వారి అవసరాలను తీర్చడం అనేది చేస్తూనే ఉంటారు. అయితే కొందరు మాత్రం ప్రత్యేకంగా వారికోసం కొంత సమయం కేటాయించి ఫోటోలు దిగుతుంటారు. తమ సినిమాల విడుదల సమయంలో ఇలా హీరోలు చేయడం పరిపాటి. కానీ ధనుష్ మాత్రం ఇందుకు భిన్నంగా ఇకపై 25 వారాల పాటు ప్రతి ఆదివారం అభిమానులను కలుసుకుని, వారితో చర్చించి, ఫోటోలు దిగాలనే నిర్ణయం తీసుకున్నాడట. ప్రతి వారం 500 మంది అభిమానులతో ఆయన ఇంటరాక్ట్ కాబోతున్నాడట. ఈ కార్యక్రమానికి గత ఆదివారమే శ్రీకారం చుట్టాల్సి ఉన్నా... ధనుష్ కాలికి దెబ్బ తగలడంతో దానిని 27వ తేదీకి వాయిదా వేశాడట. కేవలం సినిమాలు, వాటి ప్రమోషన్స్ కోసమైతే... ఇంత సమయం వెచ్చించాల్సిన పనిలేదని, ధనుష్ రాబోయే రోజుల్లో రాజకీయాల్లోకి అడుగు పెట్టాలనే ఆలోచనతోనే ఇంత గ్రౌండ్ వర్క్ చేస్తున్నాడని అంటున్నారు. గతంలోనూ కొందరు స్టార్ హీరోలు ఫోటోల పేరుతో అభిమానులకు ఎర వేసి ఆ తర్వాత వారిని పార్టీ కార్యకర్తలుగా మార్చేసిన వైనాలు తమిళనాట ఉన్నాయి.



## కింగ్డమ్‌కీ హైక్

విజయ్ దేవరకొండ హీరోగా నటించిన లేటెస్ట్ మూవీ కింగ్డమ్. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఈ పాన్ ఇండియా చిత్రం తెరకెక్కుతోంది. మరో వారం రోజుల్లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. జులై 31న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా ఈ నెల 26న ట్రైలర్‌ను రిలీజ్ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఇప్పుడు ఈ సినిమాకి ఏపీ సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. టికెట్ రేట్లు పెంచుకోడానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. కింగ్డమ్ సినిమాకి టికెట్ రేట్స్ హైక్ కోరుతూ చిత్ర బృందం ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. దీనికి గవర్నమెంట్ సానుకూలంగా స్పందించింది. సినిమా విడుదలైన రోజు నుంచి 10 రోజుల పాటు ధరల పెంపునకు పర్మిషన్ ఇచ్చింది. ఈ మేరకు జీవో జారీ చేసింది. జీఎస్టీతో కలిపి సింగిల్ స్క్రీన్స్‌లో రూ.50, మల్టీప్లెక్స్‌ల్లో రూ.75 పెంచుకునేందుకు ప్రభుత్వం వీలు కల్పించింది. దీంతో భారీ ఓపెనింగ్స్ తెచ్చుకోడానికి ఈ సినిమాకి అవకాశం కలుగుతుంది.

## సైకో కిల్లర్..

ఎప్పటిలాగే ఈ శుక్రవారం (జూలై 25) కూడా పలు కొత్త సినిమాలు, వెబ్ సిరీస్ లు ఓటీటీలోకి రానున్నాయి. తెలుగుతో పాటు ఇతర భాషలకు చెందిన సినిమాలు, సిరీస్‌లు స్ట్రీమింగ్‌కు రానున్నాయి. ఇందులో ఇటీవలే థియేటర్లలో రిలీజై సూపర్ హిట్‌గా నిలిచిన ఓ సినిమా కూడా ఉంది. క్రైమ్ థ్రిల్లర్ అండ్ ఇన్వెస్టిగేషన్ కాన్సెప్ట్‌తో వచ్చిన ఈ చిత్రం



ఆడియెన్స్‌ను బాగా మెప్పించింది. బాక్సాఫీస్ వద్ద ఓ మోస్తరు వసూళ్లు రాబట్టింది. అయితే నెల తిరక్కుండానే ఓటీటీలోకి రానుంది. సినిమా కథ విషయానికి వస్తే.. ఇదొక డిఫరెంట్ క్రైమ్ థ్రిల్లర్. అమ్మాయిల హత్యల చుట్టూ తిరిగే స్టోరీ. రమ్య అనే అమ్మాయి హత్యతో ఈ సినిమా కథ మొదలవుతుంది. గుర్తు తెలియని వ్యక్తి ఓ మండే స్వభావం ఉన్న డ్రగ్‌ను ఆమెలోకి ఇంజెక్ట్ చేసి చంపేస్తారు. ఈ కేసును ఛేదించేందుకు పోలీస్ ఆఫీసర్ ధృవ రంగంలోకి దిగుతాడు. పదేళ్ల క్రితం అతని కూతురు కూడా ఇలాగే హత్యకు గురవడంతో ధ్రువ ఈ కేసును పర్సనల్‌గా తీసుకుని ఇన్వెస్టిగేట్ చేస్తారు. అలా తనకు దొరికిన ఆధారాలతో అరవింద్ అనే యువకుడిని అదుపులోకి తీసుకుంటాడు. అతడిని విచారిస్తే.. ఎవరూ ఊహించలేని కొన్ని సంచలన నిజాలు బయటకు వస్తాయి. అరవింద్ వింత ప్రవర్తన, అతీంద్రియ శక్తికి ధృవ ఆశ్చర్యపోతాడు. మరి అరవింద్ కు, అమ్మాయిల హత్యలకు సంబంధమేంటి? ధృవ కూతురిని చంపింది ఎవరు? అసలు కిల్లర్ మోటివ్ ఏంటి? ధ్రువ ఈ కేసును సాల్వ్ చేయగలిగాడా? కిల్లర్‌ను పట్టుకున్నాడా? అనే ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవాలంటే ఈ సినిమా చూడాల్సిందే. ఈ క్రైమ్ థ్రిల్లర్ పేరు మార్గన్. బిక్షగాడు ఫేమ్ విజయ్ ఆంటోని హీరోగా నటించాడు. అజయ్ దిశాన్, బ్రిగిడా, దీప్శిఖ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు.

## అతడిని క్షమించకూడదు..

బాలీవుడ్ హీరోయిన్ జాన్వీ కపూర్ తాజాగా జాన్వీ కపూర్ చేసిన ఓ పోస్ట్ నెట్టింట వైరలవుతోంది. మహారాష్ట్రలోని ఠాణె జిల్లాలోని ఓ ఆసుపత్రిలో రిసెప్షనిస్ట్‌పై ఓ వ్యక్తి అమానుషంగా దాడి చేసిన ఘటనపై ఆమె రియాక్ట్ అయ్యింది. అతడి తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. అతడిని ఎప్పటికీ క్షమించకూడదని రాసుకొచ్చారు. ఇలాంటి ప్రవర్తన సరైందని ఎవరైనా ఎందుకు అనుకుంటారు ? ఎదుటివాళ్లపై చేయి ఎలా వేస్తారు. ? మానవత్వం లేకుండా చేసిన ఈ పనిపై కనీసం పశ్చాత్తాపం, అపరాధభావం ఉండదా.. ? ఇలాంటి మీ ప్రవర్తన చూసి ఎవరైనా మీతో కలిసి ఉండాలనుకుంటారా..? ఇది చాలా అవమానకర చర్య. ఇలాంటి ప్రవర్తనను మనం ఎప్పటికీ క్షమించకూడదు. ఈ ఘటనను ఖండించి అతడిని శిక్షి ంచకపోతే అది మనకే సిగ్గుచేటు. ఈ వ్యక్తి జైలుకు వెళ్లాల్సిందే " అంటూ తన ఇన్ స్టా స్టోరీలో పోస్ట్ చేశారు.



ఈ క్రమంలో ఘటన విషయానికి వస్తే.. ఠాణె జిల్లాలోని శ్రీబాల చికిత్సాలయంలో సోమవారం ఓ వ్యక్తి తన బిడ్డను డాక్టర్ కు చూపించేందుకు క్యూ పద్ధతి పాటించకుండా ముందుకు వెళ్లేందుకు ట్రై చేశాడు. దీంతో రిసెప్షనిస్ట్ అతడిని అడ్డుకుని అపాయింట్ మెంట్ లేకపోతే లైనులో రావాలని సూచించారు. దీంతో ఆగ్రహించిన ఆ వ్యక్తి ఆమెపై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఆమెను కాలితో తన్నడమే కాకుండా జుట్టు పట్టుకొని నేలపై ఈడ్చుకుంటూ వెళ్లాడు. ఇందుకు సంబంధించిన విజువల్స్ సిసి కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిని మంగళవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. జాన్వీ కపూర్ ఇప్పుడు తెలుగులో బ్యాక్ టూ బ్యాక్ సినిమాల్లో నటిస్తున్న సంగతి తెలిసిందే. డైరెక్టర్ కొరటాల శివ, జూనియర్ ఎన్టీఆర్ కాంబోలో వచ్చిన దేవర సినిమాతో టాలీవుడ్ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఫస్ట్ మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న జాన్వీ.. ఇప్పుడు రామ్ చరణ్ జోడిగా పెద్ది చిత్రంలో నటిస్తుంది. కొన్ని నెలలుగా ఈ మూవీ షూటింగ్ వేగంగా జరుగుతుంది.

## రావణాసురుడిగా టాలీవుడ్ విలన్

రామాయణంపై ప్రస్తుతం పలు సినిమాలు, వెబ్ సిరీస్‌లు తెరకెక్కుతున్నాయి. అందులో ప్రధానంగా చెప్పుకోవాల్సింది రణ్ బీర్ కపూర్, సాయి పల్లవిల రామాయణ్. ఇందులో కన్నడ స్టార్ యశ్ రావణుడిగా కనిపించనున్నాడు. అయితే ఇదే రామయాణాన్ని ఆధారంగా చేసుకుని మరికొన్ని భాషల్లో సినిమాలు, వెబ్ సిరీస్ లు తెరకెక్కనున్నాయని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో టాలీవుడ్ ప్రముఖ నటుడు రావణాసురుడి గెటప్‌లో కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా పలు తెలుగు సినిమాల్లో నటించి మెప్పించారాయన. అలాగే హిందీ సినిమాల్లోనూ మెరిశారు. తెలుగులో అయితే పవన్ కళ్యాణ్, బాలకృష్ణ, రవితేజ, కళ్యాణ్ రామ్, నాగ చైతన్య తదితర హీరోల సినిమాల్లో నటించాడు. కేవలం నటుడిగానే కాకుండా నిర్మాతగానూ మెరిశాడు. తమిళం, కన్నడ, మరాఠీ భాషల్లోనూ నటించి అక్కడి ప్రేక్షకుల అభిమానాన్ని సొంతం చేసుకున్నాడు. ఇప్పుడు ఏకంగా రావణాసురుడిగా కనిపించి ఫ్యాన్స్‌కు షాక్ ఇచ్చారు. ఆయన మరెవరో కాదు అశుతోష్ రాణా. మాస్ మహారాజ్ హీరోగా చేసిన వెంకీ సినిమాలో విలన్ రోల్‌తో ఆయన బాగా ఫేమస్ అయ్యారు. అంతకు ముందు పవన్ కళ్యాణ్ నటించిన బంగారం సినిమాలో భూమారెడ్డి పాత్రలోనూ అదరగొట్టారు.



## వచ్చే యేడాది మైఖేల్ బయోపిక్

గ్లోబల్ ఆడియన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మూవీ ఖిమైఖేల్. పాప్ మహారాజు మైఖేల్ జాక్సన్ జీవిత కథను వెండితెరపై ఆవిష్కరించనున్న ఈ భారీ చిత్రం 2026 ఏప్రిల్ 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆంటోయిన్ ఫుక్వా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా అనేక విశేషాల సమహారంగా రూపొందుతూ ఆసక్తిని రేపుతోంది. మైఖేల్ జాక్సన్ మేనల్లుడు జాఫర్ జాక్సన్ తన మామ పాత్రలో నటిస్తుండటం ఈ సినిమాకు హైలెట్ గా నిలవనుంది. నటులు కోల్మన్ డొమింగో, నియా లాంగ్ మైఖేల్ తల్లిదండ్రులుజో, కాథరిన్ జాక్సన్ పాత్రల్లో కనిపించబోతున్నారు. మైల్స్ టెల్లర్.. జాన్ బ్రాంకాగా, లారెంజ్ టేట్ బెర్రీ... గోర్డీగా, లారా హారియర్... సుజాన్ డి పాస్‌గా, కాట్ గ్రాహం... డయానా రాస్‌గా, జెస్సికా సులా.. టోయా జాక్సన్‌గా కనిపించబోతుండడం ఈ సినిమాకు అడ్వాంటేజ్‌గా మారుతోంది.

మైఖేల్ జాక్సన్ బాల్యం నుంచి ప్రపంచ స్థాయి పాప్ సింగర్‌గా ఎదిగిన ప్రయాణాన్ని మైఖేల్ మూవీలో చూపించబోతున్నారు.

# రైల్వేలో ఆమె పాత్ర కీలకం !

**రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్)... ఇప్పటి వరకూ ఈ మగవారిదే అధిపత్యం..** ఆ చరిత్రను తిరగరాశారు సీనియర్ ఐపిఎస్ అధికారిణి సోనాలీ మిశ్రా. తాజాగా ఆర్‌పిఎఫ్‌నకు డైరెక్టర్ జనరల్‌గా నియమితులై, ఘనత సాధించిన తొలి మహిళగానూ నిలిచారు. ప్రయాణికుల భద్రత, రైల్వే ఆస్తులను చట్టవిరుద్ధంగా స్వాధీనం చేసుకున్న నేరస్థులను విచారించడం, అరెస్టు చేయటం... ఇలా కీలక బాధ్యతలెన్నో అందులో ఉంటాయి. మధ్యప్రదేశ్ పోలీస్ స్పెషల్ డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తూ సోనాలి... 1993 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందినవారు. తన మూడు దశాబ్దాల అనుభవంలో ఎన్నో కీలక నాయకత్వ స్థానాల్లో పనిచేశారు. 2021లో పంజాబ్‌లోని భారత్ పాకిస్థాన్ సరిహద్దుల్లో... సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) ఏర్పాటుకు నాయకత్వం వహించారు. ఈ బాధ్యత స్వీకరించిన మొదటి మహిళా కమాండర్ కూడా బిఎస్ఎఫ్ నిఘా నాయకత్వం వహించడంతోపాటు, ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా ఉంటుంది, కశ్మీర్ లోయలో ఫోర్స్ ఏర్పాటుకీ నాయకత్వ బాధ్యతలు నిర్వహిస్తున్నారు,




ప్రెసిడెంట్స్ పోలీస్ మెడల్ ఫర్ డిస్టిన్‌గ్విష్‌డ్ సర్వీస్ (పీపీఎంఎస్), పోలీస్ మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్ (పీఎమ్ఎస్ఎమ్ఎస్) మెడళ్లూ అందుకుంటారు. జులై 31న పదవీ విరమణ చేయనున్న మనోజ్ యాదవ్ ఈమె 2026 అక్టోబర్ 31 వరకు ఈ పదవిలో కొనసాగనుంది.

# సకల శుభప్రదం శ్రావణం

**పరమ పవిత్రం శ్రావణ మాసం. శ్రావణ మాసము తెలుగు సంవత్సరంలో ఐదవ నెల పౌర్ణమి రోజున శ్రవణ నక్షత్రము (అనగా చంద్రుడు శ్రవణ నక్షత్రంతో కలిసిన రోజు) కావున ఆ నెల శ్రావణము. వర్షఋతువు మూలంగా విరివిగా వర్షాలు పడతాయి.**

స్థితికారుడు అయిన శ్రీమహావిష్ణువుకు, ఆయన దేవేరి శ్రీమహాలక్ష్మికి అత్యంత ప్రీతికరమైనది ఈ శ్రావణమాసం. ఈనెలలో వ్రతములు నోములు పూజలు చేయడం వలన విశేష ఫలితాలను సకల సౌభాగ్యాలను ప్రసాదిస్తుందని అందుకనే ఈ శ్రావణ మాసం ఆధ్యాత్మిక మాసం అని అంటారు. అంతేకాదు శ్రామణమాసం మహిళలకు ఎంతో పవిత్రమైన మాసం. కనుక ఈ నెలలో చేసే పూజలు అత్యంత విశిష్టమైనవి అని హిందువుల నమ్మకం. శివ కేశవులను అత్యంత భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. శ్రావణ సోమవారం, శ్రావణ మంగళవారం, శ్రావణ శుక్ర, శని వారం ఇలా నెలలో ప్రతి రోజూ విశిష్టత గలవే. ఈ నెలలో చేసే పూజలు అనంత పుణ్యములను ఇస్తాయని నమ్మకం. . ఈ నెలలో వ్రతములు, నోములు పూజలు ఆచారించడం వలన విశేష ఫలితాలను, సకల సౌభాగ్యాలను ప్రసాదిస్తుందని అందుకనే మాసం అని అంటారు. అంతేకాదు శ్రావణ మాసం మహిళలకు ఎంతో పవిత్రమైన మాసం. ఎందుకంటే మహిళలు చేసే వ్రతాలలన్నింటిలో ఎక్కువ వ్రతాలు ఈ నెలలో ఉంటాయి. కనుక ఈ నెలను వ్రతాలమాసమని, సౌభాగ్యాన్ని ప్రసాదించే మాసమని శాస్త్ర వచనం. ఈమాసంలో చేసే దైవ కార్యాలకు ఎంతో శక్తి ఉంటుందని వేద పురాణలు చెబుతున్నాయి. గొప్ప పవిత్ర మాసం. అంతేకాకుండా విశిష్ట పండుగలు కూడా వస్తాయి. వాస్తవానికి 'శ్రావణ' మనే ఈ పేరులోనే వేదకాలమనే అర్థం ఉంది. శ్రవణం అంటే వినుట అని అర్థం. వేదం గ్రంథమువలె పఠనం చేసేది కాదు. విని నేర్వదగినది. కనుక వేదాన్ని వినిపించే వారు గురువు. విని నేర్చుకొని వారు శిష్యుడు. వేదాధ్యయనం చేసి వ్యక్తికి మోహం తొలగి బ్రహ్మ స్వరూపం అర్థమౌతుందని రామాయణం ఉవాచ. కనుక శ్రావణ మాసం వేదాధ్యయన సమయమని త్రేతాయుగంలోనే పేర్కొన్నారు. పురుషులతో పాటు స్త్రీలకూ వేదపఠనంతో సమానమైన లలితా సహ స్రనామాది స్తోత్ర పఠనాలు, నోములు, వ్రతాలు, మోహమును తొలగించి సౌభాగ్యము నిచ్చేవి. శ్రావణ మాసంలో ఆచరించాల్సిన వ్రతాలలో ప్రధానమైనవి మంగళగౌరీ వ్రతం. శ్రాణమాసంలో వచ్చే 4 మంగళ వారాలపాటు ఈ మంగళగౌరీ వ్రతం పెళ్ళయిన మహిళలు ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. ఈ వ్రతాన్ని ఆచరించడం వల్ల తమ కుటుంబం భోగభాగ్యాలతో తులతూగుతుందని పురాణాల్లో పేర్కొన్నారు. ముఖ్యంగా శ్రీకృష్ణుడు తన సోదరీ అయినా ద్రౌపదిని ఈ వ్రతం గురించి చెప్పినట్లు మహాభారతంలో కూడా ప్రస్తావన ఉంది. ఇక ఈ మాసంలో అత్యంత భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీదేవి వ్రతం అత్యంత ముఖ్యమైనది. శ్రావణ శుక్రవారం పూట మహిళలంతా భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీదేవి వ్రతం ఆచరిస్తారు. ముఖ్యంగా మహిళలు తమ చుట్టూ ఉన్న ముత్తైదువులను ఆహ్వానించి పేరంటం నిర్వహిస్తారు. అలాగే శ్రావణ మాసంలో నూతన గృహప్రవేశలు, వ్యాపార ప్రారంభం, వంటివి కూడా నిర్వహించడం ద్వారా ఆయా రంగాల్లో విజయం సాధించవచ్చు అని పండితులు చెబుతున్నారు.





**ముహూర్తాల తేదీలు ఇవే..**

ఈ నెలలో 26, 30, 31 తేదీలో ఆగస్టులో 1, 3,5,7,8,9,10,11, 12, 13, 14, 17 తేదీల్లో ముహూర్తాలున్నాయి. అలాగే, ఆగస్టు 21 నుంచి సెప్టెంబరు 21 వరకూ భాద్రపద మాసం. ఇది శున్యమాసం కావడంతో ముహూర్తాలు లేవు. ఆ తర్వాత సెప్టెంబరులో 23 నుంచి ప్రారంభమై 24, 26, 27, 28 తేదీల్లో.. అనంతరం అక్టోబరు, నవంబరు నెలల్లో కూడా ముహూర్తాలు రికార్డు స్థాయిలో ఉన్నాయి. ఈ మాసాల్లో ఏకంగా 13 రోజుల చొప్పున శుభ ముహూర్తాలు ఉండటం విశేషం. అక్టోబరులో 1, 2, 3, 4, 8, 10, 11, 12, 22 24,29, 30, 31 తేదీలు: నవంబరులో 1, 2, 7, 8, 12, 13, 15, 22, 23, 28, 27, 29, 30 తేదీల్లో శుభ ఘడియలున్నాయి. అనంతరం డిసెంబరు 8 నుంచి ఫిబ్రవరి ఆరో తేదీ వరకూ ఇంచుమించు రెండు నెలలపాటు ముహూర్తాలు లేవు.

# తేగలు తిందామా !



తేగంటి బిడ్డ అంటే తెగ కావాలన్నాడట అనేది సామెత. అందుకే పిల్లల్ని ఎప్పుడంటే అప్పుడు తేగలతో పోల్చకూడదు. ఇవి చలికాలంలోనే దొరుకుతాయి మరి. తెగలెంత కమ్మగా ఉంటాయో మాటల్లో చెప్పలేం.. తిని ఆనందించాలంటే! అయితే.. సమంగా కాలిపోయినవాటిని ఎంచుకోవాలి.

ఐరన్, ఒమేగా ఒమేగా ఫ్యాటీ యాసిడ్స్, క్యాల్షియం, పొటాషియం, పొటాషియం, మెగ్నీషియం, విస్తారంగా. తేగలు తినడం వల్ల రోగనిరోధక శక్తి. నోటిపూతకు విరుగుడుగా. జీర్ణప్రక్రియ జీర్ణప్రక్రియ. శరీరంలో చేరిన మలినాలు. ఎముకలు, దంతాలు దృఢంగా. రక్తంలో చక్కెర స్థాయి. రక్తహీనత సమస్య. గర్భిణులు, వృద్ధులకు ఇవెంతో. తెల్లరక్త మోకాళ్ల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది.

# డైనింగ్ టేబుల్‌పై అందంగా..

వంటంతా ఎంతో శ్రద్ధగా, రుచికరంగా వండుకుంటాం. మరి ఆ వంటకాలన్నింటినీ చూడచక్కగా సర్దుకుంటేనే కదా మనసుకీ తృప్తి. అందుకే ఇప్పుడు డైనింగ్ టేబుల్ కోసమే ప్రత్యేకించి రకరకాల వస్తువులు మార్కెట్లోకి వచ్చేశాయి. వాటిలోకొన్నే ఈ టేబుల్‌వేర్ స్పూన్ హోల్డర్లూ, స్టాండింగ్ గరిటెలూ, రైస్ కుకర్లు.. వంటివి. సాధారణంగా మనం వండడానికి ఉపయోగించిన కుకర్లను అట్టే టేబుల్ మీద ఉంచలేం. మళ్లీ వండిన ఆహార పదార్థాలను వేరే





గిన్నెలోకి తీసుకున్న పెట్టుకోవడం అదనపు పని. అలాకాకుండా ఈ కుకర్లయితే నేరుగా టేబుల్‌మీద పెట్టేసుకోవచ్చు. అలానే వడ్డించుకున్న గరిటెలనూ పెట్టుకునేందు వీలుగా స్పూన్ హోలనదర్లూ, స్టాండింగ్ గరిటెలూ అందుబాటులో ఉన్నాయి. స్టెయిన్‌లెస్ స్టీల్,



నాన్‌స్టిక్, గోల్డ్ కోటింగ్.. లాంటి అనేక రకాల మెటీరియళ్లతో తయారుచేసిన ఇవి, విభిననన రూపాల్లో లభిస్తున్నాయి. వీటివల్ల మనం తీనేటప్పుడు టేబుల్ మీద ఉన్న వస్తువులన్నీ క్రమపద్ధతిలో ఉండడమే కాకుండా, చూడ్డానికీ అందంగా, ఆకర్షణీయంగా అనిపిస్తాయి. అంతేకాదు, వీటిని మీ బంధువులూ, స్నేహితుల గృహప్రవేశం, పుట్టినరోజు, పండుగల వంటి ప్రత్యేక సందర్భాల్లో కానుక గానూ ఇవ్వొచ్చు. మీకూ నచ్చా యా మరి!

# గోరుమిటీలు..



**కావాల్సినవి :** మైదా-కప్పు, ఉప్మా రవ్వ-పావు కప్పు, ఉప్పు-చిటికెడు, నెయ్యి-రెండు పెద్ద చెంచాలు, పంచదార-కప్పు, ఇలాచీ-అర చెంచా, నూనె-సరిపడా.

**తయారీ :** గిన్నెలో మైదా, ఉప్పు, రవ్వ, కరిగించిన నెయ్యి వేసి ఉండలు లేకుండా కలపాలి. దీంట్లో కొన్ని నీళ్లు పోసి చపాతీ పిండిలా కలపాలి. ఈ పిండి ముద్దను బొటనవేలి గోరుతో నొక్కుతూ చిన్న చిన్నగా చేసుకోవాలి. ఆ తర్వాత నూనెలో బంగారు రంగు వచ్చేవరకు వేయించి పక్కన పెట్టుకోవాలి. బాండీలో చక్కెర, యాలకుల పొడి వేసి తగినన్ని నీళ్లు పోసి పొయ్యి మీద పెట్టి తీగపాకం వచ్చేవరకు కలుపుతూ ఉండాలి. ఈ పాకంలో వేయించిన గోరుమిటీలను వేసి కాసేపు నానబెట్టాలి.

# మీ అంచనాలకు తగ్గట్టు లేరా?

**ఆలుమగల మధ్య అనుబంధానికి ప్రత్యేకమైన నిబంధనలేమీ ఉండవు. ఒకరినొకరు అర్థం చేసుకుంటూ, పొరబాట్లు సరిదిద్దు కుంటూ,** ఒకరికొకరు చేయూత నిచ్చుకుంటూ సాగాలి. అప్పుడే ఆ బంధం కలకాలం నిలుస్తుంది. మీరే నేర్పిచండి.. మీరు చిన్నప్పటి నుంచి తక్కువ ఖర్చు, పొదుపు చేసే కుటుంబం నుంచి వచ్చి ఉండొచ్చు. ఎదుటివాళ్లలో నిర్లక్ష్యం, దుబారా కనిపించొచ్చు. మీరు పెరిగిన వాతా వరణం లోని పద్ధతు లు ఒకలా ఉండొచ్చు. మీ భాగస్వామి ఆ పనుల్ని మరోలా చేయొచ్చు. అలాగని మీరే కరెక్టనీ, వారిని ఎత్తిచూపడమే పనిగా పెట్టుకుంటున్నారా? ఇలా చేస్తే అవతలివారు మారడం సంగతి అలా ఉంచితే, మీ వల్ల వారు బాధపడే ప్రమాదం ఉంది. మీకు నచ్చినట్లు చేయాలంటే నెమ్మదిగా చెప్పి అలవాటు చేయించడమేసరైన పని. అలానే ప్రతి పనిలోనూ భాగ స్వామ్యం వేయడం వల్ల ఈ సమస్యను అధిగమించొచ్చు.



**మనసు విప్పి మాట్లాడండి...** కాపురంలో కలతలు సహజమే. అలాగని రోజూ గొడవపడుతుంటే ఎవరూ సంతోషంగా ఉండలేరు. కలతలకు కారణం దాపరికాలు, నిజాయతీ లేకపోవడం, అబద్ధాలు.. వంటివే కాదు.. సరైన సమయం ఇవ్వక పోవడం అని కూడా గుర్తించండి. అది మరిన్ని సమస్యలకు దారితీసి మీ బంధాన్ని చీల్చే యొచ్చు. దీన్ని పోగొట్టు కోవాలంటే భాగ స్వామితో మనసువిప్పి మాట్లాడడమే పరిష్కారం. అప్పటికీ అది సాధ్యం కాకపోతే నిపుణుల సాయం తీసుకోండి. కలిసి కౌన్సెలింగ్‌కి వెళ్లండి. మీ భాగస్వామిపై ప్రేమను వ్యక్తం చేసే తీరు ఒకలా ఉండొచ్చు. అవతలివారు మీపై చూపించే అప్యాయత మరోలా ఉండొచ్చు. కానీ అది తమ అంచనాలకు తగ్గట్లు లేనప్పుడు తీవ్రంగా కుంగిపోతారు. తమ ఉద్వేగాలతో ఎదుటివాళ్ల కాళ్లకు బంధం వేయాలనుకుంటారు. ఇది క్రమంగా మీ మధ్య అనుబంధానికి పెనుప్రమాదంగా మారొచ్చు. అలాంటప్పుడు కలిసి కూర్చుని మాట్లాడుకోండి. మా ఆలోచనల్ని స్పష్టంగా చెప్పగలిగితే సమస్య సద్దుమణిగిపోతుంది.

# మందుల విషయంలో, సొంత నిర్ణయాలు వద్దు!



వైద్యులు రాసిచ్చిన మందులు ఎలా వాడాలో ఒకటికి రెండుసార్లు అడిగి తెలుసుకుంటాం.. పరగడుపున వాడాలా? లేదంటే భోజనం తర్వాత వేసుకోవాలా? అనేదీ నోట్ చేసుకుంటాం. ఇంత జాగ్రత్తగా ఉండే మనం కొన్నిసార్లు 'ఏం కాదులే' అన్న నిర్లక్ష్యంతో, ఏమరపాటుతో ఏమీ తినకుండా ఖాళీ కడుపుతోనే వీటిని తీసుకుంటుంటాం. అయితే ఈ అలక్ష్యమే ప్రాణాల మీదికి తీసుకొస్తుందని బాలీవుడ్ నటి షెఫాలీ జరీవాలా మరణం హెచ్చరిస్తోందంటున్నారు నిపుణులు. ఆమె రోజంతా ఉపవాసం ఉండి ఏం తినకుండానే యాంటీ-ఏజింగ్ మందులు ఇంజెక్షన్లు తీసుకున్నట్లు, దీంతో బిపి పడిపోయి గుండె పోటుకు గురైనట్లు సమాచారం. ఈ క్రమంలో వివిధ రకాల మందులు వేసుకునేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం అవసరమంటున్నారు. నిపుణులు.

**ఈ దుష్ప్రభావాలు తప్పవ!** సాధారణంగా చాలావరకు మందులను ఏదైనా తిన్న తర్వాత మాత్రమే తీసుకుంటారు! అయితే కొన్ని రకాల మందులను మాత్రం పరగడుపునే డాక్టర్ వైద్యులు సూచిస్తున్నారు. ఎందుకంటే ఖాళీ కడుపుతో తీసుకోవడం వల్ల శరీరం వాటిని త్వరగా గ్రహించి, సత్వర అవి పనిచేస్తాయని చెబుతారు. నిజానికి కొన్ని మాటలకే ఈ నియమం వర్తిస్తుందన్న నిపుణులు. అదే నొప్పి నివారిణులు, వాపు తగ్గించే మందులు, జ్వరాన్ని తగ్గించే మందులు, గుండె సమస్యల కోసం వాడే మందులు.. వంటి వాటిని పరగడుపున తీసుకోవడం వల్ల కొన్నిసార్లు శరీరంలో ఇవి దుష్ప్రభావం చూపుతాయ! కడుపు ఖాళీగా ఉన్నప్పుడు వాటిని తీసుకోవడం వల్ల జీర్ణాశయ గోడలపై ప్రతికూల ప్రభావం పడుతుంది! అలాగే ఈ మందు శరీరం త్వరగా శోషించుకోవడం వల్ల.. బీపీ తగ్గడం, చక్కెర స్థాయిల్లో హెచ్చుతగ్గులు, హార్ట్‌బీట్ మార్పులు, నీరసం, అలసట, గుండె సంబంధిత సమస్యలు.. వంటి లక్షణాలు సడన్‌గా తలెత్తే ప్రమాదం ఉంటుంది. ఇక యాంటీ ఏజింగ్ చికిత్సలు తీసుకునే వాడే మందులు, ఇంజెక్షన్లను ఖాళీ కడుపుతో తీసుకోవడం వల్ల వారు గుండెపోటుకు దారితీసే ప్రమాదం ఉందని చెబుతున్నారు. అంతేకాదు.. ఒక్కటి కంటే ఎక్కువ మందులను, ఇంజెక్షన్లను ఒకేసారి తీసుకోవడం కూడా ప్రమాదకరమే అంటున్నారు నిపుణులు.



**ఈ జాగ్రత్తలతో...** మనం తీసుకునే ఆహారం మన శరీరంలోని పీహెచ్ స్థాయిల్ని బ్యాలన్స్ చేస్తుంది. అలాగే మనం తీసుకున్న మందుల్ని శరీరం నెమ్మదిగా గ్రహించేలా.. ఎలాంటి దుష్ప్రభావాలు ఎదురవకుండా రక్షిస్తుంది. అందుకే చాలావరకు మందుల్ని భోజనం చేశాకే వేసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు.


- ఇక థైరాయిడ్ మాత్రలు మొదలైన వాటిని ఖాళీ కడుపుతో వేసుకోవడమే శ్రేయస్కరమని, అవి శరీరానికి చక్కగా పడతాయని సలహా ఇస్తున్నారు.
- అలాగే ఇష్టం వచ్చినట్లుగా కాకుండా రోజూ నిర్ణీత వేళకు మందులు వేసుకోవడమూ ముఖ్యమే!
- ఇకపై ఒక చికిత్స కోసం మందులు వాడుతూ, మరో చికిత్స తీసుకోవడం, థెరపీలు చేయించుకోవడం వల్ల వారు వాడే మందుల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపకుండా వాటిని ఎలా బ్యాలెన్స్ చేయాలో వైద్యులను అడిగి తెలుసుకోవాలి.
- ఏ ఆరోగ్య సమస్యకైనా సొంత వైద్యం పనికిరాదు. సంబంధిత డాక్టర్ను సంప్రదించి వాళ్ల సూచనలు పాటించడం వల్ల ఎలాంటి దుష్ప్రభావాలూ ఎదురుకాకుండా జాగ్రత్తపడచ్చు.
- అలాగే మందులు వాడే విషయంలో కూడా సొంత నిర్ణయాలు కాకుండా. వాటిని ఎప్పుడు, ఎలా తీసుకోవాలి అనేది సంబంధిత వైద్యులను అడిగి తెలుసుకోవాలి . వారి సలహాలను తప్పనిసరిగా పాటించాలి.

# నిద్ర కాదు కునుకు

**ఉద్యోగినుల పరిస్థితి భలే** విచిత్రంగా ఉంటుంది కదూ! మిగిలినరోజుల్లో ఇల్లు, ఆఫీసు పనులతో అలసిపోతాం. పోనీ నెల రోజుల్లో ఏమైనా విశ్రాంతి దొరుకుతుందా ఏంటి? మరుసటి వారానికి సిద్ధమవడం, ఇల్లు సర్దుకోవడం, కావాల్సినవి తెచ్చుకోవడం.. ఈ పరుగుల మధ్య సెలవు ఎలా వచ్చి పోయిందో కూడా అర్థమవడం. ఇంత ఉరుకుల పరుగుల మధ్య నిద్ర మాత్రం ఏం సరిపోతుంది. దీంతో భోజనం చేసాకో, పనితో అలసి పోయాకో ఆఫీసులో అప్పుడప్పుడూ కళ్లు మూతలు పడటం మామూలే. అలాగని నిద్రపోలేం. ఎలాగోలా ప్రయత్నిద్దామన్నా నిద్రను అపుకొంటూ చేద్దామన్నా పనీ ముందుకు సాగదు. అలాంటప్పుడు జపనీయులు ఏం చేస్తారో తెలుసా? 'ఇనెమురి'ని ప్రయత్నించారు. అంటే పడుకోవడమే కానీ ప్రస్తుతం ఉండటమని అర్థమట. అదెలాగంటారా? అలసటగా అనిపించినప్పుడు నిద్ర వస్తున్నప్పుడు కుర్చీలో వెనక్కి వాలో, ముందుకు వంగి బల్లమీద తల అన్చీ పడుకోవడమే. అలాగని గాఢ నిద్రలోకి జారకూడదు. విశ్రాంతి తీసుకున్నా... పక్కనవాళ్ల పిలవగానే పలికే స్థితిలో ఉంటారు. దీన్నే ఇనెమురి అంటారు. ఈ చిన్న కునుకు మెదడుకు విశ్రాంతిని ఇవ్వడమే కాదు. ఉత్పాదకతను పెంచుతుందట. అందుకే అక్కడి కళాశాలలు, ఆఫీసుల్లో ఎవరైనా ఇలా చిన్న కునుకు వేస్తుంటే పనిచేయట్లేదు. బద్ధకి స్తున్నారు అనుకోరట. కష్టపడ్డారు. విశ్రాంతి తీసుకుంటున్నారనరట.



# జ్ఞాపకశక్తి పెరగాలంటే..



**ఒకప్పుడు పెద్దవాళ్లు** మాత్రమే మతిమరపుతో బాధపడేవారు. ఇప్పుడలా కాదు. అందరికీ జ్ఞాపకశక్తి తగ్గిపోతోంది. దీనికి ఒత్తిడీ, ఆందోళనే ముఖ్య కారణం. యోగా, వ్యాయామాలతో చాలావరకూ ఒత్తిడి తగ్గుతుంది. మెదడు ఉత్సాహంగా పనిచేయాలంటే.. జీవనశైలి కూడా సరిగ్గా ఉండాలి. రాత్రి పదింటిలోపు పడుకుని ఉదయం ఐదింటికల్లా నిద్ర లేవాలి. దాంతో పాటు ఈ ఆహార పదార్థాలనూ క్రమం తప్పకుండా తింటుండాలి.
- ఆకలి తీరితే చాలనుకుని అన్నంలో పచ్చడో, రసమో కలిపి తినడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదు. ప్రొటీన్లు ఉన్న పప్పుధాన్యాలు తినాలి. మంచి పోషకాహారం అందితే మెదడు చురుగ్గా పనిచేస్తుంది.
- ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్స్, యాటీ ఆక్సిడెంట్స్ ఉన్న బాదం, పిస్తా, వాల్‌నట్స్, జీడిపప్పు లాంటివి తినడం వల్లమెదడులో కణాలు పాడవు. దాని పనితీరూ మెరుగవుతుంది.
- బ్రొకోలీలో మెదడుకు చాలా అవసరమైన కె-విటమిన్ విస్తారంగా ఉంటుంది. ఇది జ్ఞాపకశక్తి తగ్గకుండా కాపాడుతుంది.
- నేరేడు, స్ట్రాబెర్రీస్, రేగుపండ్లు, ఉల్లి, వెల్లుల్లి, అవొకాడోల్లో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇవి మెదడు పనితీరు బాగుండేలా చేస్తాయి. అప్పుడప్పుడూ డార్క్ చాక్లెట్ తిన్నా మెదడు పనితీరులో సమస్య రాదు.
- చివరగా మరో విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఏదో తప్పదన్నట్టుగా కాకుండా. ఆస్వాదిస్తూ తినడం వల్ల ఆహారం చక్కగా వంటబడుతుంది.

ఆసియా స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో..

# స్వర్ణంతో చరిత్ర సృష్టించిన శ్రేయసి



**న్యూఢిల్లీ:** ఆసియా రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్-2025లో భారతదేశంలోని అగ్రశ్రేణి ఇన్‌లైన్ స్కేటర్లలో ఒకరిగా ఎదిగిన శ్రేయసి జోషి సంచలన ప్రదర్శన చేసింది. దక్షి ణ కొరియాలో గురువారం జరిగిన ఆసియా రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఇన్‌లైన్ ఫ్రీస్టైల్‌క్లాసిక్ స్లాలోమ్ ఈవెంట్‌లో శ్రేయసి జోషి స్వర్ణం సాధించి చరిత్ర సృష్టించింది. సీనియర్ బాలికల విభాగంలో ఆమె 83.33 పాయింట్లతో అత్యధిక స్కోరును నమోదు చేసింది. ఫలితంగా 21 ఏళ్ల ఈ స్కేటర్ ఆసియా టైటిల్ గెలుచుకున్న తొలి భారతీయురాలిగా నిలిచింది. కాగా పూణేలో జన్మించిన శ్రేయసి మరియు 9 సార్లు జాతీయ ఛాంపియన్ అయిన ఆమె సోదరి స్వరాలి చిన్న వయసులోనే స్కేటింగ్ ప్రారంభించారు. ఆరేళ్ల వయసులోనే ఈ జంట జాతీయ స్థాయిలో విజయం సాధించింది. 10 సార్లు జాతీయ ఛాంపియన్ అయిన శ్రేయసి, 2022 హాంగ్‌జౌ ఆసియా క్రీడలలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన పూణే నుండి ఏడుగురు స్కేటర్లలో ఒకరుగా ఉంది. 12 సంవత్సరాల వయస్సులో, శ్రేయసి చైనాలోని నాన్జింగ్‌లో జరిగిన 2017 ప్రపంచ రోలర్ క్రీడలలో ఫ్రీస్టైల్ మరియు స్పీడ్ స్లాలోమ్‌లలో పోటీ పడింది. ఆమె వరుసగా 20వ మరియు 22వ స్థానాల్లో నిలిచింది. శ్రేయసి మరియు ఆమె సోదరి స్వరాలి ఆగస్టు 7-17 తేదీలలో పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనాలోని చెంగ్డులో జరగనున్న 2025 ప్రపంచ క్రీడలపై దృష్టి సారించారు.

వరల్డ్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్..

# అనాహత్ వరుసగా మూడో విజయం



న్యూఢిల్లీ: ప్రపంచ జూనియర్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్-2025లో భారత్ క్రీడాకారిణి అనాహత్ సింగ్ దూసుకుపోతోంది. ఈజిప్టులోని కైరోలో జరిగిన ప్రపంచ జూనియర్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్‌లో మహిళల సింగిల్స్ విభాగంలో అనహత్ తన ఆధిపత్య ప్రదర్శనను కొనసాగించి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. రెండో సీడ్ భారత క్రీడాకారిణి ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌లో బ్రెజిల్‌కు చెందిన లారా డా సిల్వాను 11-5, 11-2, 11-6 తేడాతో ఓడించి, టోర్నమెంట్‌లో వరుసగా మూడో గేమ్ విజయాన్ని నమోదు చేసింది. అంతకుముందు 17 ఏళ్ల భారత క్రీడాకారిణి మరో స్ట్రెయిట్‌గేమ్ మ్యాచ్‌లో ఫ్రెంచ్ క్రీడాకారిణి ఇనెస్ గుయోట్‌తో (11-1, 11-6, 11-1) తన రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌ను గెలుచుకుంది. మహిళల సింగిల్స్ రౌండ్ ఆఫ్ 16లో మిగిలి ఉన్న ఏకైక భారత ప్రతినిధి ఆమె. మిగిలిన నలుగురు పోటీదారులు అనికా దుబే, రుద్ర సింగ్, ఆరాధ్య పోర్వాల్ మరియు నవ్య సుందరరాజన్ రెండవ రౌండ్‌లోనే ఓడిపోయారు. అనాహత్ ఇప్పుడు పతకానికి కేవలం ఒక అడుగు దూరంలో ఉంది, ఆమె ఈజిప్టుకు చెందిన మలికా ఎల్కరాక్సీ మరియు అమెరికాకు చెందిన సమంతా జాఫీ మధ్య జరిగే మ్యాచ్ విజేతతో తలపడనుంది. మరోవైపు మూడో రౌండ్ మ్యాచ్‌లలో అరిహంత్ కెఎస్, యుషా నఫీస్, ఆర్యవీర్ దివాన్ అనే ముగ్గురు ఆటగాళ్లు ఓడిపోవడంతో భారత పురుషుల సింగిల్స్ ప్రచారం ముగిసింది.

# ఆసియాకప్‌లో హైవోల్టేజ్ మ్యాచ్

## పాకిస్థాన్‌తో భారత్ ఢీ.. తటస్థ వేదికల్లో ఆడేందుకు బిసిసిఐ గ్రీన్‌సిగ్నల్

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది ఆసియా కప్ జరగనుంది. ఈ టోర్నమెంట్‌కు సంబంధించిన షెడ్యూల్ ఇంకా ప్రకటించాల్సి ఉంది. ఈ టోర్నీలో భారత్, పాకిస్తాన్ ఒకే గ్రూప్‌లో ఉండొచ్చని తెలుస్తున్నది. భారత క్రికెట్ నియంత్రణ బోర్డు (బీసీసీఐ) ఈ టోర్నమెంట్‌ను తటస్థ వేదికలో నిర్వహించడానికి అంగీకరించింది. ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) నుంచి ఉటంకిస్తూ బీసీసీఐ సెప్టెంబర్‌లో యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్ (యూఏఈ) ఆసియా కప్‌ను నిర్వహించే అవకాశం ఉంది. టోర్నీలో భారత్, పాక్ మధ్య మ్యాచ్ జరిగే అవకాశం ఉందని పేర్కొంది. ఇదిలా ఉంటే ఆసియా కప్‌కు సంబంధించి కొద్దిరోజుల్లే ప్రకటన వెలువడే అవకాశం ఉందని బీసీసీఐ కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా తెలిపారు. ఆసియా కప్‌ను యూఏఈ నిర్వహిస్తున్నందున భారత జట్టు పాక్‌తోను బీసీసీఐ ఆడుతుందని ఏసీసీ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా తెలిపింది. ఆసియా కప్ వేదికపై చర్చించేందుకు ఏసీసీ సభ్యదేశాలన్నీ సమావేశమైన



విషయం తెలిసిందే. బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా వర్చువల్‌గా సమావేశంలో పాల్గొన్నారు. సెప్టెంబర్‌లో పక్షం రోజుల పాటు ఈ టోర్నీ జరుగనున్నది. ఇదే నెల చివరి వారం నుంచి వెస్టిండిస్‌తో భారత్ టెస్ట్ సిరీస్ ఆడనున్నది. ఢాకాలో ఏసీసీ చైర్మన్, పాకిస్తాన్ బోర్డు చీఫ్ మొహ్సిన్ నఖ్వీ కూడా ఈ కాంటినెంటల్ ఈవెంట్‌లో ఇండోపాక్ మ్యాచ్‌పై ప్రశ్నించగా త్వరలోనే వివరాలను ప్రకటిస్తామన్నారు. బీసీసీఐతో చర్చలు జరిపామని కొన్ని సమస్యలు త్వరలోనే కొన్ని సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. 25 మంది సభ్యుల్లో డైరెక్టర్‌గా కొందరు, మరికొందరు వర్చువల్‌గా పాల్గొన్నారని నఖ్వీ తెలిపారు. అయితే బీసీసీఐ ఒత్తిడి నేపథ్యంలో ఎజెండాలోని పది అంశాల్లో కేవలం రెండింటిపై మాత్రమే చర్చించినట్లు సమాచారం.



# సన్‌రైజర్స్ హైదరాబాద్ విస్తరణ

## నార్తర్న్ సూపర్ ఛార్జర్స్ కొనుగోలు

## వరల్డ్ క్రికెట్‌లో తదుపరి అడుగు

## ఇప్పటికే సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ టోర్నమెంట్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు యజమానిగా ఉన్న కావ్య మారన్ ప్రస్తుతం తన సామ్రాజ్యాన్ని ఇంగ్లాండ్ వరకు విస్తరించారు. ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు నిర్వహించే "ది హండ్రెడ్" క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే నార్తర్న్ సూపర్ ఛార్జర్స్ జట్టును సన్ టీవీ నెట్‌వర్క్ అధికారికంగా కొనుగోలు చేసింది. ఈ మెగా ఒప్పందం విలువ సుమారు 100.5 మిలియన్ పౌండ్లు అంటే భారత విలువలో దాదాపు రూ.1.161 కోట్లు. ఈ అతిపెద్ద కొనుగోలు ద్వారా సన్‌రైజర్స్ గ్రూప్ ప్రపంచ క్రికెట్ రంగంలో తన తదుపరి అడుగు వేసింది. నార్తర్న్ సూపర్‌ఛార్జర్స్ జట్టు గత ఆర్థిక సంవత్సరం ఆదాయం కేవలం రూ.22 కోట్లు ( 1.89 మిలియన్లు) మాత్రమే. అయితే, సన్ టీవీ గ్రూప్ అంతకంటే 53 రెట్లు ఎక్కువ ధర చెల్లించి, అంటే రూ.1,161 కోట్లకు కొనుగోలు చేసింది. ఇది చాలామందికి ఆశ్చర్యం కలిగించినప్పటికీ, దీని వెనుక ఒక బలమైన కారణం ఉంది. ఈ జట్టు ఇప్పటికే లాభాల్లో నడుస్తోంది. అంతేకాకుండా, 100 బంతులు మాత్రమే ఉన్న "ది హండ్రెడ్" టోర్నమెంట్, ప్రపంచ వ్యాప్తంగా అభిమానులలో వేగంగా ప్రాచుర్యం పొందుతోంది. దీని భవిష్యత్ వృద్ధిని పరిగణనలోకి తీసుకునే సన్ టీవీ ఈ పెట్టుబడిని పెట్టింది. ఈ ఒప్పందానికి సంబంధించిన అన్ని పనులు డిసెంబర్ 31, 2025 లోపు పూర్తవుతాయని ఆశిస్తున్నారు. కాగా సన్ టీవీ గ్రూపునకు క్రికెట్ జట్లను నిర్వహించడం కొత్తేమీకాదు. ఇప్పటికే ఐపీఎల్ టోర్నమెంట్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టును, దక్షిణాఫ్రికాలో జరిగే ఎస్ఏ20 టోర్నమెంట్‌లో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ జట్టును విజయవంతంగా నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ప్రస్తుతం మూడో ఖండంలో మూడో జట్టుగా నార్తర్న్ సూపర్ ఛార్జర్స్ జట్టును కొనుగోలు చేసింది. ఈ విషయంపై స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు అందించిన నివేదికలో క్రీడా రంగంలో మా ప్రపంచ స్థానాన్ని విస్తరించే లక్ష్యంతో ది హండ్రెడ్‌టోర్నమెంట్‌లో భాగంగా ఉన్ననార్తర్న్ ఛార్జర్స్ క్లబ్‌లో పెట్టుబడిపెట్టాం అని సన్‌టీవీ పేర్కొంది.

# చైనా ఓపెన్‌లో ప్రణయ్ నిష్క్రమణ

## క్వార్టర్ ఫైనల్స్‌కు సాత్విక్-చిరాగ్

**న్యూఢిల్లీ:** చైనా ఓపెన్-2025 టోర్నమెంట్‌లో హెచ్ఎస్ ప్రణయ్ మళ్ళీ అస్థిరతతో ఇబ్బంది పడ్డాడు. మొదటి రౌండ్‌లో కష్టపడి గెలిచినా రెండో రౌండ్‌లో పోరాడి ఓడి నిష్క్రమించాడు. చైనాలోని చెంగ్జౌలో జరిగిన గురువారం జరిగిన రెండవ రౌండ్‌లో ప్రణయ్ చైనీస్ తైపీకి చెందిన చౌ





టియెన్ చెన్ చేతిలో 21-18, 15-21, 8-21 తేడాతో ఓడిపోయాడు. మొదటి గేమ్‌లో ప్రణయ్ బలంగా ఆడి ప్రారంభంలో 4 పాయింట్ల ఆధిక్యాన్ని సాధించాడు, చౌ ఆలస్యంగా ఆధిక్యంలోకి వెళ్ళినప్పటికీ అతను దానిని అంతటా కొనసాగించాడు మరియు మొదటి గేమ్‌ను కైవసం చేసుకున్నాడు. రెండవ గేమ్‌లో అతను చాలా గట్టి ఆరంభాన్ని పొందాడు, ఇద్దరు ఆటగాళ్లు దగ్గరగా ఉండటంతో స్కోరు 13-13తో సమంగా ఉంది. అయితే, ప్రణయ్ ఆ తర్వాత వరుసగా ఆరు పాయింట్లు కోల్పోయాడు. ఇది ఆట వేగాన్ని పూర్తిగా మార్చివేసింది. ఈ మ్యాచ్ నిర్ణయాత్మక మ్యాచ్‌లోకి ప్రవేశించింది, ప్రపంచ 6వ నంబర్ ఆటగాడు చౌ, రెండు తీవ్రమైన మరియు హోరాహోరీగా జరిగిన ఆటల తర్వాత ప్రణయ్ ఇబ్బందులు పడటంతో అతనిపై సులభంగా గెలిచాడు. ఇక చివరి సూపర్ 1000 టోర్నమెంట్ ఆఫ్ ది ఇయర్, చైనా ఓపెన్‌లో భారత పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి-చిరాగ్ శెట్టి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు. 16వ రౌండ్ పోరులో సాత్విక్ మరియు చిరాగ్ ద్వయం 21-19, 21-19 తేడాతో ఇండోనేషియాకు చెందిన ఉన్నత శ్రేణి జంట లియో కర్నాండో మరియు బాగాస్ మోలానాపై వరుస గేమ్‌లను గెలుచుకుంది. గత నెలలో ఇండోనేషియా ఓపెన్ మొదటి రౌండ్ మ్యాచ్‌లో లియో మరియు బాగాస్‌లపై విజయం సాధించిన తర్వాత భారత జంటకు ఇది వరుసగా రెండో విజయం.



# విస్తృత చర్చలతో కుదిరిన ఒప్పందం

## ఫార్మా, వ్యవసాయం, వస్త్ర పరిశ్రమకు ఎంతోమేలు!

**లండన్,జూలై 24:** బ్రిటన్ భారత్‌లమధ్య జరిగిన స్వేఛ్ఛా వాణిజ్య ఒప్పందంతో వ్యవసాయం, ఫార్మారంగాలకు మంచి బూస్ట్ లభిస్తుందని మార్కెట్‌నిపుణుల అంచనా. రెండుదేశాలమధ్య ఆర్థికపరస్పర భాగస్వామ్యంకోసం స్వేఛ్ఛా విపణి వాణిజ్యఒప్పందంపై ఇరువురుప్రధానులు నరేంద్రమోడీ,కీర్ స్టార్మర్లు సంతకాలుచేసారు. అధికారికంగా గురువారమే ఈ పత్రాలు విడుదలయ్యాయి. కొన్నేళ్లపాటు సమగ్ర చర్చలు సంప్రదింపులు జరిపిన తర్వాత నరేంద్రమోడీ చొరవతో ఈ ఒప్పందం కార్యరూపంలోకి వచ్చింది. భారత ఫార్మారంగం ఈ ఒప్పందంతో భారీ ప్రయోజనాలు రాబట్టుకుంటుందని అంచనా.

స్వల్పస్థాయిలో మాత్రమే సుంకాలుంటాయి. భారత ఫార్మా ఎగుమతులు ప్రస్తుతం బ్రిటన్‌కు 100 కోట్ల డాలర్లుగా ఉనానయి. అలాగే యుకె దిగుమతులు 30 బిలియన్ డాలర్ల విలువైనవి ఉన్నాయి. జనరిక్స్, మెడ్‌టెక్ విభాగాల్లో ఈసుంకాల తొలగింపులవల్ల ఫార్మారంగానికి భారీ ప్రయోజనం చేకూరుతుందని అంచనా. ఇక వ్యవసాయ రంగం పరంగా 95శాతం డ్యూటీ ఫ్రీ విభాగంలోకి వస్తాయి. ఆహార గింజ ఉత్పత్తులు అంటే పసుపు, మిరియాలు, యాలకులు, మామిడి గుజ్జు, జలచరాల ఉత్పత్తులు ష్రింప్, తునా రొయ్యలు, చేపల ఉత్పత్తులకు భారీ ప్రయోజనం చేకూరుతుంది. ఈ ఒప్పందం వల్ల భారత్‌నుంచి వ్యవసాయ ఎగుమతులు పెరుగుతాయి. వచ్చే మూడేళ్లలోనే 20శాతంపెరుగుతాయని అంచనా. అంతేకాకుం బనారసి, చందేరి వారసత్వ ఉత్పత్తులు, వస్త్రాలు వంటివాటికి పూర్తి స్థాయిలోమేలుజరుగుతుంది. చేతివృత్తులు, హస్తకళల తయారీలకు మంచి ప్రయోజనమని చెపుతున్నారు. ఇక వస్త్రపరిశ్రమలకు ఈ సుంకాల భారం తగ్గుతుంది. అంతకుముందు 12శాతంగా ఉన్న సుంకాలు పూర్తిగా తొలగించారు. బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లు కొంతమేర పోటీ ఇచ్చినప్పటికీ ఈ సుంకాల తొలగింపుతో భారత్‌కు ఎంతోమేలు జరుగుతున్నది. అలాగే ఆభరణాల రంగానికి భారీ ఊతం లభించింఇ. భారత జ్యూయెలరీ రంగానికిసుంకాల సడలింపులు ఉన్నాయి. వచ్చే రెండుమూడేళ్లకుగాను ఎగుమతులు రెట్టింపు అవుతాయని అంచనా. 3బిలియన్ డాలర్ల ఆభరణాలను సాలీనా యుకె దిగుమతిచేసుకుంటున్నది. ప్రస్తుతం 941 మిలియన్ డాలర్లుగా ఈ ఆభరణాల ఎగుమతులు ఉంటాయని అంచనా. ఇక స్కాచ్ విస్కీ ధరలు కూడా తగ్గుతాయి. భారత్‌కు ఎక్కువగా బ్రిటన్‌తయారీ స్కాచ్ వస్తుంది. దీనివల్ల భారత్‌లో ధరలు తగ్గే అవకాశం ఉంది. అలాగే ఎక్సైజ్ రాబడులుకూడా పెరుగుతాయని అంచనా. వచ్చే 12 నెలల్లో వీటి ధరలు తగ్గి అన్ని వర్గాలకు స్కాచ్ అందుబాటులోకి వస్తుందని అంచనా. ఇక భారత్ ఎగుమతిమార్కెట్‌కు బ్రిటన్ కూడా తోడు కావడంతో సేవలరంగానికి మంచి ఊతం లభిస్తుంది. భారతీయ ఐటి, ఫైనాన్స్, విద్య ఇతర సేవారంగా నిపుణులకు యుకెలో మంచి మార్కెట్ లభిస్తుంది. డిజిటల్ సేవల్లో భారత్ ఇప్పటికే ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందింది. భారతీయ చెఫ్‌లు, యోగా శిక్షకులు, సంగీతకారులు యుకె జాబ్ మార్కెట్‌కు సులువుగా చేరుకోగలుగుతారని నిపుణుల అంచనా.

బజాజ్ ఫైనాన్స్‌కు నికరవడ్డీ

# ఆదాయం బూస్ట్!

**ముంబయి,జూలై 24:** బజాజ్‌ఫైనాన్స్‌కు తొలిత్రైమాసికంలో నికరవడ్డీ ఆదాయం భారీవృద్ధిని నమోదుచేసింది. 22శాతం వృద్ధితో మొత్తం నికర లాభం రూ.4765 కోట్లు ఆర్జించినట్లు కంపెనీ గురువారం ప్రకటించింది. మార్చితోముగిసిన తొలిత్రైమాసికంలో గత ఏడాది 3940 కోట్లుమాత్రమే ఆర్జించింది. అదే జూన్‌త్రైమాసికంలో 22శాతం పెరిగి 10,227 కోట్లు ఆర్జించింది.గత త్రైమాసికంలో 8910 కోట్లు ఆర్జించింది. స్థిరాస్తిప్రమాణాలు మాత్రం క్షీణించాయి. స్థూల నిరర్థక ఆస్తులు 1.03శాతంగా ఉంటే గత త్రైమాసికంలో 0.96శాతం మాత్రమే ఉన్నాయి. నికర నిరర్థక ఆస్తులు 0.5శాతంగా ఉన్నాయి. గత త్రైమాసికంతోపోలిస్తే స్వల్పంగాపెరిగాయి. నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ అయిన బజాజ్‌ఫైనాన్స్ ఈ త్రైమాసికంలో కేటాయింపులు 26శాతంపెరిగి 2120 కోట్లుగా ఉన్నాయి. క్రమానుగతంగా 2300 కోట్లవరకూ ఉన్నట్లు కంపెనీ ప్రకటించింది.




ప్రస్తుత నిర్వహణలో ఉన్న బజాజ్‌ఫైనాన్స్ ఆస్తులు 25శాతంపెరిగి 4.41 లక్షలకోట్లకు పెరిగాయి. పెరుగుదలకు ఎక్కువగా తనఖా ఆస్తులు వాటా ఎక్కువ ఉంది. 1.09 లక్షలకోట్లు ఇవే ఉన్నాయి. పట్టణ బిజినెస్ రుణాలు 29శాతంపెరిగి 71,628 కోట్లకు చేరాయి. ఎస్ఎంఇ రుణపరపతి కూడా 29శాతంపెరిగి 40,791 కోట్లకు చేరింది. త్రీవీలర్‌ఫైనాన్స్ 20శాతం క్షీణించి 19,689 కోట్లుగా ఉంటే గ్రామీణప్రాంతాల్లో బి2సి రుణాలు 20శాతంపెరిగి 17,770 కోట్లకు చేరాయి. కార్లరుణాలు 44శాతంపెరిగి 8710 కోట్లకు చేరాయి. బంగారం తాకట్టు రుణాలుకూడా 82శాతంపెరిగి 5494 కోట్లవరకూ ఉన్నట్లు కంపెనీ ప్రకటించింది. నాన్‌బ్యాంక్ సంస్థ అయిన బజాజ్‌ఫైనాన్స్‌లో డిపాజిట్లు కూడా 15శాతంపెరిగి 72,109 కోట్లకు చేరాయి.

## వాణిజ్యం




# కేంద్రానికి ఎల్ఐసి డివిడెండ్ రూ.7324 కోట్లు

**న్యూఢిల్లీ,జూలై 24:** ప్రభుత్వరంగంలోని జీవితభీమా సంస్థనుంచి కేంద్ర ప్రభుత్వానికి ఈఏడాది 7324 కోట్లరూపాయలు డివిడెండ్‌రూపంలో అందుతున్నది. దేశంలోనే అతిపెద్ద బీమా కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఈమేరకు ప్రభుత్వంనికి ప్రతి వాటాకు 12రూపాయలుచొప్పున డివిడెండ్ ఇవ్వాలనినిర్ణయించింది. 2025 మార్చి 31వ తేదీతోముగిసే ఆర్తికసంవత్సరానికిగాను ఈ డివిడెండ్ అందుతుంది. అయితే కార్పొరేషన్ సర్వసభ్యసమావేశంలో ఆమోదం పొందాల్సి ఉంది.

ఆగస్టు 26వ తేదీ ఎల్ఐసి సర్వసభ్య సమావేశం జరుగుతుందని స్టాక్ ఎక్ఛేంజిలకు నివేదిక్చింది. అలాగే అర్హులైన వాటాదారులకు జులై 25వతేదీ గడువుతేదీగా డివిడెండ్‌చెల్లింపునకు నిర్ణయించింది. అర్హులైన వాటాదారులందరూ ప్రతి వాటాకు 12రూపాయలుచొప్పున డివిడెండ్ పొందుతారు. బిఎస్ఇవద్ద అందుబాటులో ఉన్న గణాంకాలను పరిశీలిస్తే కేంద్రానికి ఎల్ఐసిలో 96.50శాతం షేర్లు ఉన్నాయి. అంటే 6,10,36,22,781 ఈక్విటీ వాటాలు కేంద్రానికి ఉన్నట్లు తెలిసిందే. ఇపుడు ఈ వాటాలన్నింటినీ కలిపి గణించి మొత్తం డివిడెండ్‌రూపంలో రూ.7324 కోట్లు అందించేందుకు ఎల్ఐసి నిర్ణయించింది.

# ది ఎగ్జిక్యూటివ్ ఇండియా రూ.2600 కోట్ల నిధుల సమీకరణ

**బెంగళూరు,జూలై 24:** బెంగళూరుకేంద్రంగాపనిచేస్తున్న ది ఎగ్జిక్యూటివ్ సెంటర్ కంపెనీ తాజాగా 2600 కోట్లరూపాయలు నిధులు సమీకరటించాలని నిర్ణయించింది. ఈమేరకు సెబీ వద్ద డిఆర్‌హెచ్‌పి దాఖలుచేసింది. ఎన్ఎస్ఇ, బిఎస్ఇల్లో లిస్టింగ్‌చేసేందుకు కూడా కంపెని నిర్ణయించింది. టెక్ అబుదాబిలో ఈ నిధులను పెట్టుబడులుగాపెట్టాలని, కంపెనీకి అనుబంధంగా దుబాయి యూనిట్ పనిచేస్తున్నందున మరింత విస్తరణకు ఈనిధులు వెచ్చించాలని నిర్ణయించింది. టిఇసి సింగపూర్(ఎస్‌జిపి), టెక్‌దుబాయి, రెండు అనుబంధ సంస్థలు కూడా ముందు టెక్ సింగపూర్‌పరిధిలోనే పనిచేస్తున్నాయి. కోటక్ మహీంద్ర క్యాపిటల్‌కంపెనీ, ఐసిఐసిఐ సెకూనయరిటీస్, నోమురా ఫైనాన్షియల్ అడ్వ యిజరీ సెక్యూరిటీస్, సంస్థలు బుక్‌రన్నింగ్ లీడ్‌మేనే జర్లుగా వ్యవహరిస్తున్నాయి. ఆఫర్‌ఫర్‌సేల్ కంపెనీపరంగా ఇప్పటివరకూ వెల్లడికాలేదు. అయితే సెబీకి మాత్రం దరఖాస్తుచేసింది. కొన్ని ప్రత్యేక సెక్యూరిటీలనున జారీచేసి ప్రాధాన్యతా ఆఫర్ లేదా నిర్దేశిత మరే ఇతర విధానం లో అయినా సరే 5200 మిలియన్ రూపాయలు సమీకరిం చేందుకు నిర్ణయించింది. అయితే డిఆర్ఎహెచ్‌పితోపాటు రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీలవద్దకూడా దాఖలుచేసింది. ఐపిఒ ప్లేస్‌మెంట్‌కకు ముందస్తుప్రక్రియగానే కంపెనీ చెపుతోంది. కంపెనీ ఎండి మనిష్ ఖేడియా మాట్లాడుతూ వచ్చే మూడేళ్లలో గణనీయమైన వృద్ధిని సాధిస్తామని, 25నుంచి 30 శాతం సిఎజిఆర్‌సాధించగలమని చెపుతున్నారు. ప్రస్తుతం 18నుంచి 20శాతం వృద్ధిసాధించామని, అదనంగా మా పెట్టుబడులను ఈ కాలంలో మరింతగా పెంచుకుంటామని ఎండి వెల్లడించారు. కంపెనీ ప్రీమియం ఫ్లెక్సిబుల్ స్పేస్ సొల్యూషన్స్‌ను అందిస్తోంది. భారత్; సింగపూర్; మద్యప్రాచ్యం, దుబాయి, అబూదుబాయి, యుఎఇ, ఆసియా, ఇండోనేసియాలోనిజకార్తా, వియత్నంలోని హోచిమిన్‌సిటీ, ఫిలిప్పైన్స్‌లోని మనిలా, శ్రీలంకలోని కొలంబో నగరాల్లో ప్రీమియం స్పేస్ వాణిజ్యకార్యకలాపాలునిర్వహిస్తోంది.





# అదానీ నికరలాభం రూ. 512.48 కోట్లు

**ముంబయి,జూలై 24:** ఆదానిఎనర్జీ సొల్యూషన్స్ తొలిత్రైమాసికంలో 512.48 కోట్ల నికరలాభం నమోదుచేసింది. గత ఏడాది ఇదేకాలానికి 823.92 కోట్లనష్టం చవిచూసిన కంపెనీ క్రమేపీ కోలుకుంది. అయితే లాభం మాత్రం వార్షిక పద్ధతిలోచూస్తే 20.8శాతం తగ్గింది. నాలుగోత్రైఆమిసంలో 647.15 కోట్లుగా ఉన్నట్లు తేలింది. లావాదేవీలద్వారా కంపెనీల రాబడులు 26.78శాతంపెరిగి 6819.28 కోట్లకు చేరాయి. ఇదే తొలిత్రైమాసికం వరకూ చూస్తే 5378.55 కోట్లుగా ఉంది. గతనాలుగోత్రైమాసికంలో 6347.58 కోట్ల నుంచి 7.4శాతంపెరిగినట్లు కంపెనీ ప్రకటించింది. కంపెనీ ఖర్చులు తొలిత్రైమాసికంలో 32శాతంపెరిగి 5863.55 కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదేకాలంలోచూస్తే 4443 కోట్లు కాగా నాలుగోత్రైమాసికంలో 5411.6కోట్లుగా ఉన్నాయి. అంటే 8.35శాతంపెరిగాయి. పన్నులచెల్లింపులకు ముందు రాబడులు 14శాతంపెరిగి 2017 కోట్లుగా ఉన్నాయి. తొలిత్రైమాసికంలో ఆదాని ఎనర్జీ మూడు ట్రాన్స్‌మిషన్‌ప్రాజెక్టులను ప్రారంభించింది. ఖావ్‌డా ఫేజ్2 పార్ట్-ఎ గురజాత్, ఖావ్‌డా పూలింగ్‌స్టేషన్‌వన్; కెపిఎస్‌వన్, సంగోడ్ (రాజస్థాన్)లలో ప్లాంట్లను ప్రారంభించినట్లు వెల్లడించింది. అలాగే తాలేగాంవ్‌లైన్‌లో కొత్త ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టుకూడా ప్రస్తుతం పూర్తికావచ్చే దశలో ఉంది. దీనితో కంపెనీ ఆర్డర్‌బుక్ 59,304 కోట్లుగా ఉంది. ఆదాని ఎనర్జీ సొల్యూషన్స్ 849.4 చొప్పున బిఎస్ఇలో ట్రేడ్ అయ్యాయి. ప్రతిషేరుకు రాబడి రూ.4.27గా కంపెనీ గణించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.